


'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 83

శుక్రవారం 14-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చాంపియన్ దివ్య

ప్రపంచ జూనియర్ మహిళల చెస్ టోర్నీలో విజేతగా భారత క్రీడాకారిణి - 15లో



సీపీఐ పుష్- మార్కెట్ రికార్డ్స్


సెన్సెక్స్ 204 పాయింట్లు అప్.. 76,811 వద్ద ముగింపు - 15లో



ఎన్ఎస్ఏగా మళ్లీ అజిత్ దోవల్

జాతీయ భద్రతా సలహాదారుగా మాజీ ఐపీఎస్ అజిత్ దోవల్‌ను కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


- వివరాలు 6లో



బండి లేకున్నా బాదుడే

చోరీకి గురైన వాహనం ఏళ్లుగా దొరక్కపోయినా.. దాన్ని ఉన్నట్టుగానే పరిగణించి ఆర్టీఏ పన్ను విధిస్తోంది.

- వివరాలు 8లో



ఢిల్లీలో దాహం.. దాహం

పొరుగు రాష్ట్రాల నుంచి నీటి సరఫరా తగ్గడంతో ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో నీటి ఎద్దడి దారుణంగా పెరిగింది.

- వివరాలు 6లో



మహిళా శక్తి క్యాంటీన్లు

రాష్ట్రంలో కొత్తగా మహిళా శక్తి క్యాంటీన్ సర్వీసులను అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు సీఎస్ తెలిపారు.

- వివరాలు 7లో

బిగుస్తున్న 'గొర్రెల' ఉచ్చు

కుంభకోణంలో ప్రజాప్రతినిధులు కేంద్రంగా దర్యాప్తు!

ఏసీబీతో పాటు రంగంలోకి ఈడీ

- మనీలాండరింగ్ అంశంపై కేసు నమోదు... ఏసీబీ కేసు ఆధారంగా ఈసీఐఆర్
- సమగ్ర సమాచారం కోరుతూ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ ఎండీకి లేఖ
- అత్యవసరంగా పరిగణించి అందజేయాలంటూ సూచన
- ఇప్పటికే 9 మంది అరెస్టు.. పరారీలో ఉన్న కాంట్రాక్టర్లు దొరికితే కొత్త కోణాలు వెలుగులోకి!... నేడు పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి ఈడీ అధికారులు?



సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకం కుంభకోణంలో ప్రజాప్రతినిధులు కేంద్రంగా ఉచ్చు బిగుస్తోంది. ఒకవైపు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తు కొనసాగిస్తుండగా..మరోవైపు మనీలాండరింగ్ అంశంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. కొనుగోలు చేసిన గొర్రెలనే మళ్లీ మళ్లీ కొన్నట్టు చూపడంతో పాటు ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై అప్పటి మంత్రి పేషీ కేంద్రంగా జరిగిన ఈ గోల్‌మాల్‌లో రూ.700 కోట్ల వరకు నిధులు దారి మళ్లినట్టు ఏసీబీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించిన విషయం విదితమే. ఈ మొత్తం కుంభకోణంలో ఇప్పటివరకు ఏసీబీ అరెస్టు చేసిన అధికారుల విచారణతో పాటు మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు వేగవంతమైతే, ఈ మొత్తం వ్యవహారం వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు? నిబంధనలు తుంగలోతొక్కి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నదెవరనేది వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పీఎంఎల్ఏ చట్టం కింద లేఖ

గొర్రెల పంపిణీ పథకంలో కోట్ల రూపాయలు పక్కదారి పట్టినట్టుగా ఏసీబీ దర్యాప్తులో ప్రాథమిక ఆధారాలు లభించడంతో.. ఈడీ అధికారులు ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేశారు. వెంటనే కేసు దర్యాప్తు కోసం అవసరమైన వివరాలు ఇవ్వాలంటూ తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ (టీజీఎస్‌జీడీసీఎఫ్ఎల్) ఎండీకి లేఖ రాశారు. మొత్తం తొమ్మిది అంశాలకు సంబంధించిన సమాచారం కోరారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) మిగతా 8వ పేజీలో ▶

నిరంతర గరిష్ట నిల్వలతోనే నష్టం!

- కాళేశ్వరం బరాజ్‌లపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్‌కు నిపుణుల కమిటీ వివరణ
- నిర్మాణం జరిగినప్పటి నుంచీ బరాజ్‌లను పూర్తిగా నింపారు
- నీటి ఒత్తిడి పెరిగిపోయి బుంగలు ఏర్పడ్డాయి
- వాటిని సకాలంలో పూడ్చక నష్టానికి దారితీశాయని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణం పూర్తయిన నాటి నుంచీ నిరంతరం గరిష్ట నిల్వలను కొనసాగించారని.. దాంతో ఒత్తిడి పెరిగి వాటికి తీవ్ర నష్టం కలిగిందని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు నిపుణుల కమిటీ నివేదించింది. నీటి పారుదల శాఖలోని హైడ్రాలజీ విభాగం ఇంజనీర్లు, విచారణ కమిషన్‌కు సహకరించేందుకు ఏర్పాటైన నిపుణుల కమిటీ సభ్యులను జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో విచారించారు.

ప్రాథమిక పరిశీలన అంశాలతో..

ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ ప్రొఫెసర్ సీబీ కామేశ్వర్‌రావు, రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, మిగతా 3వ పేజీలో ▶

పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, ఎమ్మెల్యేలు



ఆగస్టు 15 కల్లా 'ఏన్కూరు లింక్' పూర్తి

- 1.20 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు: భట్టి
- లింక్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం 3లో
- సీతారామ ప్రాజెక్టు పురోగతి పరిశీలన, సమీక్ష

'నీట్' గ్రేస్ మార్కులు రద్దు

- 1,563 మంది అభ్యర్థులకు వాస్తవ మార్కుల కేటాయింపు
- ఈ నెల 23న మళ్లీ పరీక్ష... జూన్ 30లోగా ఫలితాలు
- షెడ్యూల్ ప్రకారమే జూలై 6 నుంచి కౌన్సెలింగ్
- కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు సుప్రీంకోర్టు అనుమతి

6లో

'నీట్' ర్యాంకులు తారుమారు

7లో

నిబ్బరంతో నిలబడదాం



- ఎమ్మెల్సీలతో సమావేశంలో వైఎస్ జగన్ దిశానిర్దేశం
- ఆత్మస్థైర్యాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు.. భవిత మనదే
- కేంద్రంలో బీజేపీ 240 స్థానాలకే పరిమితమైంది.. ఈ పరిస్థితుల్లోనూ ప్రత్యేక హోదా అడగకుండా చంద్రబాబు పాపం చేశారు

12లో



కొలువుదీరిన కేంద్ర మంత్రులు

బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్

- వివరాలు 8లో



15 వేల అంగన్‌వాడీల్లో ఇంగ్లిష్ మీడియం

- వివరాలు 7లో

“డయాగ్నొస్టిక్ పరీక్ష ధరల గురించి షాకింగ్ నిజం!

భారతదేశంలో మరియు రక్త పరీక్షల ధరలు ఎందుకు ఎక్కువగా ఉన్నాయి?

CT, MRI, ల్యాబ్ పరికరాల యొక్క అధిక కొనుగోలు ఖర్చు లేదా అధిక నిర్వహణ ఖర్చులు

భారతదేశంలో రేడియాలజిస్ట్స్ కొరత

కంపెనీలు నిర్ణయించిన అధిక లాభాల మార్జిన్లు

అప్పుడు, ఆర్తి స్క్యాన్స్ & ల్యాబ్స్ ధరలు ఎలా చాల తక్కువగా ఉన్నాయి?

తక్కువ లాభాలు, నిజాయితి ధరలు, నైతిక వ్యాపార పద్ధతులు.

230+ నిపుణులైన రేడియోలజిస్ట్స్ ప్యానల్ మా రోగి స్నేహపూర్వక కార్యక్రమాలను అభినందిస్తుంది & మద్దతు ఇస్తుంది

సరే, అది బాగుంది. కానీ నా డాక్టర్ ఆర్తి స్కన్స్ & ల్యాబ్స్ నుండి నివేదికను అంగీకరిస్తారా?


వాస్తవానికి, మేము 94% రోగి సంతృప్తి స్కోరులతో ప్రతిరోజూ 1000+ MRI స్కెన్స్ మరియు 9000+ రక్త నమూనాలను చేస్తాము.

కచ్చితమైన ఫలితాలను అందించడానికి మేము పూర్తిగా ఆటోమేటెడ్ రోబోటిక్ ల్యాబ్ కలిగి ఉన్నాము.

మా స్కాన్ నివేదికలన్ని మా చీఫ్ రేడియోలోజిస్ట్స్ చే రెండు సార్లు తనికి చేయబడుతాయి, ఇది వైద్యులందరిచే విస్తృతంగా ప్రసంసించబడుతుంది మరియు ఆమోదించబడింది

మా దృష్టి

అన్ని స్కాన్ & బ్లడ్ టెస్టింగ్ సేవలను తక్కువ ధరలకు ఖచ్చితత్వంతో మరియు త్వరగా అందించడమే మా లక్ష్యం



ఏడాది పొడవునా - రక్త పరీక్షలు మరియు స్కానింగ్ పరీక్షలు అందుబాటు ధరల్లో

AARTHI SCANS & LABS

76699 76699

ఆర్తీ స్కాన్‌లు & ల్యాబ్‌లను ఎందుకు ఎంచుకోవాలి?

- నమ్మకమైన మరియు పారదర్శకమైన ధరలు
- 36సంవత్సరాల నమ్మకం
- 12రాష్ట్రాలు& 250+శాఖలు
- ఏడుగురు రేడియాలజీ నిపుణుల వలన నిజమైన రిపోర్ట్స్

MRI స్కాన్

1.5 Tesla Latest Siemens MRI Scanner

మార్కెట్ ధర ~~₹7500~~

పగలు ₹3500 | రాత్రి ₹2500 (7pm - 12am)

MRI Brain/Each Spine

రక్త పరీక్షలు

60% తగ్గింపు

హోమ్ కలెక్షన్ సౌకర్యం కలదు

CT స్కాన్

Siemens 32 Slice High Resolution CT Scanner

మార్కెట్ ధర ~~₹3500~~

పగలు ₹1500 | రాత్రి ₹1000 (7pm - 12am)

CT Brain/PNS

FOR APPOINTMENTS - 76699 76699

కార్ఖానా, పంజాగుట్ట, కూకట్‌పల్లి, దిల్ సుఖ్ నగర్, టోలిచౌకి, షా అలీ బండా, యూసుఫ్‌గూడ, చింతల్, చందా నగర్, బి.ఎన్.రెడ్డి నగర్, కొండాపూర్

AARTHI SCANS & LABS

www.aarthiscan.com

విశాఖపట్నం న్యూఢిల్లీ ముంబై బెంగళూరు చెన్నై హైదరాబాద్ కోల్‌కతా గుర్గావ్ పూణే అహ్మదాబాద్ త్రివేండ్రం పాండిచ్చేరి

క్లుప్తంగా...

కుల, మత రహిత రికార్డులపై
కౌంటర్ వేయండి
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పాఠశాల అడ్మిషన్, పదవతరగతి సర్టిఫికెట్, బదిలీ సర్టిఫికెట్లలో తల్లిదండ్రుల కుల, మత ప్రస్తావన లేకుండా రికార్డుల తయారీపై కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మరోసారి ఆదేశాలు జారీ చేసింది. ఎలాంటి కుల, మత ప్రస్తావన చేయని వారి కోసం ప్రత్యేక కాలమ్ చేర్చడంలో ఇబ్బంది ఏంటో చెప్పాలని వ్యాఖ్యానించింది. ఈ నిబంధనను సవాల్ చేస్తూ డీవీ.రామకృష్ణతోపాటు మరొకరు 2017లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ సుజోయ్‌పాల్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. గత విచారణ సందర్భంగా కేంద్రం తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ ఈ అంశం జనాభా లెక్కల కమిషనర్ పరిధిలోనిదని ఇప్పటికే కౌంటర్ దాఖలు చేశామన్నారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ తీసుకోవాల్సిన విధాన నిర్ణయమని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. సర్టిఫికెట్లలో కుల, మత ప్రస్తావన ఉంచాలా లేదా అన్నదానిపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమేమిటో చెప్పాలంటూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

5న ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

లక్డీకాపూల్: 107 సంవత్సరాల తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) వార్షిక ఎక్సలెన్స్‌అవార్డులను ఈనెల 5న ప్రదానం చేస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు మీలా జయదేవ్ తెలిపారు. గురువారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని... ఈ నెల 15లోగా అర్హులైన వారు https://www.ftcciawards.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. సమావేశంలో సురేష్ కుమార్ సింఘాల్, శ్రీనివాస్ గరిమెళ్ల పాల్గొన్నారు.

ఇదండీ సంగతి



..అయితే పేదలందరినీ పక్క రాష్ట్రాలకు తరలిద్దాం సార్!

సిరిసిల్ల బ్రాండ్ బ్యాండేజీ..!



సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన భాస్కర్ ఇన్నాళ్లు సాంచాలపై కాటన్ వస్త్రం ఉత్పత్తి చేసేవారు. ఆ బట్ట లంగాల(పెట్టీకోట్స్)కు వినియోగించేవారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సిరిసిల్లలో ఉత్పత్తి అయ్యే పెట్టీకోట్స్ బట్టకు మార్కెట్‌లో డిమాండ్ లేదు. దీంతో కాటన్ సాంచాలకు పని లేకుండాపోయింది. దీంతో కొత్తగా బ్యాండేజీ(ఆస్పత్రుల్లో వినియోగించే) బట్టను కాటన్ సాంచాలపై ఉత్పత్తి చేస్తున్నారు. ఈ కొత్త ప్రయోగంతో మెరుగైన ఉపాధి లభిస్తున్నది.

కాటన్ బట్టను ఉత్పత్తి చేసే సాంచాలపై బ్యాండేజీ బట్ట

ఆస్పత్రులు, ఇతర అవసరాలకు సరఫరా

సిరిసిల్లలో ఫలించిన ప్రయోగం

సిరిసిల్ల: మార్కెట్‌లో ఏ బట్టకు డిమాండ్ ఉంటే, ఆ బట్టను కాలానికి అనుగుణంగా ఉత్పత్తి చేస్తేనే పోటీ ప్రపంచంలో మనుగడ ఉంటుంది. ఈ వ్యాపార సూత్రాన్ని ఆకలింపు చేసుకున్న సిరిసిల్లలోని కొందరు వస్త్రోత్పత్తిదారులు కాటన్ బట్ట ఉత్పత్తికి స్వస్తి పలికారు. బ్యాండేజీ బట్ట ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. ఈ బట్టను శుద్ధి చేసి, ప్రాసెసింగ్ చేసిన తర్వాత సీట్‌గా స్టెరలైజ్‌లో ప్యాకింగ్ చేసి ఆస్పత్రుల్లో గాయాలకు కట్లు కట్టేందుకు వినియోగిస్తారు. వినాయకచవితి సందర్భంగా వివిధ రంగుల్లో ఈ బ్యాండేజీ బట్టను ప్రాసెస్ చేసి వినియోగిస్తారు. సిరిసిల్లలో కొత్తగా ఆలోచించే కాటన్ యజమానులు బ్యాండేజీ బట్ట ఆర్డర్లు తీసుకొని సాంచాలపై కొత్త రకం బట్టను ఉత్పత్తి చేస్తున్నారు. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో వచ్చిన ఈ మార్పుతో నేతన్నలకు మెరుగైన ఉపాధి లభిస్తున్నది.

సర్కారు వైపు చూడకుండా..

సిరిసిల్ల పాలిస్టర్ యజమానులు, ఆసాములు ప్రభుత్వం ఇచ్చే వస్త్రోత్పత్తి ఆర్డర్లకు చూస్తుండగా, కాటన్ వస్త్రోత్పత్తిదారులు సొంత వ్యాపారం నమ్ముకొని ముందుకు సాగుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారులు బతుకమ్మ చీరలు, ఆర్‌వీఎం, రంజాన్, క్రిస్మస్ వంటి ఆర్డర్లతో కాలం వెళ్లదీశారు. కాటన్ వస్త్రపరిశ్రమకు ప్రభుత్వపరంగా ఆర్డర్లు రాకపోయినా, సొంతంగా ఆర్డర్లు సంపాదించుకొని మార్కెటింగ్ చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఒకప్పుడు 160 డయింగ్(అద్దకం) యూనిట్లతో సిరిసిల్ల కాటన్ పరిశ్రమ ఉపాధి కేంద్రంగా ఉండేది. కానీ ప్రస్తుతం 50 డయింగ్ యూనిట్లకు చేరింది. ఇలాంటి తరుణంలో కాటన్ వస్త్రవ్యాపారులు కొత్త కం బ్యాండేజీ బట్టను ఉత్పత్తి చేస్తున్నారు.

సాంచా నడుపుతున్న ఇతని పేరు చిలుక మల్లేశం. సిరిసిల్లలో కాటన్ బట్టను ఉత్పత్తి చేసే మల్లేశం కొత్తగా బ్యాండేజీ బట్టను తక్కువ పిక్కుల (పోగులు)తో బట్ట జాలి(రంధ్రాలు) ఉండే విధంగా ఉత్పత్తి చేస్తున్నారు. గతంలో లంగాల బట్టను ఉత్పత్తి చేస్తే మీటరుకు రూ.22 లభించేది. కానీ దీనికి డిమాండ్ లేదు. ప్రస్తుతం బ్యాండేజీ బట్టను ఉత్పత్తి చేస్తే మీటరుకు రూ.19 లభిస్తున్నది. మార్కెట్‌లో మంచి డిమాండ్ కూడా ఉంది.



ఆగస్టు 15 కల్లా 'ఏన్కూరు లింక్' పూర్తి

1.20 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు

డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి

లింక్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం

సీతారామ ప్రాజెక్టు పురోగతి పరిశీలన, సమీక్ష

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వచ్చే ఆగస్టు 15 నాటికి ఏన్కూరు లింకు కెనాల్‌ను పూర్తి చేసి 1.20 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కేవలం రూ.2,654 కోట్లతో పూర్తయ్యే రాజీవ్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసిందని, దీంతో నిర్మాణ వ్యయం రూ.20 వేల కోట్లకు పెరిగిందని అన్నారు. ఇప్పటికే రూ.8 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేదని విమర్శించారు. రీ డిజైనింగ్‌తో ప్రజాధనం దుర్వినియోగం అయిందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నత స్థాయి సమీక్షలు జరిపి, ఆపై క్షేత్రస్థాయి పరిశీలనలు జరుపుతోందని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని అశ్వాపురం, ములకలపల్లి, ఏన్కూరులో సీతారామ ప్రాజెక్టు బరాజ్, పంప్‌హౌస్, ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల నిర్మాణ పనులను గురువారం సాగునీటి పారుదల, రెవెన్యూ, వ్యవసాయ శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఆ తర్వాత ప్రాజెక్టు పురోగతి పై ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఇప్పటివరకు జరిగిన పనులు, కొనసాగుతున్న కెనాళ్ల పనులు, భూసేకరణ, ప్రాజె క్టు పూర్తి కావడానికి అవసరమైన నిధులు, ఎదురవుతున్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు ఇరిగేషన్ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు.



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మల

సీతారామ కాల్వ ఎన్నెస్పీఎల్ కెనాల్‌కు లింక్

నాగార్జునసాగర్ కింద ఉన్న ఆయకట్టు స్థిరీకరణకు సీతారామ ప్రాజెక్టు కాల్వను ఎన్నెస్పీఎల్ కెనాల్‌కు లింక్ చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి తెలిపారు. ఇందుకు రూ.72 కోట్ల వ్యయంతో తొమ్మిది కిలోమీటర్ల మేర నిర్మించే లింక్ కెనాల్‌కు రాజీవ్ కెనాల్‌గా నామకరణం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పూర్తయిన మూడు పంప్‌హౌస్‌ల్లో డ్రై రన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పంప్‌హౌస్‌ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

ఇరిగేషన్ సెక్టార్ నాశనం: ఉత్తమ్

ప్రణాళికాలోపంతో, అనాలోచితంగా గత సీఎం చేపట్టిన పనుల వల్ల ఇరిగేషన్ రంగం నాశనమైందని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.94 వేల కోట్లు ఖర్చుపెట్టగా కొత్తగా వచ్చిన ఆయకట్టు కేవలం 93 వేల ఎకరాలేనని పేర్కొన్నారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలకు రూ. 27 వేల కోట్ల ఖర్చుపెట్టి ఒక ఎకరం కూడా కొత్తగా ఆయకట్టు తీసుకురాలేదని చెప్పారు. సీతారామతోనూ ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేకపోయారన్నారు. ఇలాంటి పనులతో రాష్ట్రంపై కోలుకోలేని ఆర్థికభారం పడిందని చెప్పారు. సీతారామ ప్రధాన కాల్వ మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. అందినకాడికి అప్పు చేసి, విచ్చలవిడిగా ఖర్చు చేసిన గత ప్రభుత్వం ఒక్క ఎకరాకు కూడా నీరు ఇవ్వలేకపోయిందని విమర్శించారు. సీతారామ ఫలాలు త్వరితగతిన అందాలంటే సత్తుపల్లి, పాలేరు, జూలూరుపాడు టన్నెల్ పనులు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణానికి భూసేకరణ, అటవీశాఖ అనుమతులు, నిధుల మంజూరు వంటివి త్వరగా చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగులకు పదోన్నతులు

ఉద్యోగ సంఘాల నేతలతో సొసైటీ కార్యదర్శి సమావేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీల పరిధిలో ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ రెండు సొసైటీల పరిధిలో పదోన్నతులు ఇవ్వక ఆరు సంవత్సరాలు కావస్తున్న నేపథ్యంలో ఈ ప్రక్రియపై ఉద్యోగ సంఘాల నేతలతో సొసైటీ కార్యదర్శి గురువారం సమావేశం నిర్వహించారు. కొత్తగా బోధన సిబ్బంది నియామకాలు జరుగుతున్న నేపథ్యంలో ఆలోపే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని సంఘాల నేతలు కోరారు. దీనిపై సొసైటీ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు స్పందించారు. బదిలీలపై ప్రభుత్వం నిషేధం ఎత్తివేస్తేనే వాటిని నిర్వహించే వీలుంటుందని, అయితే పదోన్నతుల విషయాన్ని పరిశీలిస్తామని ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలిసింది. నెలాఖరులోగా ఈ ప్రక్రియను కొలిక్కి తెచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. పదోన్నతుల తర్వాతే బదిలీలు చేపడితే ఉద్యోగులందరికీ న్యాయం జరుగుతుందని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎట్‌గ్రివా) అధ్యక్ష, కార్యదర్శులు కూకుట్ల యాదయ్య, పాపిరెడ్డి ఈ సమావేశంలో సూచించారు. కొత్త నియామకాలకు ముందుగా పదోన్నతులతో పాటు బదిలీలు కూడా నిర్వహించాలని, కొందరు ఉద్యోగులు ఎనిమిదేళ్లకు పైబడి ఒకే చోట పనిచేస్తున్నట్లు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.బాలరాజు, ఎస్.దయాకర్.. కార్యదర్శికి సూచించారు. కాగా, త్వరలో ఈ అంశంపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఉద్యోగ సంఘాలకు అధికారులు వివరించినట్లు తెలిసింది.

నూతన ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

స్థానిక సంస్థల కోటాలో నవీన్‌కుమార్‌రెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న

మండలి చైర్మన్ చాంబర్‌లో ప్రమాణం

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీలుగా ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డి, తీన్మార్ మల్లన్న గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డి ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్‌తో పాటు పలువు రు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం నవీన్‌కుమార్‌రెడ్డికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. కాగా, తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలు జరిగిన రోజు వెలువడిన ఫలితాల్లో తాను విజయం సాధించానని, తన గెలుపును తెలంగాణ అమరవీరులకు అంకితం చేస్తున్నానని ప్రకటించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


మండలి చైర్మన్ గుత్తా, డిప్యూటీ చైర్మన్ బండాతో ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్ రెడ్డి, తీన్మార్ మల్లన్న

ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న


శాసన మండలి వరంగల్– ఖమ్మం– నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరఫున గెలుపొందిన తీన్మార్ మల్లన్న.. మంత్రి జూపల్లి కృష్ణారావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్, ఏఐసీసీ నాయకురాలు దీపాదాస్ మున్షీ సమక్షంలో ప్రమాణం చేశారు. అనంతరం మండలి లాన్‌లో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుతో కలిసి నూతన ఎమ్మెల్సీలు ఫొటోలు దిగారు.

అంతర్జాతీయ కంపెనీలతో తెలంగాణ సంస్థల భాగస్వామ్యం: మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సంస్థలు అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు విస్తరించేందుకు, అవకాశాలు అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటును అందిస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ డి.శ్రీధర్‌బాబు అన్నారు. అంతర్జాతీయ స్థాయి భాగస్వామ్యాల ద్వారా ఫార్మాసూటికల్, బయో టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ నాయకత్వ స్థానాన్ని నిలబెట్టుకుంటుందన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న శ్రీధర్‌బాబు బుధవారం న్యూజెర్సీలో 'ఇన్నోవెరా ఫార్మా'కార్యాలయాన్ని ప్రారంభించారు. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఇన్నోవెరా విస్తరణకు బాటలు పడ్డాయన్నారు. ఇన్నోవెరా ఫార్మా పరిశోధన, అభివృద్ధి, ఉత్పాదక సామర్థ్య పెంపుదలకు ఈ విస్తరణ దోహదం చేస్తుందని చెప్పారు. ప్రత్యేకమైన జనరిక్ ఔషధాలు, బ్రాండెడ్ ఉత్పత్తుల్లో పేరొందిన ఇన్నోవెరా దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో సూర్యాపేటలో యూనిట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసింది. తాజాగా న్యూజెర్సీలో కార్యకలాపాల విస్తరణకు శ్రీకారం చుట్టింది.

ప్రతీకార రాజకీయాలు మానుకోవాలి: దాసోజు శ్రవణ్




సాక్షి, హైదరాబాద్: పగ, ప్రతీకారాలు, రాజకీయ కుయుక్తులకు పరాకాష్టగా మారిన రేవంత్ పాలన అధ్వానంగా ఉందని బీఆర్‌ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ విమర్శించారు. ప్రతీకార రాజకీయాలను పక్కన పెట్టి ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని హితవు పలికారు. విద్యుత్ లోటుతో సతమతమవుతున్న తెలంగాణ రాష్ట్రానికి మిగులు విద్యుత్‌ను అందించి వెలుగులు నింపిన కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులు ఇస్తారా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌కు గురువారం బహిరంగ లేఖ రాశారు.

మరో రెండు గేట్లు పైకి

మేడిగడ్డ 7వ బ్లాక్‌లోని 18, 19 గేట్లను ఎత్తిన అధికారులు

అంతకుముందు మూడు గేట్ల ఎత్తివేత

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కు చెందిన మరో రెండు రేడియల్ గేట్లను ఇంజనీరింగ్ అధికారులు గురువారం పైకి ఎత్తారు. గతేడాది అక్టోబర్‌లో 21న మేడిగడ్డ బరాజ్ 7వ బ్లాక్‌లోని 19, 20, 21 పియర్లతో పాటు వంతెన కుంగి, పగుళ్లు తేలిన విషయం తెలిసిందే. గత నెల 17న 15వ పియర్‌లోని రేడియల్ గేటును పైకి ఎత్తేందుకు ప్రయత్నించగా, 20వ పియర్ ముందు బొరియలు ఏర్పడి భారీ శబ్దం, ధ్వనులు వినిపించాయి. దీంతో బొరియల్లో సిమెంట్, ఇసుకతో గ్రౌటింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 6న 7వ బ్లాక్‌లోని 16, 17 రేడియల్ గేట్లను బలంగా పైకి ఎత్తారు. 8వ తేదీన అదే బ్లాక్‌లోని 22వ రేడియల్ గేటును ఎత్తారు. గురువారం 18, 19 గేట్లను 100.50 మీటర్ల మేర ఎత్తారు. దీంతో ఈ బ్లాక్‌లోని మొత్తం 8 గేట్లకు గాను 5 గేట్లు ఎత్తినట్టయ్యింది.


18వ రేడియల్ గేటు ఎత్తిన దృశ్యం

గేట్ల కటింగ్ పనులు వేగవంతం: ప్రాజెక్టులోని 19, 20, 21 గేట్ల కటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 20వ గేటును కట్ చేసి విడిభాగాలు తొలగించి, బయటకు తీసుకెళ్లేందుకు వీలుగా చేశారు. ఆ గేట్ల వద్ద ఉన్న కేబుల్స్, ఇతర పరికరాలు తొలగించడానికి సమయం పట్టనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా 7వ బ్లాక్‌లో షీట్ ఫైల్స్ పనుల్లో వేగం పెంచారు. చెల్లాచెదురైన సీసీ బ్లాక్‌లను సరైన స్థానంలో అమరుస్తున్నారు. మంత్రి ఉత్తమ్ పర్యటన అనంతరం మరమ్మతుల్లో వేగం పెరిగిందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. అటు అన్నారంలో బోర్‌తో డ్రిల్లింగ్ వేసి రంధ్రాలు చేస్తున్నారు. 25 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేయాల్సి ఉండగా కింద మట్టి దృఢంగా ఉండడంతో ఆలస్యం జరుగుతున్నట్లు తెలిసింది.

▶ మొదటి పేజీ తరువాయి

నిరంతర గరిష్ట నిల్వలతోనే నష్టం!

ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ ఎస్.రమణమూర్తి, ఉస్మానియా వర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం హెచ్ఓడీ పి.రాజశేఖర్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్‌తో ఏర్పాటైన నిపుణుల కమిటీ ఇటీవల బరాజ్‌లను పరిశీలించి ప్రాథమిక నివేదిక సమర్పించింది. తమ దృష్టికి వచ్చిన లోపాలను తాజాగా జస్టిస్ చంద్రఘోష్‌కు వివరించింది. బరాజ్‌లను సుదీర్ఘకాలం పూర్తిస్థాయిలో నీటితో నింపి ఉంచడంతో.. బరాజ్‌లపై ఒత్తిడి పెరిగి బుంగలు ఏర్పడ్డాయని కమిటీ సభ్యులు పేర్కొన్నట్టు తెలిసింది. బుంగలను వెంటనే పూడ్చయకపోవడంతో వాటి తీవ్రత పెరిగి బరాజ్‌లకు తీవ్ర నష్టం కలిగించిందని వెల్లడించినట్టు సమాచారం. బరాజ్‌ల వైఫల్యంపై రెండు వారాల్లోగా మధ్యంతర నివేదిక ఇవ్వాలని.. సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను అఫిడవిట్ రూపంలో సమర్పించాలని నిపుణుల కమిటీకి ఈ సందర్భంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆదేశించారు.

నేడు ఈఎన్సీల ఆఫీసుల సిబ్బంది విచారణ

రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్), ఈఎన్సీ (ఓ అండ్ ఎం) కార్యాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీర్లను జస్టిస్ చంద్రఘోష్ శుక్రవారం విచారించనున్నారు. చీఫ్ ఇంజనీర్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి వరకు అధికారులను విచారణకు రావాలని కోరారు.

త్వరలో బహిరంగ విచారణ

కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ త్వరలో బహిరంగ విచారణ నిర్వహించాలని నిర్ణయించిందని. అఫిడవిట్ల రూపంలో విచారణ కమిషన్‌కు సమాచారాన్ని సమర్పించిన వారందరినీ బహిరంగ విచారణలో ప్రశ్నించనుంది. అఫిడవిట్ల పరిశీలన పూర్తయిన తర్వాత ఎవరెవరిని పిలవాలనే అంశంపై నిర్ణయం తీసుకోనుంది. బ్యారేజీలపై విజిలెన్స్ విభాగం నిర్వహించిన దర్యాప్తునకు సంబంధించిన తుది నివేదికను సత్వరం సమర్పించాలని కమిషన్ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా సమర్పించలేదు. విజిలెన్స్ తుది నివేదిక కోరుతూ మరోసారి లేఖ రాయనుంది. బరాజ్‌ల నిర్మాణంతో సంబంధమున్న ప్రభుత్వ కార్యాలయాలు, మోడల్ స్టడీస్ ల్యాబ్స్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సంబంధిత రికార్డులను పరిశీలించాలని జస్టిస్ చంద్ర ఘోష్ నిర్ణయం తీసుకున్నారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)ను సైతం ఆయన సందర్శించనున్నట్టు తెలిసింది. కాళేశ్వరం బరాజ్‌లకు సంబంధించిన సాంకేతిక అంశాలపై విచారణ ముగించిన తర్వాత.. ఆర్థిక అవకతవకతలపై జస్టిస్ చంద్రఘోష్ దృష్టిసారించనున్నారు. అంచనా వ్యయం, ఖర్చులు, రుణాలు, వడ్డీ రేట్లు తదితర అంశాలపై విచారణ నిర్వహించనున్నారు.

అఫిడవిట్ల పరిశీలన తర్వాత నిర్ణయం

గురువారం విచారణ ముగిసిన తర్వాత జస్టిస్ పినాకి చంద్రఘోష్ మీడియాతో క్లుప్తంగా మాట్లాడారు. బరాజ్‌ల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులకు నోటీసులేమైనా జారీ చేస్తారా? అని మీడియా ప్రశ్నించగా.. అధికారులు సమర్పించిన అఫిడవిట్లను పరిశీలించాక నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు.

సాక్షి
శుక్రవారం, 14 జూన్ 2024

వలస పోయిన మందహాసం

కువైట్ దక్షిణ ప్రాంతంలోని మంగఫ్ నగరంలో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 49 మంది ప్రాణాలు కోల్పోవడం, 50 మందికి పైగా గాయాల పాలవడం విషాదం. మృతుల్లో 43 మంది స్వదేశంలోని కుటుంబాలను పోషించడం కోసం కడుపు కట్టుకొని వలస వెళ్ళిన మన భారతీయులే కావడం మరింత విషాదం. వలస కార్మికులు ఎక్కువగా నివసించే ఆ ప్రాంతంలో ఆరంతస్థుల అల్–మంగఫ్ అపార్ట్‌మెంట్ల భవనంలో ఒక్కసారిగా రేగిన మంటలు ఇంతటి ఘోర ప్రమాదానికి దారి తీశాయి. కేరళ, తమిళనాడు, ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన దాదాపు 200 మంది కార్మికులు నివసిస్తున్న ఆ భవనం మన కేరళకు చెందిన వ్యక్తిది కాగా, మృతుల్లో ఎక్కువ (24) మంది కేరళ వారే! చీకటి వేళ సంభవించిన ఈ అగ్నిప్రమాదంలో అత్యధికులు ఆ మంటలు, పొగలో చిక్కుకొని ఊపిరి ఆడక చనిపోయారు. ఓ వంట గదిలో మంటలు మొదలయ్యాయనీ, అవి భవనమంతటికీ వ్యాపించాయనీ స్థానిక మీడియా కథనం. ఈ ఘటనపై కూలంకషంగా దర్యాప్తు జరిపి, ఎవరు బాధ్యులనేది నిర్ణయిస్తామని కువైట్ చెబుతోంది.

కారణాలు ఏమైనా బాధిత కుటుంబాల కన్నీళ్ళు ఆగేవి కావు. కష్టపడి నాలుగు రాళ్ళు ఎక్కువ సంపాదించి, ఊళ్ళోని కుటుంబాలను బాగా చూసుకోవాలని బయలుదేరిన పలువురి జీవితాలు అర్ధంతరంగా ముగిసిపోయాయి. కువైట్‌లో అగ్ని ప్రమాదాల చరిత్ర గమనిస్తే, 2009లో రెండో పెళ్ళి చేసుకుంటున్న తన భర్తపై ప్రతీకారంతో ఓ కువైట్ మహిళ వివాహ విందులో గుడారానికి నిప్పు పెట్టినప్పుడు 57 మంది చనిపోయారు. ఆ తర్వాత ఆ దేశంలో ఇదే అతి పెద్ద ఘోరకలి. 2022 మార్చిలోనూ కువైట్‌లో పేరున్న ముబారకియా మార్కెట్ వాణిజ్యప్రాంతంలో ఇప్పటిలానే అగ్నిప్రమాదం సంభవించింది. మళ్ళీ ఇప్పుడీ తాజా ప్రమాదం. జాగ్రత్తలు తీసుకుంటామంటూ అధికారులు చెబుతున్నా అవేవీ వాస్తవ రూపం ధరించడం లేదు. ఈ ఘటనల వెనుక స్థానికంగా అవినీతి, ఆశ్రిత పక్షపాతం, దురాశ లాంటివెన్నో ఉన్నాయనే వాదనలూ వినిపిస్తున్నాయి.

ఒక్క కువైట్‌లోనే కాదు, మధ్యప్రాచ్యంలోని అనేక ప్రాంతాల్లోనూ వలస కార్మికులు అవస్థలు, వారి అమానవీయ జీవన పరిస్థితులు అనేకం. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వల్లో ఆరో స్థానంలో ఉన్న కువైట్ మొత్తం 42 లక్షల పైగా జనాభాలో స్థానికుల కన్నా పని చేయడానికి వలస వచ్చినవారే ఎక్కువ. ఆ దేశంలో మన ప్రవాసీయుల సంఖ్య పది లక్షల పైనే! ఇంకా చెప్పాలంటే, కువైట్ మొత్తం జనాభాలో 21 శాతం మనవాళ్ళే! అక్కడి శ్రామిక వర్గంలో 30 శాతం మంది మనమే. 1990 – 91లో గల్ఫ్ యుద్ధ ప్రభావంతో లక్షలాది భారతీయులు కువైట్ నుంచి వెనక్కి వచ్చేసినా, అనంతరం భారీగా తరలివెళ్ళారు. ఒకప్పుడు అధికంగా ఉన్న పాలస్తీనియుల్ని మనం మించిపోయాం. వడ్రంగులు, తాపీ మేస్త్రీలు, పనివాళ్ళు, డ్రైవర్ల దగ్గర నుంచి ఫుడ్, కొరియర్ బాయ్స్ దాకా కువైట్‌లో అధికశాతం భారతీయులే. ఇంజనీర్లు, డాక్టర్ల లాంటి వృత్తి నిపుణులున్నా ఎక్కువ మంది అన్–స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులే. ఇలాంటి కార్మికులకు అక్కడ డిమాండ్ ఎక్కువ. అందుకు తగ్గట్టే మన దేశంతో పోలిస్తే, అక్కడ ఆదాయమూ అధికమే. కువైట్, యూఏఈ, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ అనే అరడజను గల్ఫ్ దేశాలకు మన వలసలకదే కారణం.

తాజా ఘటనలో చనిపోయిందీ ఇలాంటి వలసజీవులే! అందరూ 20 నుంచి 50 ఏళ్ళ మధ్య వయసు వారే! కేంద్ర మంత్రి, కేరళ ఆరోగ్య మంత్రి సహా పలువురు హుటాహుటిన కువైట్‌కు పయనమయ్యారు. బాధిత కుటుంబాలకు కేంద్రం, కేరళ ప్రభుత్వాలు తోచిన నష్టపరిహారం ప్రకటించాయి. కానీ, కేవలం ఇది సరిపోతుందా అన్నది బేతాళ ప్రశ్న. కూలి కోసం, కూటి కోసం విదేశాలకు వెళ్ళి, అక్కడ సంపాదించిన సొమ్మును స్వదేశంలోని ఇంటికి పంపి, పరోక్షంగా మన ఆర్థిక వ్యవస్థ పురోగతికి అండగా నిలుస్తున్న తోటి భారతీయుల పట్ల మన అక్కర అంత మాత్రమేనా? గల్ఫ్ సహా వివిధ ప్రాంతాలకు వెళ్ళే వలస కార్మికులు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ, ఇవాళ్టికీ వీరి వెతల గురించి అక్కడి, ఇక్కడి ప్రభుత్వాలు పట్టించుకొనేది తక్కువే. వెళ్ళినవారు అనుకోకుండా ఏ చిక్కుల్లో పడినా, ఆఖరుకు ప్రాణాలే కోల్పోయినా ప్రవాస తెలుగు, తమిళ, మలయాళీ సంఘాల లాంటి ప్రైవేట్ సంస్థలే చొరవ తీసుకొని సాయపడుతున్నాయి.

భారత ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్క కువైట్‌లోనే 2014 నుంచి 2018 మధ్య 2932 మంది భారతీయులు మరణించారు. 2023లో 708 మంది చనిపోయారు. అనూహ్య ప్రమాదాలప్పుడు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడమే తప్ప, అసలీ వలస కార్మికులు, ప్రవాస భారతీయుల కష్టనష్టాలను నిరంతరం గమనించేందుకు మనకంటూ ఇప్పటికీ పటిష్ఠమైన వ్యవస్థ, ప్రత్యేక మంత్రిత్వ శాఖ లాంటివి లేవు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నిబంధనల మేరకు గల్ఫ్ వెళ్ళే భారత కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలనే భరోసా, కువైట్ వలస కార్మికులకు రూ. 10 లక్షల ప్రవాసీ భారతీయ బీమా పథకం ఉన్నా, విదేశాంగ శాఖలో నమోదు చేసుకొని, అన్ని పత్రాలూ ఉన్నవారికే అవి వర్తిస్తాయి. కానీ, అవేవీ పాటించకుండా పొట్టకూటి కోసం దళారుల్ని ఆశ్రయించి వెళ్ళే బడుగు జీవులే మన దగ్గర ఎక్కువ. పశ్చిమాసియాలోని మన వలస బిడ్డల సంపూర్ణ రక్షణకై ఇప్పటికైనా మన ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. సరైన నివాస వసతి సహా కనీస సౌకర్యాలతో జీవించే ఏర్పాటుకు అక్కడి ప్రభుత్వాలతో కలసి కృషి చేయాలి. ఆర్థిక వ్యవస్థను ప్రపంచ పటంలో ఉన్నతంగా నిలుపుతున్న ఈ కనిపించని శ్రామిక శక్తి పట్ల అది కనీస కర్తవ్యం. జీవితంలో వారు, దేశంగా మనమూ గెలవడం సరే... ముందు హుందాగా బతకడం ముఖ్యం.

2024 ఎన్నికలు: ఒక అడుగు వెనక్కి

విశ్లేషణ



అక్షీ చావ్లా

నూతనంగా కొలువుదీరిన 18వ లోక్‌సభలో 469 మంది పురుషులతో పాటు కేవలం 74 మంది మహిళలు మాత్రమే ఉంటారు. మొత్తం ఎంపీలలో వారు 13.6 శాతం. ఈ వాటా 2019లో ఎన్నికైన మహిళల వాటా (14.4 శాతం) కంటే తక్కువగా ఉండటం గమనార్హం. లోక్‌సభ, శాసనసభలలో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేయడానికి ఉద్దేశించిన చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును భారతదేశం ఆమోదించిన తర్వాత జరిగిన మొదటి పార్లమెంటరీ ఎన్నికలు ఇవి. స్థానిక స్థాయిలో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని విస్తరించే విషయంలో భారతదేశం ముందుండి నడిపించింది. రాష్ట్ర, జాతీయ స్థాయులలోని అంతరాలను పరిష్కరించడంలో కూడా మనం ఇదే విధమైన నిబద్ధతను ప్రదర్శించాలి.

2024 లోక్‌సభ ఎన్నికలు ఆధునిక భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన పోకడను సూచిస్తాయి. దీనిపై విశ్లేషించడానికి, వేడుక జరుపుకోవడానికి చాలా ఉంది కానీ, ఒక రంగంలో మాత్రం మనం ఒక అడుగు వెనక్కి వేశాం. 18వ లోక్‌సభలో 469 మంది పురుషులతో పాటు 74 మంది మహిళలు మాత్రమే ఉంటారు. 74 మందితో కూడిన ఈ మహిళా బృందంలో కచ్చితంగానే అనేక మంది శక్తిమంతమైన, చిత్తశుద్ధిగల, కష్టపడి పనిచేయగల ప్రజాప్రతినిధులు ఉన్నారు. మొత్తం ఎంపీలలో వారు 13.6 శాతంగా మాత్రమే ఉన్నారు. ఈ వాటా దారుణంగా వక్రంగా ఉండటమే కాకుండా, 2019 ఎన్నికల్లో ఎన్నికైన మహిళల వాటా (14.4 శాతం) కంటే తక్కువగా ఉండటం గమనార్హం.



2024 ఎన్నికలు జరిగిన సందర్భాన్ని పరిశీలిస్తే, మహిళా పార్లమెంటరీ ప్రాతినిధ్యం చెప్పుకోదగ్గ అభివృద్ధిని నమోదు చేసి ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా లోక్‌సభ, రాష్ట్ర శాసన సభలలో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేయడానికి ఉద్దేశించిన చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును భారతదేశం ఆమోదించిన తర్వాత జరిగిన మొదటి పార్లమెంటరీ ఎన్నికలు ఇవి. ఈ బిల్లు అమలులోకి వచ్చాక మహిళల సీట్లు వారికే కేటాయించాల్సి ఉంటుంది.

రిజర్వేషన్ సరిపోదు!

గత ఏడాది పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందినప్పుడు, అన్ని రాజకీయ పార్టీలు తమ మద్దతును తెలియజేయడమే కాకుండా, ఈ చారిత్రాత్మక పరిణామంలో తమకూ పాత్ర ఉందని ప్రకటించుకున్నాయి. పైగా, ఈ ఎన్నికల్లో మహిళలు ముఖ్యమైన ఓటర్లుగా ఉన్నారు. పార్టీల మేనిఫెస్టోలు, అగ్ర నాయకుల ప్రచార ప్రసంగాల నుండి మహిళల ఓటింగ్ ప్రాధాన్యతలను అర్థం చేసుకోవడం వరకు, సుదీర్ఘకాలం సాగిన ఎన్నికల సీజన్లో భారతీయ మహిళ చాలా స్పష్టంగా (కొంతవరకు సమస్యాత్మకంగా) తన ఉనికిని కలిగి ఉంది.

అయితే ఈ ఊహాగానంలో మహిళలు ఓటర్లు, లబ్ధిదారుల పాత్రకే పరిమితమయ్యారు, రాజకీయ సోపానక్రమాలలో సమానమైన భాగస్వామ్యానికి అర్హులైన మహిళా నాయకులు, ప్రతినిధులు లేకుండాపోయారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంకలనం చేసిన డేటా ప్రకారం, ఈ ఎన్నికల్లో మొత్తం అభ్యర్థుల్లో 9.6 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు (పార్టీ టికెట్లపై పోటీ చేసిన అభ్యర్థుల్లో మహిళలు 11 శాతం మంది). అభ్యర్థులలో మహిళల వాటా తొమ్మిది శాతంగా ఉన్న 2019 సంవత్సరం నుండి చూస్తే ఇది చాలా కొద్ది మెరుగుదల మాత్రమే అని చెప్పాలి. పైగా పుండుపై కారం జల్లినట్టుగా, ఎన్నికల్లో పోటీ చేసిన అనేక మంది మహిళలు తమ తోటి వారి నుండి స్త్రీద్వేష వ్యాఖ్యలను, అపహాస్యాన్ని ఎదుర్కొన్నారు.

ఈ విధంగా కొద్ది మంది మహిళలే ఎన్నికల్లో పోటీ చేస్తే, ఎన్నికైనవారిలో వారి ప్రాతినిధ్యం అంతంతమాత్రంగానే ఉంటుంది. ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో పార్లమెంట్లు పురుషుల ఆధిపత్యంలో కొనసాగుతున్నప్పటికీ, భారతదేశం దాని సహచర పార్లమెంట్ల కంటే చాలా వెనుకబడి ఉంది. ఉదాహరణకు, 2023లో, ప్రపంచవ్యాప్తంగా 52 దేశాలు పార్లమెంటరీ ఎన్నికలను నిర్వహించాయి. వీటిలో సగటున, 27.6 శాతం మంది మహిళలు ఎన్నికయ్యారని, ఇంటర్–పార్లమెంటరీ యూనియన్ (ఐపీయూ) డేటా చెబుతోంది. వాస్తవానికి, ప్రపంచవ్యాప్తంగా, ప్రస్తుతం ఉన్న మొత్తం ఎంపీలలో మహిళలు 26.9 శాతం ఉన్నారు. 18వ లోక్‌సభ ఎన్నికలకు ముందు, ఐపీయూ డేటా ప్రకారం, ఈ పరామితిలో మొత్తం 185 దేశాలలో భారతదేశం 143వ స్థానంలో ఉంది. కొత్త పార్లమెంటులో మహిళా ప్రాతినిధ్యంలో తగ్గుదల నమోదైన నేపథ్యంలో, మన దేశ ర్యాంకింగ్ మరో ఐదు లేదా ఆరు స్థానాలు పడిపోయే అవకాశం ఉంది.

మెక్సికో నుండి ఒక ఉదాహరణ

భారతదేశంలో ఎన్నికల లెక్కింపు జరగడానికి ఒక రోజు ముందు, ప్రపంచంలోని మరొక భిన్నమైన ప్రాంతంలో మరో చారిత్రక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. వివిధ రాజ్యాంగ పదవులకు ప్రతినిధులను ఎన్నుకోవడానికి మెక్సికోలో సాధారణ ఎన్నికలు జరిగాయి. అక్కడ క్లాడియా షీన్‌బామ్ అత్యున్నత పదవికి చక్కటి మెజారిటీతో ఎన్నికయ్యారు. మెక్సికో అధ్యక్షురాలిగా ఒక మహిళ ఎన్నిక కావడం ఇదే తొలిసారి. కానీ పురుషులకే పరిమితమైన దుర్భేద్యమైన కంచు కోట బద్దలవడం ఒక ఉల్లంఘన కాదు, మెక్సికో తన రాజకీయాలను మరింత ప్రాతినిధ్యంగా మార్చే ప్రయాణంలో ఇదొక తార్కికమైన తదుపరి దశ మాత్రమే.

గత కొన్ని దశాబ్దాలుగా, అట్టడుగు స్త్రీవాద ఉద్యమాల ద్వారా ముందుకు సాగిన మెక్సికో, తన రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడమే కాకుండా లింగ సమానత్వాన్ని నిర్ధారించడానికి చట్టబద్ధమైన సంస్కరణల సమితిని ప్రవేశపెట్టింది; అమలు చేసింది కూడా. చట్టం ప్రకారం ప్రతిదానిలో, అంటే ప్రభుత్వంలోని అన్ని రంగాలలో సమానత్వం అవసరం. అలాగే ఎన్నికలలో లింగ సమానత్వంతో పార్టీలు తమ అభ్యర్థుల జాబితాలను ఉంచాలని ఆదేశించింది. ఈ సంస్కరణల ఫలితంగా, మెక్సికో అనేక ముఖ్యమైన రాజకీయ ఉన్నత పదవులను ఆక్రమించిన మహిళలతో పాటు, దాని పార్లమెంటు ఉభయ సభలలో స్త్రీ పురుష సమానత్వాన్ని కలిగి ఉంది. 2024లో, అధ్యక్ష పదవికి పోటీ చేసిన మొదటి ఇద్దరు అభ్యర్థులు మహిళలు కావడం, ఆ దేశ చరిత్రలో దేనితోనూ పోల్చలేని అరుదైన పరిణామం.అయినంతమాత్రాన మెక్సికోలో సమస్యలు లేవని చెప్పలేం. అక్కడ రాజకీయ, లింగ ఆధారిత హింస తీవ్రమైన సమస్యగా ఉంది. అయితే లింగ నిర్ధారిత నిబంధనలు ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకమైన, ఆలోచనాత్మకమైన సంస్కరణల ద్వారా పురోగతి సాధ్యమవుతుందని ఇది చూపిస్తోంది. అనేక ఇతర దేశాలు కూడా తమ రాజకీయాలను, పార్లమెంట్లను మరింత ప్రాతినిధ్యంగా ఉంచుతూ, సమానంగా మహిళలను కలుపుకుపోయేలా, లింగపరమైన సున్నితత్వంతో మలచడానికి చిన్న, పెద్ద రెండు చర్యలనూ తీసుకున్నాయి.

మనమందరం బాధ్యులమే!

స్థానిక స్థాయిలో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని విస్తరించే విషయంలో భారతదేశం ముందుండి నడిపించింది. రాష్ట్ర, జాతీయ స్థాయులలోని అంతరాలను పరిష్కరించడంలో మనం ఇదే విధమైన నిబద్ధతను ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైంది. దీనికి ఎగువ నుండి సంస్కరణ అవసరం. కానీ పురోగతిని నిర్ధారించే అంతిమ బాధ్యత మన రాజకీయ పార్టీల భుజాలపైనే ఉంటుంది. మహిళా ప్రాతినిధ్యంలో ఈ పతనాన్ని చిన్నవిషయంగా చూడకూడదు. మహిళల (ప్రత్యేకించి సాంప్రదాయకంగా అట్టడుగున ఉన్న సమూహాల) భాగస్వామ్యాన్ని ప్రారంభించే విషయానికి వస్తే, పురోగతి చాలా అరుదుగా సరళంగా ఉంటుంది. పైగా దానికి ఎప్పుడూ హామీ ఇవ్వడం జరగదు. కాబట్టి ఈ విషయంలో శాశ్వతమైన జాగరూకత చాలా అవసరం. అలాగే మనం అడుగడుగునా జాగ్రత్తగా ఉండాలి.

వ్యాసకర్త పరిశోధకురాలు, అశోకా యూనివర్సిటీలోని 'సెంటర్ ఫర్ ఎకనామిక్ డేటా అండ్ అనాలిసిస్' (సీఈడీఏ)లో పనిచేస్తున్నారు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తారస్థాయి వ్యాధి



వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకుంటున్న ఒక వీరాభిమానిని చంపడానికి ఇంకో వీరాభిమానిని ఒక స్టార్ వాడుకోవడం అనేది తారల ఆరాధన జాడ్యం తాలూకు వైపరీత్యానికి ఉదాహరణ. స్టార్లు జీవితంలో ఎలా నడుచుకోవాలో తాము నిర్దేశించాలని అభిమానులు కోరుకోవడం కూడా అదే సిండ్రోమ్ తాలూకు సైడ్ ఎఫెక్ట్. (కన్నడ నటుడు దర్శన్ కేసు నేపథ్యంలో)

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

దక్షిణంతో దక్షిణానికి...



జీ–7 నాయకుల శిఖరాగ్ర సమావేశానికి వేదికగా పూగ్లియాను ఎంచుకోవడం యాదృచ్ఛికం కాదు. అది దక్షిణ ఇటలీలో ఉంది. ఇది చారిత్రకంగా పశ్చిమ, తూర్పు దేశాల మధ్య వంతెన. ఇటలీ అధ్యక్షతన ఉన్న జీ–7 తరఫున మేము కోరుకుంటున్నది గ్లోబల్ సౌత్ దేశాలతో చర్చలను బలోపేతం చేయడం.

– జార్జియా మెలోనీ, ఇటలీ ప్రధాని

సా...గు...తోంది!



వాళ్లంటారు: ప్రయాణం ముఖ్యం, గమ్యం కాదని! ఇప్పటిదాకా నా 'ప్రయాణం' చూసుకుంటే... అన్నీ గుంతలు, అక్కర్లేని స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్, తాగుబోతు డ్రైవర్లు, రోడ్ల మీద పొట్లాటలు, ఏదో ఒక నిర్మాణం జరుగుతూనే ఉండటం!

– శ్రేయా ధన్వంతరి, నటి

ఏమార్చుతున్నారా?



జమ్ములోని దాడులు కశ్మీర్ లోయలో ఇంకేదో పెద్దది జరపడానికి ఏమార్చడం కాదని ఆశిస్తాను. ఏదో అనిపిస్తోంది... జమ్ము కశ్మీర్‌లో వెంటవెంటనే ఇలా దాడులు జరగడం అసాధారణమే.

– సునందా వశిష్ఠ్, కాలమిస్ట్

పోరాడాలా?




1920 వరకు, మహిళలు ఓటు వేయడం చట్టవ్యతిరేకం. 1964 వరకు, ఆమె మహిళ అయినందువల్ల ఉద్యోగ అభ్యర్థనను తిరస్కరించడం చట్టబద్ధం. 1974 వరకు, బ్యాంకులు మహిళలకు క్రెడిట్ కార్డులు ఇవ్వడానికి తిరస్కరించడం చట్టబద్ధం. తమ ప్రాథమిక మానవ హక్కుల కోసం మహిళలు పితృస్వామ్యం మీద పోరాడాలా?

– బెర్నీ శాండర్స్, అమెరికా నేత

ఇన్ బాక్స్

విప్లవ జ్యోతి

ప్రపంచ ప్రజలను ప్రభావితం చేసిన విప్లవ నాయకుడు చే గువేరా. అర్జెంటీనాకు చెందిన ఈ మార్క్సిస్ట్ విప్లవకారుడు... వైద్యుడు, రచయిత, మేధావి, గెరిల్లా నాయకుడు, సైనిక సిద్ధాంతకర్త, క్యూబన్ విప్లవంలో ముఖ్యుడు. ఆయన అసలు పేరు ఎర్నెస్టో 'చే' గువేరా. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసారియోలో జన్మించారు. ఆయనకు ఆస్తమా వ్యాధి వుండేది. ఆ వ్యాధితో బాధపడుతూనే విప్లవ పోరాటాలు చేశారు. లాటిన్ అమెరికాలో పర్యటన సమయంలో అక్కడి పేదరికం చూసి చలించిపోయారు. దీనికి కారణం ఆర్థిక తారతమ్యాలు, ఏకస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థ, నూతన వలసవాదం, సామ్రాజ్యవాదాలేనని భావించారు. సమకాలీన వ్యవస్థపై తిరుగుబాటు చేయడం ద్వారా సమస్యలను పరిష్కరించవచ్చని భావించారు. అందుకే విప్లవం బాట పట్టారు.



మెక్సికోలో ఉంటున్న సమయంలో రౌల్, ఫిడెల్ కాస్ట్రోలను కలిశారు. అప్పటి నుంచి వారితో భుజం భుజం కలిపి క్యూబాను బాటిస్టా పాలన నుంచి విముక్తి చేయడానికి పోరాడారు. విప్లవకారుల్లో ముఖ్యమైన వ్యక్తిగా, సైన్యంలో రెండవ స్థానానికి చేరుకుని, నియంతృత్వ బాటిస్టాపై జరిగిన గెరిల్లా పోరాటంలో కీలక పాత్ర పోషించారు. క్యూబా తిరుగుబాటు తర్వాత ఏర్పడిన ప్రభుత్వంలో అనేక ప్రధాన బాధ్యతలను స్వీకరించారు. మంచి వ్యవసాయ సంస్కరణలను ప్రవేశపెట్టారు. జాతీయ బ్యాంకు అధ్యక్షునిగా, క్యూబా సైనికదళాల బోధనా నిర్దేశకునిగా, క్యూబన్ సామ్యవాద దౌత్యవేత్తగా ప్రపంచ వ్యాప్తంగా పర్యటనలు చేశారు.

గెరిల్లా యుద్ధ తంత్రంపై ఆధార గ్రంథాన్ని రాశారు. దక్షిణ అమెరికాలో ఆయన జరిపిన యూత్ మోటార్ సైకిల్ యాత్ర జ్ఞాపకాల ఆధారంగా పుస్తకం రాశారు. గువేరా 1965లో క్యూబాను వదలి కాంగో కిన్షాసాలోనూ, బొలీవియాలోనూ యుద్ధాలకు నాయకత్వం వహించారు.

బొలీవియా యుద్ధంలో పాల్గొని, 1967 అక్టోబర్ 9న అక్కడి సైనికాధికారులకు పట్టుబడి కాల్చివేతకు గురయ్యారు. అలా తాను పుట్టిన దేశం వదలి ప్రపంచ పీడితుల పక్షాన వివిధ దేశాల్లో పోరాటాలు చేస్తూ అసువులు బాసి ఆధునిక విప్లవం మీద తనదైన ముద్ర వేశారు చే!

– ర్యాలి ప్రసాద్, కాకినాడ
(నేడు చే గువేరా జయంతి)

గ్రామ రాజ్యం బీసీల పరం కావాలి!


అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

తెలంగాణ పల్లెల్లో నేటికీని కొనసాగుతున్న ఆధిపత్య వర్గాల పెత్తందారీతనాలు నామరూపాలు లేకుండా పోవాలంటే స్థానిక రాజ్యాలు (సంస్థలు) బహుజన వర్గాల చేతుల్లోకి రావాలి. స్థానిక రాజ్యాలైన గ్రామపంచాయతీ, మండల పరిషత్తు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, జిల్లా పరిషత్, కో ఆపరేటివ్ సొసైటీలు, డీసీసీబీలు, డీసీఎంఎస్‌లు, స్కూలు కమిటీలు, గ్రామ అభివృద్ధి కమిటీలలోకి పెద్దసంఖ్యలో చదువుకున్న బహుజన యువకులు రావాలి. అంటే బీసీ యువత పెద్దఎత్తున స్థానిక గ్రామీణ రాజకీయ రంగంలోకి రావాలి. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి స్థానిక పాలనలో రాజ్యాంగబద్ధంగా ఉన్న రిజర్వేషన్ల స్థానాల్లోకి చదువుకున్న దళిత, గిరిజన, ఆదివాసీ, మైనారిటీ తెగలకు చెందిన యువత రావాలి. ఈ పని జరిగినప్పుడే గ్రామాలలో సామాజిక మార్పులు సాధ్యమవుతాయి.

తరతరాలుగా బీసీ వర్గాలకు చెందినవాళ్ళు ఎంబీసీలు, సంచార, అర్ధసంచార జాతులు, ఉత్పత్తి కులాలకు చెందినవాళ్ళు సంపద సృష్టికర్తలుగా ఉన్నారు. కానీ రాజకీయ రంగంలోకి మాత్రం రాలేదు. సమాజంలో సగానికిపైగా ఉన్న ఉత్పత్తి కులాలకు చెందినవారి భాగస్వామ్యం స్థానిక సంస్థల్లో లేకపోవడం వల్ల ఆ వర్గాలు తీవ్రంగా నష్టపోయాయి. అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన కులాల సమస్యల పరిష్కారాలు ఆ యా కులాలవారు రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నప్పుడే సాధ్యమవుతుంది. తరతరాలుగా విన్నపాలు, విజ్ఞప్తులు పట్టుకుని గ్రామ పంచాయతీలు, మండల, జడ్పీ కార్యాలయాలు, కలెక్టరేట్‌ల దగ్గర నుంచి సచివాలయాల వరకు చెప్పులరిగేలా తిరిగిన బహుజన కులాలవాళ్ళు తమ సమస్యల పరిష్కారానికి తామే స్థానిక రాజ్యాల నాయకులు కావటం చాలా మార్పులకు దారితీస్తుంది. ఇది బీసీలకు రాజకీయ న్యాయంగా మాత్రమే కాకుండా మొత్తంగా సామాజిక పరివర్తనగా చూడాలి.



గ్రామాలు దేశానికి ఊపిరైతే ఆ గ్రామాలకు ఉత్పత్తి కులాలు, ఉత్పత్తి శక్తులే ప్రాణాలు. బీసీల్లో చదువుకున్న కొత్తతరం తనకున్న పరిశోధనాత్మక ఆలోచనలను గ్రామాభివృద్ధిపై పెడితే ఊహించని అద్భుత ఫలితాలు వస్తాయి. గ్రామం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తన చుట్టూ ఉన్న సహజ వనరులను ఉపయోగించుకుని సంపద సృష్టించే కేంద్రంగా మారుతుంది. కులవృత్తులు నేడు కునారిల్లుతున్నాయి. అవి అత్యాధునిక రూపం దాల్చితేనే నేటి ప్రపంచానికి అవసరమైన సంపదలను అందించే కేంద్రంగా గ్రామాలను తయారుచేయడం సాధ్యమవుతుంది.

ఇదంతా జరగాలంటే స్థానిక సంస్థలపై బహుజనుల అధికారం నెలకొనాలి.

జనాభాలో బీసీల సంఖ్యను బట్టి దామాషా ప్రకారం అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి. ఆ యా బీసీ కులాలవారు అన్ని రంగాల్లో శిరసెత్తుకుని నిలిచేందుకు తమ అస్తిత్వ ఉద్యమాలను కొనసాగించక తప్పదు. దీన్ని కులకోణంగా తప్పుడు విశ్లేషణలు చేసి బడుగుల చైతన్యాన్ని పక్కదారి పట్టించే పనిని ఆధిపత్య వర్గాలు విస్తృతంగా చేస్తూ ఉన్నాయి. కులగణన చేయాలని అస్తిత్వ కోణం నుంచి అడుగుతుంటే అడ్డుతగులుతూ కులగణన చేస్తే దేశ సమగ్రత దెబ్బతింటుదన్న వాదనలు తీసుకువస్తున్నారు. బీసీలు సంపూర్ణ రాజకీయ సాధికారత సాధించకుండా సమాజ వికాసం సంపూర్ణం కాదు. ఈ విషయాన్ని మరుగున పరుస్తూ బీసీల అస్తిత్వమే లేకుండా చేసేందుకు ఆధిపత్య వర్గాలు పనిచేయటం కొత్తేమీ కాదు. బడుగులకు విద్యా, ఉద్యోగ విషయాలలో రిజర్వేషన్లు ఇచ్చేందుకు మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేసే సమయంలో ఆధిపత్య వర్గాలు సృష్టించిన అలజడులు అన్నీ ఇన్నీ కావు. అన్ని పార్టీలలోని ఆధిపత్యవర్గాలు తెరవెనుకనుంచి చేసిన కుట్రలన్నీ చరిత్రలో పదిలంగా రికార్డయ్యే ఉన్నాయి. ఇపుడు బీసీల కులగణన చేయమంటే సమాజం కులాల పేరున విడిపోయి అల్లకల్లోలం అవుతుందన్న వాదనలు ఆధిపత్య వర్గాలు ముందుకు తెస్తున్నాయి. తెలంగాణ ప్రజలు స్వీయరాజకీయ అస్తిత్వం కోణం నుంచి 14 ఏళ్ళ సుదీర్ఘ పోరాటం నిర్వహించి రాష్ట్ర సాధనలో విజయం సాధించి ప్రపంచ అస్తిత్వ ఉద్యమాలలో నిలిచారు. స్వరాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణ ప్రజలు ఇపుడు బహుజన స్వీయరాజకీయ అస్తిత్వాన్ని సాధించుకోవాలి. ఇది సాధించినప్పుడే స్వరాష్ట్రం సాధించుకున్న లక్ష్యం పరిపూర్ణమవుతుంది.


ఈ దిశలోనే స్థానిక సంస్థల్లో బీసీలకు తమ జనాభా ఎంతో అంత శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. 2023 ఎన్నికల్లో బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ విడుదల చేసి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తానని వాగ్దానం చేసింది. జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సందర్భంగా బడుగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాహుల్ గాంధీ, కులగణన చేస్తామని దేశమంతా చెబుతున్నారు. కులగణన చేసి స్థానిక సంస్థల్లో 'మేమెంతో మా వాటా అంత రిజర్వేషన్లు ఇవ్వాల'నీ, ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీలు బెగ్గిసి అడుగుతున్నారు. ఈ విషయంలో బీసీలపై కాంగ్రెస్‌కు ఉన్నది అసలు ప్రేమా లేక ఓట్ల కోసం చేసిన వాగ్దానమా బట్టబయలు కావల్సి ఉంది. ఏం జరుగబోతుందోనని 2 కోట్ల మంది బీసీలు ఎదురు చూస్తున్నారు.

వ్యాసకర్త కవి, రచయిత

దేవుడు స్వతంత్రుడా?

ఈ సృష్టిలో నిజంగా స్వతంత్రులెవరైనా ఉన్నారా? లౌకిక ప్రపంచాన్ని గమనిస్తే... కుటుంబసభ్యులు కుటుంబ యజమాని వశంలో ఉంటారు. ఆ యజమాని తనకు జీవనోపాధి ఇచ్చే మరో యజమానికి వశుడు. ఆ యజమాని కూడా చట్టానికీ, ప్రభుత్వానికీ లోబడవలసిందే. సర్వమైన పాలన అందించే ప్రభువు కూడా ప్రజల అభీష్టాలకు అనుగుణంగా పాలించాలి. పూర్తి స్వతంత్రుడు కాలేడు. ఇక ప్రజాస్వామ్యమైతే, ప్రజలే స్వాములని పేరులోనే ఉంది. పాలకులు సేవకులు!

ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే... జగత్తంతా దైవాధీనం. శివుడి ఆజ్ఞ లేకుండా చీమ చిటుక్కుమనడం కూడా జరగదని నమ్మకం. 'నా వల్లనే ఈ జగత్తంతా నడుస్తుంది!' –మత్తః సర్వ ప్రవర్తతే– అని గీతాచార్యుడి ప్రకటన. 'పరమాత్మనైన నేను అధిష్ఠానంగా ఉంటుండగా, త్రిగుణాత్మకమైన నా మాయా శక్తి త్రిలోకాలను సృష్టిస్తుంది. భూతకోటి యావత్తూ ఈ మాయా శక్తి వశులై నడుస్తారు' అంటాడు. అలాంటప్పుడు, ఇక ప్రాణులకు స్వాతంత్ర్యం ఎక్కడ? ఏపాటి? పోనీ ఆ దైవం స్వతంత్రుడా అంటే, పూర్తి స్వతంత్రం ఆయనకూ లేదు. ఆ భగవంతుడిని తమ వశంలో ఉంచుకోగల వాళ్ళు కూడా ఉన్నారు.



భాగవతంలో దుర్వాస మహర్షి అంబరీషుడిని అకారణంగా సంహరించబోగా, విష్ణుమూర్తి సుదర్శన చక్రం, తనకున్న దుష్ట శిక్షణ కర్తవ్యాన్ని అనుసరించి, తనంతట తానే మునీంద్రుడిని తరుముతూ వెళ్తుంది. దాన్ని తప్పించుకునే మార్గం తెలియక, తిరిగి తిరిగి ముని చివరికి విష్ణుమూర్తినే ప్రార్థిస్తాడు.

'నీ ఆయుధాన్ని ఉపసంహరించుకుని నన్ను రక్షించ'మని. 'అంత స్వతంత్రం నాకెక్కడిది?' అంటాడు విష్ణుమూర్తి. 'అహం భక్త పరాధీనః, అస్వతంత్రః ఇవ ద్విజ!– ఓ మునీంద్రా, నేను నా భక్తుల అధీనంలో ఉండేవాడిని. అక్కడ నాకు స్వతంత్రం లేదు. నా హృదయం వాళ్ళకు బందీ. సద్గుణవతులైన స్త్రీలు, సత్పురుషులైన తమ భర్తలను వశం చేసుకొన్నట్టు, ఆ సాధువులు నన్ను వశం చేసుకుంటారు. నా ఆయుధాన్ని ఆపగల శక్తి అంబరీషుడికే ఉంది. నాకు లేదు!'

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.అష్టమి రా.10.54 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తర పూర్తి(24 గంటలు), **వర్జ్యం:** ప.12.52 నుండి 2.39 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.58 వరకు, తదుపరి ప.12.27 నుండి 1.19 వరకు, **అమృత ఘడియలు:** రా.11.32 నుండి 1.19 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.31.

అవును..'ఉగాది పచ్చడే'

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే అధికార కాంగ్రెస్ పార్టీకి మిశ్రమ ఫలితాలు

రాజకీయ వర్గాల్లో చర్చ

- ఏకంగా 42 చోట్ల ఓట్ల సంఖ్యలో పెరుగుదల.. అసెంబ్లీ కంటే పార్లమెంట్‌కే ఎక్కువ
- 8 ఎంపీ స్థానాల పరిధిలోనూ పెరిగిన ఓట్లు
- ఓట్లు పెరిగిన ఆరింట ఓటమి... ఓట్లు తగ్గినా ఆరింట గెలుపు
- ఉత్తమ్, భట్టి మినహా అందరు మంత్రుల నియోజకవర్గాల్లో లాస్
- సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 23వేల తక్కువ ఓట్లు



సాక్షి, హైదరాబాద్: 'పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలు కొంచెం తియ్యగా..కొంచెం పుల్లగా, కొంచెం వగరుగా వచ్చాయి. ఈ ఫలితాలు ఉగాది పచ్చడిలా ఉన్నాయి.'... లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్య ఇది. నిజంగా ముఖ్యమంత్రి చెప్పినట్టే అధికార కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయని గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరునెలలే అవుతున్న నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు రావడం దేనికి సంకేతమన్నది ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఏకంగా 42 చోట్ల అధికంగా ఓట్లు సాధించడం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తన పట్టు నిరూపించుకోగా, సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న చాలా స్థానాల్లో ఓట్లు తగ్గడం గమనార్హం. మొత్తం 17 లోక్‌సభ స్థానాలకుగాను ఎనిమిది చోట్ల అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు రాగా, తొమ్మిది చోట్ల తగ్గాయి. అయితే, అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు వచ్చినా కేవలం రెండు చోట్ల మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. మిగిలిన ఆరు చోట్ల ఓడిపోయారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చినా, ఆరుస్థానాల్లో త్రిముఖ పోటీ కారణంగా కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగలిగారు. ఇక, రాష్ట్ర మంత్రివర్గం విషయానికి వస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల్లో తక్కువ ఓట్లు వచ్చాయి. ఆయన సొంత పార్లమెంట్ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఇతర మంత్రుల్లో కేవలం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్, మధిర స్థానాల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు రాగా, మిగిలిన అందరు మంత్రులు తమ తమ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల కంటే తక్కువ ఓట్లతో సరిపెట్టుకున్నారు. మొత్తంమీద అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ పోటీ చేసిన స్థానం మినహా 92,35,792 ఓట్లు కాంగ్రెస్ పార్టీకి రాగా, లోక్‌సభ ఎన్నికల్లో 86,53,707 ఓట్లు వచ్చాయి. ఓట్ల శాతం 39 నుంచి 40.5 శాతానికి పెరిగినా, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే అధికార కాంగ్రెస్ పార్టీ 5.82లక్షల ఓట్లు కోల్పోవడం గమనార్హం.

పోస్టుమార్టం హైలైట్స్ ఇవే :

- గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానం పరిధిలో ఓట్లు భారీగా పెరిగాయి. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్ల సంఖ్య భారీగా పెరిగింది. సిర్పూర్, ముథోల్ నియోజకవర్గాల్లో అయితే అసెంబ్లీ ఎన్నికల కంటే 50వేల కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి.
- పెద్దపల్లి లోక్‌సభ ఎంపీ స్థానం గెలిచినా, ఆ సెగ్మెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో ఓట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది.
- కరీంనగర్‌లోనూ అన్ని అసెంబ్లీ స్థానాల్లో ఓట్లు తగ్గాయి. అత్యధికంగా మానకొండూరు నియోజకవర్గంలో 44వేల ఓట్లు తక్కువ వచ్చాయి.
- అసెంబ్లీ ఎన్నికల కంటే నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో 72వేల ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఈ పార్లమెంటు పరిధిలోనికి వచ్చే ఆర్మూరు, బోధన్, నిజామాబాద్ అర్బన్, కోరుట్ల, జగిత్యాల స్థానాల్లో ఓట్లు పెరగ్గా, నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాల్లో తగ్గాయి.
- జహీరాబాద్‌లో అసెంబ్లీ ఎన్నికల కంటే స్వల్పంగా ఓట్లు తగ్గినా, ఆ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఇక్కడ బాన్సువాడ, కామారెడ్డి, జహీరాబాద్ అసెంబ్లీ స్థానాల్లో ఓట్లు పెరగ్గా, మిగిలిన చోట్ల తగ్గాయి.
- మెదక్ పార్లమెంట్ పరిధిలో కూడా అసెంబ్లీ ఎన్నికల కంటే అతి స్వల్పంగా 7వేల ఓట్లు ఎక్కువ వచ్చాయి. అయితే, సిద్దిపేటలో 9,968 ఓట్లు, గజ్వేల్‌లో 32,971 ఓట్లు అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ వచ్చాయి. సంగారెడ్డిలో స్వల్పంగా ఓట్లు పెరిగాయి.
- మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు ఎక్కువ.
- సికింద్రాబాద్‌లో కూడా అసెంబ్లీ ఎన్నికల కంటే 1.4 లక్షల ఓట్లు ఎక్కువ పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చాయి.
- ఎంఐఎం అడ్డా హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. తెలంగాణ మొత్తంగా చూస్తే.. అత్యల్పంగా కేవలం 62,497 ఓట్లు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి పడ్డాయి.
- చేవెళ్లలోనూ అసెంబ్లీ కంటే లోక్‌సభ ఎన్నికల్లో స్వల్ప ఆధిక్యత కనిపించింది.
- మహబూబ్‌నగర్‌లో అసెంబ్లీ ఎన్నికల కంటే 1.10లక్షల ఓట్లు తగ్గాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే 23వేల ఓట్లు తగ్గాయి.
- నాగర్‌కర్నూల్‌లో ఓట్లు తగ్గినా త్రిముఖ పోటీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగలిగింది. ఇక్కడ కూడా అన్ని అసెంబ్లీ స్థానాల పరిధిలో లోక్‌సభ ఎన్నికల కంటే తక్కువ ఓట్లు కాంగ్రెస్ పార్టీకి లభించడం గమనార్హం.
- తెలంగాణలోనే రికార్డు మెజారిటీతో గెలిచిన నల్లగొండ పార్లమెంట్ స్థానం పరిధిలోనికి వచ్చే హుజూర్‌నగర్, సూర్యాపేట అసెంబ్లీ స్థానాల్లో లోక్‌సభకు ఓట్లు పెరిగాయి. మిగిలిన చోట్ల స్వల్పంగా తగ్గాయి. సూర్యాపేటలో ఏకంగా 32వేల ఓట్లు అధికంగా లభించాయి.
- భువనగిరి లోక్‌సభ పరిధిలోకి వచ్చే అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తక్కువ ఓట్లు వచ్చాయి.
- వరంగల్‌లో కూడా అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు తగ్గాయి.
- మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోనూ అసెంబ్లీ ఎన్నికల కంటే తక్కువ ఓట్లే వచ్చాయి. కేవలం భద్రాచలం అసెంబ్లీ పరిధిలో (ఇక్కడ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచింది.) మాత్రమే ఓట్లు పెరగ్గా, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన ప్రతి చోటా ఓట్లు తగ్గాయి.
- ఖమ్మం లోక్‌సభ పరిధిలో ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం, పాలేరులో ఓట్లు తగ్గాయి. ఖమ్మం అసెంబ్లీ పరిధిలో అత్యధికంగా 10వేల ఓట్లు తగ్గడం గమనార్హం.
- మొత్తం మీద ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల, సికింద్రాబాద్, నల్లగొండ, ఖమ్మంలలో అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు రాగా, మిగిలిన చోట్ల తక్కువ వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల కంటే తక్కువ ఓట్లు వచ్చినా, భువనగిరి, మహబూబాబాద్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, వరంగల్, జహీరాబాద్‌లలో త్రిముఖ పోటీ కారణంగా కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు.

ఇటీవలి రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి లభించిన ఓట్ల వివరాలు

పార్లమెంట్ స్థానం	2023 అసెంబ్లీ	2024 లోక్‌సభ
ఆదిలాబాద్	2,52,286	4,71,220
పెద్దపల్లి	6,82,033	4,71,990
కరీంనగర్	5,12,352	3,77,446
నిజామాబాద్	4,08,135	4,80,501
జహీరాబాద్	5,49,143	5,22,634
మల్కాజ్‌గిరి	5,82,914	5,93,337
సికింద్రాబాద్	2,80,607	4,20,619
హైదరాబాద్	1,01,014	62,497
చేవెళ్ల	6,09,527	6,30,861
మహబూబ్‌నగర్	6,11,514	5,01,152
నాగర్‌కర్నూల్	6,39,628	4,59,269
నల్లగొండ	7,66,069	7,72,254
భువనగిరి	8,17,279	6,23,762
వరంగల్	6,63,556	5,75,566
మహబూబాబాద్	6,85,897	6,08,505
ఖమ్మం	6,52,957	6,54,195
మొత్తం	92,35,792	86,53,707

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మంత్రుల నియోజకవర్గాల్లో పార్లమెంట్‌కు పోలైన ఓట్లలో తేడా వివరాలివే

మంత్రిమండలి సభ్యులు	నియోజకవర్గం	తేడా
ఎ. రేవంత్‌రెడ్డి	కొడంగల్	-23,010
భట్టి విక్రమార్క	మధిర	5,117
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	హుజూర్‌నగర్	16,493
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	నల్లగొండ	-2,775
దామోదర రాజనర్సింహ	ఆందోల్	-31,535
డి. శ్రీధర్‌బాబు	మంథని	-16,585
పొన్నం ప్రభాకర్	హుస్నాబాద్	-21,954
పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి	పాలేరు	-10,557
తుమ్మల నాగేశ్వరరావు	ఖమ్మం	-7,757
జూపల్లి కృష్ణారావు	కొల్లాపూర్	-16,229
కొండా సురేఖ	వరంగల్ ఈస్ట్	-1,130
డి. అనసూయ	ములుగు	-15,442

సానుకూలతలున్నా...!

అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి అనేక సానుకూలతలున్నా, ఉగాది పచ్చడి లాంటి ఫలితాలు రావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో సీపీఎం కాంగ్రెస్ పార్టీకి అధికార మిత్రపక్షంగా తోడయింది. ఎంఐఎం పోటీ చేయని స్థానాల్లో ఆ పార్టీ బహిరంగంగానే కాంగ్రెస్ పార్టీకి మద్దతిచ్చింది. జాతీయస్థాయి రాజకీయాల నేపథ్యంలో ముస్లిం మైనారిటీలు కాంగ్రెస్ వైపు నిలిచారనే అంచనాలున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా అధికారంలో ఉన్న కారణంగా ఉండే సానుకూలత, వనరులు ఆ పార్టీకి అదనపు బలాన్నిచ్చాయి. ఇన్ని సానుకూలతల నేపథ్యంలోనూ అధికార కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలతో సరిపెట్టుకోవడం గమనార్హం.



ఈ ఫొటోలో దంతె లాగుతున్న బాలిక పేరు నందిని. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆరగిద్ద గ్రామంలో పదో తరగతి చదువుతున్న నందిని పెంచికలపాడు గ్రామంలో పత్తి సాగు చేస్తున్న తన తండ్రి తిమ్మప్పకు ప్రతిరోజూ వ్యవసాయ పనుల్లో సాయపడుతుంటుంది. గురువారం పత్తి చేనులో కలుపు నివారణ కోసం కాడెద్దుగా మారి దంతె లాగుతున్న సమయంలో 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది. - గట్టు (జోగుళాంబ గద్వాల జిల్లా)

రుణమాఫీని వెంటనే చేయాలి: సీపీఎం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. 2 లక్షల వరకున్న పంట రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం జరిగిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడారు.

'అదుపులోకి తీసుకున్న ఆరుగురికి ప్రాణహాని ఉంది'

సాక్షి, హైదరాబాద్ : ఈనెల 12న ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో గ్రేహౌండ్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆరుగురికి ప్రాణహాని ఉన్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలంగాణ పౌరహక్కుల సంఘం ఆరోపించింది. నిరాయుధులైన దళ సభ్యులు రీతా, మోతీ, ఇద్మాల్లతోపాటు తమ పనులరీత్యా అడవికి వెళుతున్న ముగ్గురు సాధారణ పౌరులను బలగాలు అదుపులోకి తీసుకున్నాయని అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి నారాయణరావు ఆరోపించారు.

ప్రహరీ కూలి ముగ్గురు కూలీల దుర్మరణం

- న్యాయం చేయాలని కార్మిక సంఘాల డిమాండ్
- ఘటనాస్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, సీపీ



మృతదేహాలను బయటకు తెస్తున్న దృశ్యం



హన్మంతు (ఫైల్)



పోషం (ఫైల్)



శంకర్ (ఫైల్)

మంచిర్యాల క్రైం: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ముగ్గురు కూలీలు నిర్మాణ పనులు చేస్తూ ప్రహరీ గోడ కూలి దుర్మరణం చెందారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకున్న ఈ దుర్ఘటన వివరాలిలా.. స్థానిక బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో నందిని ఆస్పత్రి నిర్వాహకులు నూతన భవనం నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం రుద్రపురం గ్రామానికి చెందిన ఏనంక హన్మంత్(35), బాబాపూర్‌కు చెందిన ఆత్రం శంకర్(40), చింతలమానెపల్లికి చెందిన గోలేం పోషం (50) సెల్లార్‌లో పనులు చేస్తున్నారు. పనుల్లో భాగంగా పిల్లర్ల మధ్యలో మట్టి, బండలు నింపుతుండగా పక్కనే ఉన్న పాత ప్రహరీ గోడ ఒక్కసారిగా కూలి పోషం, శంకర్, హన్మంత్‌పై పడడంతో దానికింద నలిగి అక్కడికక్కడే మృతిచెందారు. వీరి పక్కనే పనిలో ఉన్న రాములును మరో ఇద్దరు కూలీలు లాగడంతో స్వల్ప గాయాలై ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, స్థానికులు రెండు గంటలపాటు డ్రిల్లర్, జేసీబీ సాయంతో శ్రమించి మృతదేహాలను వెలికి తీశారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టాయి. ఘటనాస్థలాన్ని అదనపు కలెక్టర్ రాహుల్, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించి ప్రమాద వివరాలు సేకరించారు.

బీదర్, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చోరీ

- సిగ్నల్ ట్యాంపరింగ్ చేసి రైళ్లను ఆపిన దుండగులు?
- ఖమ్మం జిల్లా చింతకాని సమీపంలో ఘటన

చింతకాని: ఖమ్మం జిల్లా చింతకాని రైల్వేస్టేషన్ సమీపాన రెండు రైళ్లలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఒకే ప్రాంతంలో రెండు రైళ్లకు సిగ్నల్ రాకపోవడంతో కొద్ది సమయం నిలిచిపోగా.. దుండగులు అదే అదనుగా ప్రయాణికుల ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వివరాలిలా.. విజయవాడ వైపు నుంచి ఖమ్మం వైపు బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్తుండగా చింతకాని రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే సిగ్నల్ డ్రాప్ కావటంతో లోకో పైలట్ నిలిపివేశాడు. దీంతో గుర్తుతెలియని దుండగులు ఎస్-4, 5, 9, 10 బోగీల్లోకి ఎక్కి గాఢ నిద్రలో ఉన్న మహిళల మెడలో ఉన్న బంగారు ఆభరణాలను లాక్కున్నారు. ఇంతలోనే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సిగ్నల్‌తో రైలు కదలగానే దుండగులు చెయిన్ లాగి బోగీల్లో నుంచి కిందకు దిగి పరారయ్యారు. ఆ తర్వాత కాసేపటికి విజయవాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలును కూడా చింతకాని స్టేషన్ సమీపాన దుండగులు సిగ్నల్ డ్రాప్ చేసి నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఈ రైలులోని ఎస్-1, 2 బోగీల్లోకి ఎక్కి మహిళల మెడలోని బంగారు ఆభరణాలను దొంగిలించి రైలు దిగి పరారయ్యారని చెబుతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న రైల్వే ఎస్పీ సలీమా, వైరా ఏసీపీ రహమాన్ రైల్వే పోలీసులు చేరుకుని ట్రాక్ సమీపాన, పరిసర ప్రాంతాల్లో గాలింపు ముమ్మరం చేశారు. కాగా, రైళ్లను నిలిపేందుకు దుండగులే సిగ్నళ్లను డ్రాప్ చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. ఈవిషయమై బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదని రైల్వే పోలీసులు చెబుతుండగా.. బాధితు ల్లో కొందరు గురువారం మధ్యాహ్నం, ఇంకొంద రు సాయంత్రం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో నే చోరీ ఘటనలు బయటపడినట్లు తెలుస్తోంది.

రైతు భూమిలో బ్యాంకు ఫ్లెక్సీ!

- అప్పు చెల్లించకుంటే వేలం వేస్తామంటూ హెచ్చరిక
- పోల్కంపేట గ్రామ రైతుల ఆందోళన
- అడ్డగోలుగా పెరిగిన వడ్డీ తగ్గించాలని విజ్ఞప్తి



సాక్షి, కామారెడ్డి/లింగంపేట: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నుంచి తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు రికవరీ కాకపోవడంపై బ్యాంకు అధికారులు కఠిన చర్యలకు దిగుతున్నారు. తనఖా పెట్టిన భూములను వేలం వేస్తామంటూ ఆ భూముల్లో ఏకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కామారెడ్డి జిల్లాలోని లింగంపేట మండలంలోని పోల్కంపేట, పర్మల్ల, శెట్పల్లి సంగారెడ్డి తదితర గ్రామాల రైతులు 2010 ప్రాంతంలో పెద్ద మొత్తంలో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. కొందరు కొన్ని వాయిదాలు చెల్లించి మానుకోగా, మరికొందరు అసలే చెల్లించలేదు. కొందరు మాత్రం పూర్తిగా చెల్లించారు. అయితే భూమిని తనఖా పెట్టి తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాల్సిందేనని బ్యాంకు అధికారులు కొన్నేళ్లుగా రైతులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ మేరకు పలుమార్లు నోటీసులిచ్చారు. భూములను వేలం వేస్తామని హెచ్చరించారు. అయితే అప్పులు తీసుకుని పదిపదిహేనేళ్లు కావడంతో వడ్డీలు పెరిగిపోయాయి. అప్పట్లో రూ.5 లక్షలు అప్పు తీసుకుంటే ఇప్పుడది రూ.15 లక్షలు దాటింది. ఇంత పెద్ద మొత్తం చెల్లించడం రైతులకు భారంగా మారింది. వడ్డీ తగ్గించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎన్నిసార్లు అవకాశం ఇచ్చినా అప్పులు చెల్లించడం లేదంటూ బ్యాంకర్లు ప్రత్యక్ష చర్యలకు దిగుతున్నారు. పోల్కంపేటలో ఓ రైతు పొలంలో భూమిని వేలం వేస్తామంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామానికి చెందిన రైతులంతా ఆందోళనకు గురవుతున్నారు. వడ్డీలు తగ్గిస్తే అప్పు తిరిగి చెల్లిస్తామని పేర్కొంటున్నారు.

చట్ట ప్రకారమే వ్యవహరిస్తున్నాం

బ్యాంకుకు భూమి తనఖా పెట్టి అప్పు తీసుకున్న రైతు తిరిగి చెల్లించకపోవడమే గాక, ఆ భూమిని అమ్ముకోవడం చట్టరీత్యా నేరం. బ్యాంకు తనఖాలో ఉన్న భూమిని ఎలా అమ్ముకుంటారు? ఆ భూమిపై బ్యాంకుకే హక్కు ఉంటుంది. లింగంపేట మండలంలో దాదాపు 7 వందల మంది రైతులు దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. వారిలో చాలామంది అప్పులు తిరిగి చెల్లించలేదు. సహకార చట్టం ప్రకారం వారందరికీ నోటీసులిచ్చాం. వారి ఆస్తులను జప్తు చేయడం, లేదా వేలం వేయడం జరుగుతుంది.

- కుమారస్వామి, బ్రాంచి మేనేజర్, ఎన్‌డీసీసీబీ, లింగంపేట

'నీట్' గ్రేసు మార్కులు రద్దు

1,563 మంది అభ్యర్థులకు వాస్తవ మార్కుల కేటాయింపు

- వారికి ఈ నెల 23న మళ్లీ పరీక్ష... జూన్ 30లోగా ఫలితాలు
- షెడ్యూల్ ప్రకారమే జూలై 6 నుంచి కౌన్సెలింగ్
- కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు సుప్రీంకోర్టు అనుమతి
- గ్రేసు మార్కులు రద్దయిన వారికి రెండు ఐచ్ఛికాలు
- మరోసారి పరీక్ష రాయవచ్చు లేదా వాస్తవ మార్కులతో కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చు
- కౌన్సెలింగ్ నిలిపివేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఎంబీబీఎస్‌తోపాటు ఇతర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష–అండర్ గ్రాడ్యుయేట్(నీట్–యూజీ)–2024లో 1,563 మంది అభ్యర్థులకు కేటాయించిన గ్రేసు మార్కులను రద్దుచేసి, వారికి మళ్లీ పరీక్ష నిర్వహించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నియమించిన కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఆయా అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు కేంద్రం చెప్పిన విషయాన్ని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. 1,563 మంది అభ్యర్థుల ప్రస్తుత స్కోరు కార్డు రద్దుచేసి, వాస్తవ మార్కులు కేటాయించి, జూన్ 23న వారికి మళ్లీ పరీక్ష నిర్వహించి, జూన్ 30లోగా ఫలితాలు వెల్లడిస్తామన్న ఎన్‌టీఏ ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్‌టీఏ కమిటీ చేసిన సిఫార్సులు న్యాయమైనవి, సహేతుకమైనవి, సమర్థనీయమైనవి అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మే 5న నిర్వహించిన నీట్–యూజీ పరీక్షలో వివిధ కారణాలతో 1,563 మందికి గ్రేసు మార్కులు ఇవ్వడాన్ని సవాలు చేయడంతోపాటు నీట్–యూజీ–2024ను మొత్తంగా రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరుతూ దాఖలైన వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ గురువారం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది కనూ అగర్వాల్ వాదనలు వినిపించారు. 1,563 మందికి ఇచ్చిన గ్రేసు మార్కులు రద్దుచేసి, వారికి మరోసారి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నీట్‌కు హాజరైన అభ్యర్థుల్లో భయాందోళన తొలగించడానికి ఎన్‌టీఏ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. 1,563 మంది అభ్యర్థుల స్కోరు కార్డును రద్దు చేయాలంటూ కమిటీ సిఫార్సు చేసిందన్నారు. గ్రేసు మార్కులు రద్దయిన అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించి, జూన్ 30లోగా ఫలితాలు వెల్లడిస్తామని ఎన్‌టీఏ తరఫు సీనియర్ న్యాయవాది నరేష్ కౌశిక్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారమే కౌన్సెలింగ్ జూలై 6 నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు. గ్రేసు మార్కులు రద్దయినవారికి రెండు ఐచ్ఛికాలు ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వారు మరోసారి పరీక్ష రాయవచ్చు లేదా గ్రేసు మార్కులు రద్దయిన తర్వాత వచ్చిన వాస్తవ మార్కులతో కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చని వెల్లడించింది. జూలై 6న ప్రారంభం కానున్న కౌన్సెలింగ్‌ను నిలిపివేసేందుకు ప్రభుత్వం నిరాకరించింది.

పిటిషన్లపై విచారణ ముగిస్తున్నాం..

''కోర్టు ముందుంచిన అన్ని అంశాలనూ పరిశీలించాం. జూన్ 12న ఎన్‌టీఏ కమిటీ చేసిన సిఫార్సులు న్యాయబద్ధంగా, సహేతుకంగా, సమర్థనీయంగా ఉన్నాయి. 1,563 మందికి మళ్లీ నీట్ నిర్వహించడానికి ఎన్‌టీఏకు అనుమతిస్తున్నాం. ఈ పిటిషన్లపై విచారణ ముగిస్తున్నాం. పరిహార మార్కులకు సంబంధించి అన్ని అంశాలను మూసివేసినట్లే. ఇతర సమస్యలకు సంబంధించి ప్రతివాదుల స్పందనకు రెండు వారాల గడువు ఇస్తున్నాం. తదుపరి విచారణను జూలై 8వ తేదీకి వాయిదా వేస్తున్నాం'' అని ధర్మాసనం తీర్పు వెలువరించింది.

అసలు ఏమిటీ వివాదం?

ఈ ఏడాది నీట్–యూజీ పరీక్షకు దేశవ్యాప్తంగా 24 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు మారడంతోపాటు మేఘాలయా, హరియాణా, ఛత్తీస్‌గఢ్, సూరత్, చండీగఢ్‌లోని మొత్తం ఆరు ఎగ్జామ్ సెంటర్లలో ఓఎంఆర్ షీట్లు చిరిగిపోవడం, ఒక పేపర్‌కు బదులు మరో పేపర్ ఇవ్వడం, తద్వారా పరీక్ష నిర్వహణలో జాప్యం వంటి కారణాలతో 1,563 మంది అభ్యర్థులకు నష్టపరిహారం కింద గ్రేసు మార్కులు ఇచ్చారు. ఈ ఏడాది మొత్తం 67 మంది ఫస్ట్ ర్యాంకు సాధించారు. వీరందరికీ 720కి 720 మార్కులు రావడం గమనార్హం. ఇలా జరగడం ఎన్‌టీఏ చరిత్రలో ఇదే మొదటిసారి. గత ఏడాది కేవలం ఇద్దరికే ఫస్టు ర్యాంకు వచ్చింది. ఈసారి ఫస్ట్ ర్యాంకు సాధించిన 67 మందిలో గ్రేసు మార్కులతో ఫస్టు ర్యాంకు కొట్టినవారు 50 మంది ఉన్నారు. ఫిజిక్స్ ఆన్సర్ కీలో మార్పుల వల్ల 44 మంది, ఎగ్జామ్‌లో సమయం కోల్పోవడం వల్ల ఆరుగురు గ్రేసు మార్కులు పొందారు.

కొందరికి ఇచ్చిన గ్రేసు మార్కుల వల్ల తాము నష్టపోతున్నామని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. ఈ మార్కుల కేటాయింపులో డబ్బు చేతులు మారిందని విమర్శించారు. కోర్టును ఆశ్రయించారు. అలాగే పరీక్ష పేపర్ లీక్ అయ్యిందని, ఎగ్జామ్‌లో రిగ్గింగ్ జరిగిందన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. చివరకు ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే, సుప్రీంకోర్టు 2018లో ఇచ్చిన తీర్పులో నిర్దేశించిన ఫార్ములా ప్రకారమే అభ్యర్థులకు గ్రేసు మార్కులు ఇచ్చామని, ఇందులో తమ సొంత నిర్ణయం ఏమీ లేదని నీట్‌ను నిర్వహించి, ఫలితాలు ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చెబుతోంది. అభ్యర్థుల్లో పోటీతత్వం పెరగడం వల్లే ఈసారి ఎక్కువ మందికి ఫస్టు ర్యాంకు వచ్చిందని, ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదని పేర్కొంటోంది. మరోవైపు, అభ్యర్థులకు ఇచ్చిన గ్రేసు మార్కులను పునః సమీక్షించడానికి కేంద్ర విద్యా శాఖ యూపీఎస్సీ మాజీ చైర్మన్ నేతృత్వంలో నలుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించింది.



సీబీఐతో దర్యాప్తు జరిపించాలి: ఖర్గే

న్యూఢిల్లీ: నీట్ పరీక్షలో అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో పేపర్ లీక్‌లు, పరీక్షల్లో రిగ్గింగ్‌లతో కోట్లాది మంది యువత భవిష్యత్తును నాశనం చేసిందని మండిపడ్డారు. నీట్‌లో గ్రేసు మార్కులు మాత్రమే సమస్య కాదని, పరీక్షలో రిగ్గింగ్ జరిగిందని, పేపర్ లీక్ అయ్యిందని, పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. నీట్ కుంభకోణంపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు. సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిష్పక్షపాత దర్యాప్తునకు తాము డిమాండ్ చేస్తామని తెలిపారు.

లీక్ కాలేదు, రిగ్గింగ్ జరగలేదు: ప్రధాన్

న్యూఢిల్లీ: నీట్–యూజీ పరీక్షలో ప్రశ్నపత్రం లీక్ అయ్యిందంటూ వచ్చిన ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఖండించారు. అందుకు ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని అన్నారు. పేపర్ లీక్‌గానీ, రిగ్గింగ్ గానీ జరగలేదని చెప్పారు. పేపర్ లీక్ అయ్యే అవకాశమే లేదని పేర్కొన్నారు. ఏ ఒక్క అభ్యర్థికీ అన్యాయం జరగకూడదన్నదే తమ ఉద్దేశమని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నీట్ పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కు ఎంతో విశ్వసనీయత ఉందని తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

యడ్యూరప్పపై అరెస్టు వారెంట్

- పోక్సో కేసులో జారీ చేసిన బెంగళూరు కోర్టు
- సీఐడీ అరెస్టు చేసే అవకాశం ఉందన్న కర్ణాటక హోంమంత్రి



బెంగళూరు: లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ చట్టం(పోక్సో) కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడ్యూరప్ప(81)పై బెంగళూరు కోర్టు గురువారం నాన్–బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈ కేసులో సీఐడీ ఇప్పటికే ఆయనకు సమన్లు ఇచ్చింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. కానీ, యడ్యూరప్ప హాజరు కాకపోవడంతో సీఐడీ బెంగళూరు కోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు నాన్–బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేసింది. యడ్యూరప్ప ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారని, తిరిగివచ్చిన తర్వాత సీఐడీ ఎదుట హాజరవుతారని ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. 17 ఏళ్ల తన కుమార్తెపై యడ్యూరప్ప లైంగిక దాడికి పాల్పడ్డారని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఓ సమావేశంలో ఆయన తన కుమార్తెను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి అకృత్యానికి పాల్పడ్డారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో యడ్యూరప్పపై పోక్సో చట్టంతోపాటు ఐసీసీ సెక్షన్ 354 కింద ఈ ఏడాది మార్చి నెలలో బెంగళూరు సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం గంటల వ్యవధిలోనే కర్ణాటక డీజీపీ ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను యడ్యూరప్ప ఖండించారు. ఈ కేసును చట్టపరంగా ఎదుర్కొంటానని చెప్పారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. యడ్యూరప్పపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ గత నెలలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆమె వాంగ్మూలాన్ని పోలీసులు అంతకుముందే రికార్డు చేశారు. పోక్సో కేసులో యడ్యూరప్పను సీఐడీ అరెస్టు చేసే అవకాశం ఉందని కర్ణాటక హోంశాఖ మంత్రి పరమేశ్వర చెప్పారు. దీనిపై సీఐడీ తుది నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.

అరుణాచల్ సీఎంగా పెమా ఖండూ

వరుసగా మూడోసారి ప్రమాణం



ఈటానగర్: అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా బీజేపీ నేత పెమా ఖండూ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం డోర్జీ ఖండూ స్టేట్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ కేటీ పర్నాయక్ ఆయనతో ప్రమాణం చేయించారు. మరో 11 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో 8 మంది కొత్తవారు కాగా, ఒక మహిళ కూడా ఉన్నారు. కార్యక్రమానికి హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, సిక్కిం సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ హాజరయ్యారు. అరుణాచల్ నూతన సీఎం పెమా ఖండూకు, మంత్రులకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఇటీవల అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 60 సీట్లున్న అసెంబ్లీలో బీజేపీ 46 సీట్లు గెల్చుకుంది.

రాజ్యసభ బరిలో సునేత్రా పవార్

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సతీమణి సునేత్ర ఎన్‌సీపీ అభ్యర్థిగా గురువారం రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభ ఎంపీ ప్రఫుల్ పటేల్, మంత్రి ఛగన్ భుజ్‌బల్, లోక్‌సభకు ఎన్నికైన సునీల్ తాట్కరే వెంటరాగా విధాన్ భవన్‌లో ఆమె నామినేషన్ సమర్పించారు. మిత్రపక్షాలైన బీజేపీ, శివసేన నుంచి ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. దేశం దృష్టిని ఆకర్షించిన బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో శరద్ పవార్ కూతురు సుప్రియా సూలే చేతిలో సునేత్ర ఓటమి పాలైన విషయం తెలిసిందే. పీయూష్ గోయల్, ఉదయన్ రాజే భోంస్లే (ఇద్దరూ బీజేపీ) ఇటీవలే లోక్‌సభకు ఎన్నిక కావడంతో మహారాష్ట్రలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి. అస్సాం, బిహార్‌లలో రెండేసి, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్తాన్, త్రిపురలలో ఒకటి చొప్పున రాజ్యసభ స్థానాలు కూడా ఖాళీ అయ్యాయి. ఆయా చోట సిట్టింగ్ సభ్యులు లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ఢిల్లీలో దాహం.. దాహం

హస్తినలో పెరుగుతున్న తాగునీటి ఎద్దడి

- ట్యాంకర్ల కోసం ఎగబడుతున్న జనం
- హిమాచల్, హరియాణాల నుంచి విడుదల చేయాల్సిన యమునా నీటిలో తీవ్ర జాప్యం
- ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో తాగునీటికి కటకట
- యమునా జలబోర్డే సమస్యను తీర్చగలదంటూ ఢిల్లీ సర్కార్ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



ఢిల్లీలోని వివేకానంద్ క్యాంప్‌లో గురువారం నీళ్ల ట్యాంకర్‌ను పైపులు, బకెట్లతో చుట్టుముట్టిన జనం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని తీవ్ర జల సంక్షోభం నెలకొంది. పొరుగు రాష్ట్రాల నుంచి నీటి సరఫరా తగ్గడంతో ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో నీటి ఎద్దడి దారుణంగా పెరిగింది. యమునా నదీ జలాల సరఫరా విషయంలో ఢిల్లీ, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్ మధ్య వివాదాలు తారాస్థాయికి చేరడంతో నీటి కష్టాలు తీవ్రమయ్యే ప్రమాదకర పరిస్థితి దాపురించింది. మండుతున్న ఎండలకు తోడు నీటి కొరతతో ప్రజలు అల్లాడుతుంటే ట్యాంకర్ మాఫియా, రాజకీయ నేతల మధ్య మాటల యుద్ధం ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

ఆగిన సరఫరా.. తగ్గిన నిల్వలు

ఢిల్లీ తాగునీటి అవసరాల్లో 90 శాతం యమునా నదీ మునాక్ కాలువ ద్వారా తీరుతోంది. మరికొంత ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఎగువ గంగ కాల్వల ద్వారా వచ్చే నీటితో ఢిల్లీ నీటి కష్టాలు తీరుతున్నాయి. యమునా నదిపై ఉన్న చంద్రవాల్, వజీరాబాద్, ఓక్లా నీటి శుద్ధి కర్మాగారాలుసహా మరో నాలుగు ప్లాంట్‌ల ద్వారా ఢిల్లీకి అవసరమైన నీటి సరఫరా జరుగుతోంది. ఢిల్లీకి ప్రతి రోజూ 1,200 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం ఉండగా ఢిల్లీ జల్ బోర్డు 950 మిలియన్ గ్యాలన్ల నీటినే సరఫరా చేస్తోంది. హరియాణా ప్రభుత్వం మునాక్ ఉప కాల్వల ద్వారా 683 క్యూసెక్కులు, ఢిల్లీ చిన్న కాల్వల ద్వారా మరో 330 క్యూసెక్కుల నీటిని వజీరాబాద్ నీటి శుద్ధి రిజర్వాయర్‌కు సరఫరా చేయాల్సి ఉంది. మొత్తంగా రోజుకి 1,013 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉన్నా హరియాణా ప్రభుత్వం కేవలం 840 క్యూసెక్కుల నీటినే విడుదల చేస్తోందని ఢిల్లీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. హరియాణా నీటి సరఫరాను తగ్గించడంతో ఉత్తర, పశ్చిమ ఢిల్లీకి నీటిని సరఫరా చేసే వజీరాబాద్ రిజర్వాయర్‌లో నీటి మట్టాలు తగ్గుతున్నాయి. రిజర్వాయర్‌లో సగటు నీటి మట్టం 674.5 అడుగులు కాగా ప్రస్తుతం 669 అడుగులకు పడిపోయింది. దీంతో రిజర్వాయర్ నుంచి రోజుకు 70 మిలియన్ గ్యాలన్‌ల నీరు మాత్రమే విడుదల అవుతోందని ఢిల్లీ జల వనరుల మంత్రి అతిశి ఆరోపించారు. దీంతో చాలా ప్రాంతాల్లో నీటి సరఫరా తగ్గి ట్యాంకర్లపై జనం ఆధారపడుతున్నారు. ఇదే అదునుగా ట్యాంకర్ మాఫియా రెచ్చిపోయింది. ఇష్టారీతిగా డబ్బులు వసూలు చేస్తోంది. నీటి ఎద్దడి అంశంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హరియాణా ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీతో మాట్లాడి, నీటి సరఫరా పెంచే విషయమై చర్చలు జరుపుతున్నారు.

మునాక్ కాలువ, ఇతర కాల్వల నుంచి ట్యాంకర్ మాఫియా నీటి దోపిడీపై ప్రత్యేక దర్యాప్తు బృందంచే విచారణ చేపట్టాలని బుధవారం బీజేపీ రాష్ట్ర శాఖ డీజీపీకి విజ్ఞప్తి చేసింది. నీటి ఎద్దడికి రాజధానిలా మారుతున్న ఢిల్లీలో చాలా కాలనీల్లో ఎటు చూసినా మహిళలు, చిన్నారులు బిందెలు, బకెట్లు పట్టుకుని పెద్దపెద్ద క్యూ లైన్లలో నిల్చున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

మాట మార్చిన హిమాచల్‌ప్రదేశ్

ఇన్నాళ్లూ నీటిని సరఫరా చేసిన హిమాచల్ ప్రదేశ్ మాట మార్చింది. తమ వద్ద 135 క్యుసెక్కుల మిగులు జలాలు లేవని, కావాలంటే యమునా బోర్డును ఆశ్రయించాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. హిమాచల్ నుంచి హరియాణాకు వచ్చిన మిగులు జలాలను ఢిల్లీ కోసం విడుదల చేయాలంటూ కేజ్రీవాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసిన నేపథ్యంలో ప్రతిగా హిమాచల్ సర్కార్ కోర్టులో అఫిడవిట్ సమర్పించింది. ఈ కేసును గురువారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ప్రసన్న బి.వరాలేల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. '' నీటి నిర్వహణలో ఢిల్లీ ప్రభుత్వం విఫలమైంది. కాల్వల ద్వారా నీటి పంపిణీ నష్టాలను తగ్గించడంలో, నీటి చౌర్యాన్ని నియంత్రించడం, తలసరి నీటి వినియోగాన్ని నియంత్రించడంలో ఢిల్లీ వైఫల్యం చెందింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పంపిణీ నష్టాలు 10శాతం ఉంటే ఢిల్లీలో ఏకంగా 52.35 శాతం నష్టాలు ఉన్నాయి. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్దేశకాల ప్రకారం పట్టణ నీటి తలసరి సరఫరా 135 లీటర్లుగా ఉంటే ఢిల్లీలో అతిగా 172 లీటర్లు సరఫరాచేస్తున్నారు. హిమాచల్ వద్ద వాస్తవానికి మిగులు జలాలు లేవు. ఉన్నాయంటూ గతంలో ఇచ్చిన ప్రకటనను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వండి' అని హిమాచల్ అడ్వొకేట్ జనరల్ కోర్టుకు విన్నవించుకున్నారు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. '' ఇదెంత తీవ్రమైన అంశమో మీకు తెలియట్లేదు. మీపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలో వద్దో తర్వాత తేలుస్తాం' అని ఆగ్రహం వ్యక్తంచేసింది. దీంతో గత ప్రకటన ఉపసంహరణకు పద్ధతి ప్రకారం అఫిడవిట్ సమర్పిస్తానని అడ్వొకేట్ జనరల్ చెప్పారు.

మాకంత నైపుణ్యం లేదు

హిమాచల్ వాదనలు విన్నాక మానవతా దృక్పథంతో నీటిని సరఫరా చేయాలని సాయంత్రంకల్లా ఎగువ యమునా జలబోర్డ్ వద్ద దరఖాస్తు పెట్టుకోవాలని ఢిల్లీ సర్కార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. '' యమునా నదీ జలాల పంపకం అనేది సంక్లిష్టమైన వ్యవహారం. ఇప్పటికిప్పుడు మధ్యేమార్గంగా నదీజలాల పంపకం సమస్యను తీర్చేంత స్థాయిలో మాకు సాంకేతిక నైపుణ్యం లేదు. 1994 అవగాహనా ఒప్పందం ద్వారా రాష్ట్రాలు ఏర్పాటు చేసుకున్న యమునా బోర్డే ఈ సమస్యకు పరిష్కారం చూపగలదు. అదనంగా 150 క్యూసెక్కుల కోసం ఢిల్లీ గతంలోనే దరఖాస్తు చేసుకుంది. దానిపై జలబోర్డ్ త్వరగా నిర్ణయం వెలువర్చాలి. లేదంటే శుక్రవారం నుంచి రోజువారీగా బోర్డ్ సమావేశమై సమస్యను పరిష్కరించాలి'' అని కోర్టు వ్యాఖ్యానించింది.

ఢిల్లీ ప్రభుత్వ వాదనేంటి?

నీటి ట్యాంకర్ల మాఫియాపై ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం తలంటిన నేపథ్యంలో గురువారం కేజ్రీవాల్ సర్కార్ అఫిడవిట్ సమర్పించింది. '' ట్యాంకర్ల మాఫియా హరియాణా వైపు ఉన్న యమునా నది వెంట రెచ్చిపోతోంది. ఆ ప్రాంతం ఢిల్లీ జలబోర్డ్ పరిధిలోకి రాదు. అసలు అక్కడ చర్యలు తీసుకునే అధికారం ఎవరికి ఉందో తేల్చాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం. స్పందన శూన్యం. హరియాణా నుంచి ఢిల్లీకి నీటి సరఫరా వృథాను 30 శాతం ఉంచి ఐదు శాతానికి తగ్గించాం'' అని అఫిడవిట్‌లో పేర్కొంది. గురువారం ఢిల్లీ ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ కోర్టులో వాదించారు. '' జలబోర్డులు ప్రభుత్వ అనుకూల అధికారులతో నిండిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో కమిటీ వేసి సుప్రీంకోర్టే సమస్యను పరిష్కరించాలి' అని అన్నారు. ఈ వాదనతో హరియాణా విభేదించింది. '' ఢిల్లీకి నీటిని సరఫరా చేసే వజీరాబాద్ బ్యారేజీలో కనీస నీట నిల్వలు ఉండాల్సిందే. అతి సరఫరా కుదరదు. ఈ అంశాన్ని యమునా బోర్డ్‌కు వదిలేస్తే మంచిది' అని హరియాణా తరఫున లాయర్ శ్యామ్ దివాన్ వాదించారు. ఈ అంశాన్ని ఇకపై జలబోర్డే చూసుకుంటుందని అదనపు సొలిసిటర్ జనరల్ విక్రమ్‌జీత్ బెనర్జీ చెప్పారు. దీంతో జలబోర్డులో తేల్చుకోండంటూ ఢిల్లీ సర్కార్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. మరోవైపు రోజుకు 5 కోట్ల గ్యాలన్ల నీటి సరఫరా తగ్గడంతో నీటిని వృథా చేయకండని ఢిల్లీవాసులకు ప్రభుత్వం సూచనలు చేసింది.

ఎన్ఎస్ఏగా మళ్లీ అజిత్ దోవల్

- ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీగా పీకే మిశ్రా కొనసాగింపు
- కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు



సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ)గా మాజీ ఐపీఎస్ అజిత్ దోవల్‌ను కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ గురువారం ఒక ఉత్తర్వులో పేర్కొంది. ఎన్ఎస్ఏగా అజిత్ దోవల్ నియామకం మూడో విడతలో జూన్ 10వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని చెప్పింది. ప్రధానమంత్రి మోదీ పదవీ కాలం వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా దోవల్ బాధ్యతల్లో కొనసాగుతారని స్పష్టం చేసింది. ఎన్ఎస్ఏ దోవల్‌కు ప్రాధాన్యతా క్రమంలో కేబినెట్ మంత్రి హోదా ఉంటుందని సిబ్బంది వ్యవహారాల శాఖ ఆ ఉత్తర్వులో వివరించింది. నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులపై మరో నోటిఫికేషన్ విడుదల చేస్తామని పేర్కొంది. కాగా, దోవల్‌ను ఎన్ఎస్ఏగా ప్రధాని మోదీ మొదటిసారిగా 2014 మే 31వ తేదీన నియమించారు. భద్రతకు సంబంధించిన జాతీయ, అంతర్జాతీయ అంశాల్లో ఎన్ఎస్ఏ ప్రధానికి సలహాదారుగా వ్యవహరిస్తారు. ఉత్తరాఖండ్‌లో పౌరీ గఢ్వాల్‌లో 1945లో జన్మించిన దోవల్ 1968లో ఐపీఎస్ అయ్యారు. పిన్న వయస్సులోనే ఇండియన్ పోలీస్ పతకం అందుకున్న అధికారిగా కూడా దోవల్‌కు పేరుంది. విశిష్ట సేవలకుగాను 1988లో కీర్తి చక్ర అందుకున్నారు.

ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీగా పీకే మిశ్రా

ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీగా మాజీ ఐఏఎస్ పీకే మిశ్రాను కొనసాగిస్తూ సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పీకే మిశ్రా పునర్నియామకం జూన్ 10వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపింది. వీరితోపాటు, అమిత్ ఖరే, తరుణ్ కపూర్‌లను ప్రధానమంత్రి సలహాదారులుగా జూన్ 10 నుంచి వచ్చే రెండేళ్లపాటు ప్రధాని కార్యాలయంలో మళ్లీ కొనసాగించాలని కేబినెట్ నియామకాల కమిటీ నిర్ణయించింది.

సిక్కింలో భారీ వర్షాలు

ఆరుగురు మృతి, చిక్కుకుపోయిన 1,500 మంది పర్యాటకులు

గ్యాంగ్‌టక్: సిక్కింను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వానలతో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఆరుగురు చనిపోయారు. వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో పర్యాటక ప్రాంతాలు గురుడోంగ్‌మర్ లేక్, యుంథంగ్ వ్యాలీల్లో 1,500 మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. రాకపోకలను పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని, ఎక్కడివారక్కడే ఉండిపోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సంగ్‌కలంగ్ వద్ద ఉన్న బెయిలీ వంతెన కొట్టుకుపోవడంతో మంగన్, డిజొంగు, చుంగ్‌తంగ్‌ల మధ్య సంబంధాలు తెగిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి.

పేలుడు పదార్థాల ఫ్యాక్టరీలో ప్రమాదం

ఆరుగురు మృతి.. ముగ్గురికి గాయాలు

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సమీపంలోని ఓ పేలుడు పదార్థాల కర్మాగారంలో సంభవించిన ప్రమాదంలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు చనిపోగా మరో ముగ్గురు గాయపడ్డారు. నగరానికి 25 కిలోమీటర్ల దూరంలోని ధామ్నా గ్రామంలో ఉన్న చాముండి ఎక్స్‌ప్లోజివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పేలుడు సంభవించింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తొమ్మిది మందిలో ఆరుగురు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తుండగానే చనిపోయారు.

'హమారే బారా' విడుదలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: ఈ నెల 14వ తేదీన విడుదల కావాల్సిన 'హమారే బారా' సినిమాపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఇస్లాంను, ముస్లిం వివాహిత మహిళలను కించపరిచేలా సినిమా ఉందంటూ వచ్చిన ఆరోపణలతో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల వెకేషన్ ధర్మాసనం ఏకీభవించింది. 'ఉదయం సినిమా ట్రైలర్‌ను చూశాం. అందులో మొత్తం అభ్యంతరకర డైలాగులే ఉన్నాయి'అని వ్యాఖ్యానించింది. అదే సమయంలో, ఈ పిటిషన్‌పై సత్వరమే నిర్ణయం తీసుకోవాలని బాంబే హైకోర్టుకు సూచించింది. అప్పటి వరకు స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

49లో 45 మంది భారతీయులే

కువైట్ అగ్నిప్రమాదం

కువైట్ సిటీ/ దుబాయ్: గల్ఫ్ దేశం కువైట్‌లో బుధవారం చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో అగ్నికి ఆహుతైన 49 మందిలో 45 మంది భారతీయులేనని అధికారులు తెలిపారు. మరో ముగ్గురు ఫిలిప్పీన్స్ దేశస్తులు కాగా మరో మృతదేహాన్ని గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. మృతుల్లో మలయాళీలు 24 మంది ఉన్నట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. ఆ రాష్ట్ర వాసులు మరో ఏడుగురు వివిధ ఆస్పత్రుల్లో ఐసీయూల్లో చికిత్స పొందుతున్నట్లు గుర్తించామని వెల్లడించింది. విదేశాంగ శాఖ నుంచి ధ్రువీకరణ సమాచారం అందాక బాధితుల వివరాలను వెల్లడిస్తామని తెలిపింది. కువైట్ దక్షిణ అహ్మదీ గవర్నరేట్‌లో మాంగాఫ్ ప్రాంతంలోని ఏడంతస్తుల భవనంలో బుధవారం వేకువజామున జరిగిన ప్రమాదంలో 49 మంది మృతి చెందగా మరో 50 మంది వరకు గాయపడ్డారు. గురువారం కువైట్ చేరుకున్న విదేశాంగ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ క్షతగాత్రులైన భారతీయులతో మాట్లాడి, వారికి అవసరమైన సాయం అందేలా చూస్తున్నారు. ముబారక్ అల్‌కబీర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న భారతీయులను పరామర్శించారు. అదేవిధంగా, మృతదేహాలను సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తరలించే ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

నీళ్ల ట్యాంకుపైకి దూకి..

ప్రమాదం చోటుచేసుకున్న సమయంలో ఆ భవనంలో కేరళలోని త్రిక్కారిపూర్‌కు చెందిన నళినాక్షన్ కూడా నిద్రిస్తున్నారు. మూడో అంతస్తులో ఉన్న ఆయన జనం హాహాకారాలు విని, వెంటనే అప్రమత్తం అయ్యారు. భవనం సమీపంలోనే ఉన్న వాటర్ ట్యాంకుపైకి దూకారు. పక్కటెముకలు విరిగి, తీవ్రంగా గాయపడిన నళినాక్షన్ ట్యాంకుపైన చిక్కుకుపోయారు. కదల్లేని స్థితిలో ఆయన్ను ఉదయం 11 గంటల సమయంలో కొందరు గుర్తించి కిందికి దించి, ఆస్పత్రికి తరలించారని అతడి మామ బాలకృష్ణన్ చెప్పారు.

కుమార్తెకు బహుమతిగా ఫోన్ ఇవ్వాలని..

12వ తరగతి బోర్డు పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన తన కూతురికి ఫోన్ బహుమతిగా ఇవ్వాలనుకున్నారు లుకాస్. ఇంటికెళ్లాక కుమార్తెను స్వయంగా బెంగళూరు తీసుకెళ్లి నర్సింగ్ స్కూల్‌లో చేర్పిద్దామనుకున్నారు. అయితే, ఆ కల నెరవేరలేదు. కువైట్ ప్రమాదంలో అగ్నికి ఆహుతైన వారిలో కేరళలోని కొల్లంకు చెందిన లుకాస్ కూడా ఉన్నారు. బుధవారం వేకువజామున ప్రమాదం జరిగిన సమయంలో లూకాస్ తమ సొంతూళ్లోని చర్చి ఫాదర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. హఠాత్తుగా ఫోన్ డిస్ కనెక్టయ్యింది. తర్వాత చర్చి ఫాదర్ ఫోన్ చేసినా లూకాస్ లిఫ్ట్ చేయ్యలేదు. 18 ఏళ్లుగా కువైట్‌లో ఉంటున్న లూకాస్‌కు వృద్ధులైన తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

ఐస్‌క్రీమ్‌లో మనిషి బొటనవేలు

ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబైలోని మలాడ్ ప్రాంతంలో నివసించే 26 ఏళ్ల వైద్యుడు బ్రెండాన్ ఫెర్రావోకు వింత అనుభవం ఎదురైంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చి తెప్పించుకున్న కోన్ ఐస్‌క్రీమ్‌ను ఆస్వాదించబోతుండగా, ఒక్కసారిగా షాక్ తగిలినంత పనయ్యింది. చేదు అనుభవం మిగిలింది. హిమక్రీములో మనిషి బొటనవేలు కనిపించడంతో బ్రెండాన్ నివ్వెరపోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యుమో కంపెనీకి చెందిన బటర్ స్కాచ్ ఐస్‌క్రీమ్‌ను ఆన్‌లైన్‌లో ఒక ఈ–కామర్స్ యాప్ ద్వారా ఆర్డరిచ్చి తెప్పించానని బ్రెండాన్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బుధవారం మధ్యాహ్నం భోజనం తర్వాత ఐస్‌క్రీమ్ తినడానికి ప్రయత్నించగా అందులో గోరుతో కూడిన మనిషి బొటనవేలు కనిపించిందని తెలిపాడు.

ఉగ్రనిరోధక సామర్థ్యాలను పెంచండి

కశ్మీర్‌లో తాజా పరిస్థితిపై సమీక్షా సమావేశంలో ప్రధాని ఆదేశం

న్యూఢిల్లీ/జమ్మూ: ఉగ్రవాదం పీచమణిచేలా జమ్మూకశ్మీర్‌లో ఉగ్రనిరోధక సామర్థ్యాలను మరింతగా పెంచాలని పాలనా యంత్రాంగానికి ప్రధాని మోదీ సూచించారు. యాత్రికుల బస్సుపై ఉగ్రదాడి, చెక్‌పోస్ట్‌పై మెరుపుదాడి వంటి ఉదంతాలు మళ్లీ పెచ్చరిల్లిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో తాజా పరిస్థితిపై ప్రధాని మోదీ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మోదీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అదనపు భద్రతా బలగాల మొహరింపుతోపాటు ఉగ్రనిరోధక వ్యవస్థలను క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంచేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు మోదీ సూచించారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తాజా పరిస్థితిపై వివరాలను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను మోదీ అడిగి తెల్సుకున్నారు. స్థానిక యంత్రాంగంతో ఏ విధంగా వ్యూహాలను అమలుచేస్తున్నారో సిన్హా మోదీకి వివరించారు.

జీ7 సదస్సు కోసం ఇటలీకి మోదీ

ఇటలీలో నేటి నుంచి జరగబోయే జీ7 శిఖరాగ్ర సదస్సులో కృత్రిమ మేథ, ఇంధనం, ఆఫ్రికా, మధ్యధరా ప్రాంత సమస్యలపైనే దృష్టిసారించే అవకాశం ఉందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సదస్సులో పాల్గొనేందుకు మోదీ గురువారం ఇటలీకి బయల్దేరి వెళ్లారు. 'గ్లోబల్ సౌత్' దేశాల సమస్యలపైనా ప్రధానంగా చర్చ జరగొచ్చని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఇటలీలోని అపూలియో ప్రాంతంలోని విలాసవంత బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో జీ7 శిఖరాగ్ర సదస్సు నేటి నుంచి 15వ తేదీదాకా జరగనుంది.

క్లుప్తంగా...

776 మందికి హెచ్‌ఎంలుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వేగంగా సాగుతోంది. షెడ్యూల్‌లో భాగంగా మల్టీజోన్‌–2 పరిధిలో 776 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రధానోపాధ్యాయులు(హెచ్‌ఎం)గా పదోన్నతులు కల్పించారు. వారిని వివిధ స్కూళ్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. గతంలో మల్టీజోన్‌–1 పరిధిలో పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయగా...కోర్టు వివాదం కారణంగా మల్టీ జోన్‌–2 వాయిదా పడింది. కోర్టు వివాదం ముగియడంతో ఈ జోన్‌లో తాజాగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాల విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఓపెన్ స్కూల్ ఏప్రిల్ 25 నుంచి మే 2 వరకూ నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. టెన్త్‌లో 31,691 మంది పరీక్ష రాయగా వీరిలో 16,226 (51.20%) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 41,668 మంది పరీక్ష రాస్తే 21,967 (52.72%) పాసయ్యారు. మార్కుల మెమోలను 25 రోజుల్లో పంపుతామని, www.telanganaopenschool.org సైట్ ద్వారా పొందవచ్చని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ పీవీ శ్రీహరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27లోగా రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

రెసిడెన్షియల్ పాఠశాలలను కొనసాగించాలి

బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): రాష్ట్రంలో రెసిడెన్షియల్ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చే ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కృష్ణయ్య నేతృత్వంలో గురువారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నేతలు వేముల రామకృష్ణ, నందగోపాల్‌లతో కూడిన ప్రతినిధి బృందం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలపై చర్చించి వివిధ అంశాలపై మంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో కొత్తగా 100 గురుకుల పాఠశాలలు ప్రారంభించాలని కృష్ణయ్య మంత్రిని కోరారు. రాష్ట్రంలో బీసీ గురుకుల పాఠశాలలకు చాలా డిమాండ్ ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లుగా మారుస్తామని ప్రకటించిందని, దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజల్లో తీవ్ర అందోళన వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు.

అది ఫేక్ ఈ మెయిల్.. డబ్బులు పంపవద్దు

ఉద్యోగులకు, ప్రజలకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సూచన

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. తన పేరుపై ఈ–మెయిల్(sriburravenkatesham@gmail.com) క్రియేట్ చేసి డబ్బులు అడుగుతున్నారని, అలాంటి సందేశాలకు ప్రజలు, ఉద్యోగులు ఎవరూ స్పందించవద్దని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ మెయిల్ నుంచి ఎవరికైనా డబ్బులు అడుగుతూ సందేశాలు వస్తే... ఆ మెయిల్‌ను బ్లాక్ చేసి వెంటనే పోలీసులను సంప్రదించాలని చెప్పారు.

వరుసగా మూడో ఏడాది టాప్ ర్యాంక్‌లో ‘అమృత’

సాక్షి,హైదరాబాద్: ప్రతిష్టాత్మకమైన అమృత విశ్వ విద్యాపీఠం యూనివర్సిటీ దేశంలోని టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ జాబితాలో వరుసగా మూడో ఏడాది కూడా నంబర్ వన్ స్థానాన్ని సాధించింది. ప్రపంచంలోని టాప్ 100 విద్యా సంస్థల టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ జాబితాలో అమృత విశ్వ విద్యాపీఠం యూనివర్సిటీ వరుసగా నాలుగో ఏడాది కూడా చోటు దక్కించుకుంది. ఈ మేరకు ఆ యూనివర్సిటీ యాజమాన్యం గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

ఒలింపియాడ్స్‌కు 45 మంది నారాయణ విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఓరియంటేషన్ కమ్ సెలక్షన్ క్యాంప్ (ఓసీఎస్‌సీ), ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్ (ఐఎంఓటీసీ)కి భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు నారాయణ విద్యాసంస్థల నుంచి ఏకంగా 45 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒలింపియాడ్‌లో మ్యాథ్స్‌కు 12 మంది, కెమిస్ట్రీకి ఇద్దరు, ఫిజిక్స్‌కు ఆరుగురు, జూనియర్‌సైన్స్ ఒలింపియాడ్‌కు ఐదుగురు, జూనియర్ ఆస్ట్రానమీకి తొమ్మిదిమంది, బయాలజీకి ఒకరు ఎంపికయ్యారు. అలాగే ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ ఒలింపియాడ్ ఎనిమిది మంది, ఏషియన్ ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు ఇద్దరు అర్హత సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, శరణి గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

పచారీ కొట్లకు 10 మినిట్స్ సవాల్



పాలు, పండ్లు మొదలు గులాబీల దాకా నిమిషాల్లో కస్టమర్ల వద్దకు చేరుస్తున్న డెలివరీ యాప్ సంస్థలు

అమెరికాలో కంటే కూడా భారత్‌లోనే ఎక్కువ వేగంగా సరుకుల చేరవేత

సంప్రదాయ కిరాణా దుకాణాలు, వీధి చివరలోని షాపులకు తప్పని పోటీ

సాక్షి, హైదరాబాద్: అగ్రరాజ్యం అమెరికా కంటే కూడా భారత్‌లో వివిధ డెలివరీ యాప్‌లు వేగంగా కస్టమర్లను చేరుకుని సంచలనం సృష్టిస్తున్నాయి. యూఎస్‌లోని డెలివరీ దిగ్గజ కంపెనీలు యాప్‌లపై ఆర్డర్ అందుకున్నాక లొకేషన్ ఆధారంగా అదే రోజు లేదా మరుసటి రోజు డెలివరీ చేస్తున్నట్టు వెల్లడైంది. అందుకు భిన్నంగా మన దేశంలో ‘క్విక్ సర్వీస్’అనేది నాణ్యమైన సేవకు గీటురాయిగా మారింది. స్విగ్గీ, జెప్టో, బ్లింకిట్ వంటి యాప్‌లు...చిన్న చిన్న నిత్యావసరాలను సైతం అత్యంత వేగంగా వినియోగదారుల ఇళ్లకు చేరుస్తున్నాయి. గతంలో మనదేశంలో... ఫోన్ ద్వారా ఆర్డర్లు తీసుకున్నాక అక్కడక్కడా ఏర్పాటు చేసుకున్న ఔట్‌లెట్ల నుంచి నిత్యావసర వస్తువులు తీసుకుని కస్టమర్లకు చేర్చేవారు. ఐతే గత దశాబ్దకాలంలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి వాటి ద్వారా ఈ–కామర్స్ ఒక్కసారిగా పుంజుకోవడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. దీంతో భారత్‌లో వేగంగా నిత్యావసర సరుకులు అందించే డెలివరీ సంస్థలు ఆన్‌లైన్ షాపింగ్‌పై అధిక నమ్మకాలు పెట్టుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా స్టార్టప్‌సంస్థలు ఉనికిలో నిలిచేందుకు కష్టపడుతుంటే, అదేకోవలోని భారత్ మార్కెట్ మాత్రం అంతకంతకు వృద్ధి చెందుతున్నట్టుగా నిపుణులు అంచనా వేస్తున్నారు. కోవిడ్‌–19 లాక్‌డౌన్‌తో... ప్రపంచవ్యాప్తంగా ఫాస్ట్ డెలివరీ స్టార్టప్‌లు పెరగగా..ఆ తర్వాత కొన్నిదేశాల్లో షాపులకు వెళ్లి వస్తువులు కొనుక్కునేందుకు మొగ్గుచూపడంతో అవి వెనకడుగు వేయక తప్పలేదు. భారత్‌లో మాత్రం దీనికి పూర్తి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో ఈ స్టార్టప్‌లు మరింత వృద్ధి చెందడంతో పాటు సేవలో వేగం, నాణ్యతను పెంచడంపై దృష్టి పెట్టడం గమనార్హం.

వేగం, కచ్చితత్వం

గత ఏప్రిల్‌లో భారత్‌లోని ఆన్‌లైన్ సరుకుల మార్కెట్, క్విక్ డెలివరీని గోల్డ్‌మాన్ సాక్స్ విశ్లేషించినపుడు... ప్రస్తుతం భారత్ ఆన్‌లైన్ సరుకుల మార్కెట్ 11 బిలియన్ డాలర్లుగా నిలుస్తుండగా వాటిలో క్విక్ డెలివరీ మార్కెట్ 5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టుగా తేలింది. ఆన్‌లైన్ కస్టమర్ల ప్రాధాన్యతలకు తగ్గట్టుగా సరుకులను చేరవేయడంలో వేగం, కచ్చితత్వం పెరుగుదలతో 2030 కల్లా 60 బిలియన్ డాలర్లుగా చేరుకుని ఆన్‌లైన్ గ్రాసరీ మార్కెట్‌లో క్విక్ కామర్స్ 70 శాతంగా నిలుస్తుందని ఈ సంస్థ అంచనా వేస్తోంది. దేశవ్యాప్తంగా 1.30 కోట్ల నిత్యావసర వస్తువులను విక్రయించే దుకాణాలు, షాపులు ఉండగా, వీటికి సంబంధించిన రిటైల్ అసోసియేషన్ల అంచనాల ప్రకారం... క్విక్ కామర్స్‌యాప్‌ల ద్వారా అమ్మకాలు తగ్గదల పుంజుకోవడంతో... వివిధ ప్రధాన నగరాలు, పట్టణాల వారీగా చూస్తే సంప్రదాయ దుకాణాల్లో పది నుంచి 60 శాతం దాకా అమ్మకాలు నమోదైనట్టుగా తెలుస్తోంది.

పచారీ కొట్లకు తప్పని పోటీ

ఇప్పుడు డెలివరీ యాప్‌లు వేగం పుంజుకోవడంతో...పది నిమిషాల్లోనే కస్టమర్లు ఆర్డర్ చేసిన వస్తువులు చేరవేయడం అనే దాన్ని ఈ సంస్థలు ఒక అలవాటుగా మార్చుకుంటున్నాయి. వినియోగదారులు ఆర్డర్ చేశాక పదినిమిషాల వ్యవధిలోనే నిత్యావసరాలను డెలివరీ ఏజెంట్లు అందజేయడాన్ని కూడా సెకన్ల వారీగా ట్రాక్ చేస్తుండటం విశేషం. ఆన్‌లైన్‌లో ఆర్డర్లను అందించే క్రమంలో ఏ కారణంచేతనైనా ఏజెంట్లు నెమ్మదిస్తే వారి ఫోన్లలో ‘ఎరుపు ఫ్లాష్’ ద్వారా హెచ్చరికలు కూడా జారీ అవుతున్నాయి. దేశంలోని వివిధ డెలివరీ యాప్‌ల ద్వారా పాలు, పండ్లు మొదలు గులాబీల దాకా నిమిషాల వ్యవధిలోనే కస్టమర్ల వద్దకు చేరేలా సర్వీసులు అందిస్తున్నారు. నగరాలు, పట్టణాల్లో పలు రకాల నిత్యావసరాలకు ఆర్డర్ అందగానే పది నిమిషాల్లో ఇళ్లకు చేర్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడికక్కడ సరుకులను నిమిషాల్లో డెలివరీ చేసే యాప్‌లు పచారీ కొట్లకు సవాల్‌గా మారాయి. సంప్రదాయ కిరాణా దుకాణాలు, వీధి చివర్లలోని షాపులకు గట్టి పోటీ తప్పడం లేదు. మనదేశంలోని వివిధ వర్గాల ప్రజలు... తమ ఇళ్లకు దగ్గరలోని షాపుల నుంచి బియ్యం, పప్పులు, ఇతర వస్తువులను తెచ్చుకోవడమో లేదా ఫోన్‌లో ఆర్డర్ చేసే ఆ దుకాణాల్లో పనిచేసే వారు ఇళ్లకు చేరవేయడమో చేస్తూ వచ్చారు. ఇప్పుడు డెలివరీ యాప్‌ల యుగంలో...రోజువారీ అవసరాలకు ఉపయోగపడే చిన్న చిన్న వస్తువులను సైతం ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి నిమిషాల్లోని ఇంటి గుమ్మం వద్దకు తెప్పించుకుంటున్నారు. స్విగ్గీలో ఐతే ఒకే ఒక మామిడిపండును ఆర్డర్ చేసినా దానిని కూడా కస్టమర్‌కు డెలివరీ చేస్తోంది.

‘నీట్’ ర్యాంకులు తారుమారు

1,563 మందికి మళ్లీ పరీక్ష వల్ల విద్యార్థులందరి ర్యాంకుల్లో తేడా

- ఆందోళన చెందుతున్న ర్యాంకర్లు
- ఇప్పటికే రావాల్సిన రాష్ట్రస్థాయి ర్యాంకులు మరింత ఆలస్యం
- కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ‘నీట్’పరీక్షలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో కొందరికి మళ్లీ ఆ పరీక్ష నిర్వహించడం వల్ల ఇప్పటికే ఇచ్చిన ర్యాంకులు తారుమారు అవుతాయని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎంబీబీఎస్, బీడీఎస్ సహా ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)–యూజీ 2024లో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. నీట్ ఫలితాల్లో 1,563 మంది అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను తొలగిస్తామని, వారికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తామని జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) గురువారం సుప్రీంకోర్టుకు చెప్పింది. వారి కోసం ప్రత్యేకంగా ఈ నెల 23న మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించి, ఈ నెలాఖరుకు వారి ఫలితాలు ప్రకటిస్తారు. అయితే ఇప్పటికే ఇచ్చిన ర్యాంకులు, మళ్లీ నీట్ తర్వాత పొందిన 1,563 మంది ర్యాంకులను కలుపుతారు. దీనివల్ల దేశవ్యాప్తంగా అందరి ర్యాంకుల్లో తేడా వస్తుంది. దీంతో ఇప్పటికే ర్యాంకులు పొందినవారివి కూడా తప్పకుండా మారతాయని అంటున్నారు. దీంతో మంచి ర్యాంకులు పొందిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఒక్క మార్కు తేడాతో వందల ర్యాంకులు మారతాయి. అంతేకాదు పాయింట్ల తేడాతో పర్సంటైల్ మారినా ర్యాంకులు గణనీయంగా మారతాయి. కాబట్టి రెండోసారి నీట్ పరీక్ష అనంతరం ఇచ్చే ర్యాంకులు తమ కొంప ముంచుతాయన్న ఆందోళన ఇప్పటికే మంచి ర్యాంకర్లను వేధిస్తోంది. దీనివల్ల తమకు తప్పకుండా ఇష్టమైన కాలేజీలో సీటు వస్తుందనుకున్న అంచనాలు తారుమారు అవుతాయన్న ఆందోళన పట్టిపీడిస్తోంది.



రాష్ట్రస్థాయి ర్యాంకులు మరింత ఆలస్యం

గత నెల 5న జరిగిన నీట్ పరీక్షకు 23.33 లక్షల మంది హాజరుకాగా, 13.16 లక్షల మంది అర్హత సాధించారు. తెలంగాణ నుంచి ఈసారి 77,849 మంది హాజరు కాగా, 47,371 మంది అర్హత సాధించారు. ఈ నెల 4న ఫలితాలను ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ రావడంతో పరీక్ష నిర్వహణపై అనుమానాలు తలెత్తాయి. ఇంత మంది టాప్ ర్యాంకును పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గ్రేస్ మార్కులు పొందిన ఆ 1,563 మంది విద్యార్థుల స్కోర్ కార్డులను రద్దు చేయాలని నిర్ణయించారు. వారికి ఈ నెల 23న మళ్లీ పరీక్ష నిర్వహించి, ఈ నెల 30లోగా వారి ఫలితాలను ప్రకటిస్తారు. వాస్తవంగా ఫలితాలు ప్రకటించిన వారం పది రోజుల్లోగా రాష్ట్ర స్థాయి ర్యాంకులను ఎన్‌టీఏ విడుదల చేస్తుంది. ఆ ప్రకారం ఇప్పటికే రాష్ట్రస్థాయి ర్యాంకులు రావాల్సి ఉంది. ముందుగా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం ఆలిండియా ర్యాంక్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. అభ్యర్థులు తమ రాష్ట్రానికి దరఖాస్తు చేసినప్పుడు, వారిని రాష్ట్ర కేటగిరీ జాబితా ప్రకారం విభజిస్తారు. రాష్ట్ర కౌన్సెలింగ్ అధికారులు తదనుగుణంగా మెరిట్ జాబితాను తయారు చేస్తారు. దాంతో తెలంగాణలో ఎంతమందికి రాష్ట్రస్థాయి ర్యాంకులు వస్తాయనేది తెలుస్తుంది. కానీ 23న మళ్లీ నీట్ పరీక్ష నిర్వహిస్తుండటం వల్ల రాష్ట్రస్థాయి ర్యాంకుల వెల్లడి మరింత ఆలస్యం కానుంది. ఆ ఫలితాలు ప్రకటించిన తర్వాత వచ్చే నెల రాష్ట్రస్థాయి ర్యాంకులు వస్తాయని కాళోజీ వర్సిటీ వర్గాలు తెలిపాయి. కాగా, మెడికల్ యూజీ వెబ్ కౌన్సెలింగ్‌పై స్టే ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కౌన్సెలింగ్ యథాతథంగా ఉంటుందని చెప్పిన ధర్మాసనం... ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగా సమాధానం చెప్పాలని ఎన్‌టీఏకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. జూలై 6 నుంచి నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. అయితే ఈలోపు ఏం జరుగుతుందనేది వేచిచూడాలి.

ఈసారి తెలంగాణకు టాప్‌-100లో ఒకటే ర్యాంకు

నీట్ ఎస్టీ కేటగిరీలో ఆలిండియా టాప్ ర్యాంకర్‌గా తెలంగాణకు చెందిన గుగులోత్ వెంకట నృపేష్ నిలిచాడు. రెండో ర్యాంకర్‌గా లావుడ్య శ్రీరామ్ నాయక్ ప్రతిభ చాటాడు. నృపేష్‌కు 720 మార్కులకుగాను, 715 వచ్చాయి. జాతీయస్థాయిలో అతను జనరల్ కేటగిరీలో 167వ ర్యాంకు సాధించాడు. అలాగే తెలంగాణ రాష్ట్రస్థాయి టాపర్‌గా అనురాన్ ఘోష్ ప్రతిభ చాటాడు. అతను జాతీయస్థాయిలో జనరల్ కేటగిరీలో 77వ ర్యాంకు సాధించాడు. గతంలో తెలంగాణకు టాప్ ర్యాంకులు వచ్చేవి. కానీ ఈసారి జాతీయస్థాయిలో జరిగిన అక్రమాల వల్ల తెలంగాణకు రాలేదని కార్పొరేట్ సంస్థల విద్యా నిపుణులు ఆరోపిస్తున్నారు.

15 వేల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లిష్ మీడియం

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగు: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న తరహాలోనే తెలంగాణలో కూడా ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 15 వేల అంగన్‌వాడీ సెంటర్లను మినీ ఇంగ్లిష్ మీడియం స్కూళ్లుగా అప్‌డేట్ చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గురువారం మంత్రి ములుగు జిల్లా బండారుపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం తరపున యూనిఫాం, నోట్ పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఎంపీ బలరాంనాయక్ మోడల్ స్కూళ్లను మంజూరు చేయించారని గుర్తు చేశారు. తర్వాత ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొందరి పనితీరుపై మాట్లాడుతూ, ఇష్టం ఉంటే గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల ప్రజల అభివృద్ధికి పనిచేయాలని, లేనిపక్షంలో ట్రాన్స్‌ఫర్ చేసుకొని వెళ్లిపోవచ్చని హెచ్చరించారు. ఇదే క్రమంలో అర్హత పేరుతో ఆశ కార్యకర్తలకు పరీక్ష నిర్వహించే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు కలెక్టరేట్ పక్కన బైఠాయించారు. క్షేత్రస్థాయిలో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్న తమకు ఫిక్స్‌డ్ వేతనంగా రూ.18 వేలు అందించాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య కొంత మంది ఆశ కార్యకర్తలను మంత్రి వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మంత్రికి వినతిపత్రం అందించారు. కాగా, ఆశ కార్యకర్తల డిమాండ్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, ఆగస్టు వరకు సమస్య పరిష్కరిస్తామని మంత్రి సీతక్క హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

16న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

- ప్రతి పరీక్ష కేంద్రం వద్ద జామర్ ఏర్పాటు
- 45,153 మంది అభ్యర్థులు.. 99 పరీక్ష కేంద్రాలు
- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, హైదరాబాద్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష సాఫీగా, ప్రశాంతంగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని వనిత మహావిద్యాలయలో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ నెల 16న నిర్వహించనున్న ఈ పరీక్షకు హైదరాబాద్‌లో 99 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 45,153 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. గుర్తింపుకార్డు లేని వారిని పరీక్ష కేంద్రంలోకి (నోఐడీ నోఎంట్రీ) అనుమతించకూడదని, అనుమతి లేని వ్యక్తులు పరీక్ష కేంద్రాల్లో లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద జామర్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి యూపీఎస్సీ పరీక్ష నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్, యూపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీలు శైలేష్‌గౌతమ్, అశోక్‌జోషి, ఆర్డీఓలు మహిపాల్, దశరథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

20 లక్షల పుస్తకాలు వెనక్కి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ స్కూళ్లలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలను వెనక్కు తీసుకోవాలని ఉన్నతాధికారులు అన్ని జిల్లాల డీఈవోలను ఆదేశించారు. గతేడాది పంపిణీ చేయగా మిగిలిపోయిన 20 లక్షల పుస్తకాలను ప్రభుత్వ స్కూళ్లకు పంపారు. వీటిలో ముందుమాటలో అప్పటి ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల పేర్లతో ముద్రించారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇది వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో 20 లక్షల పుస్తకాలను తిరిగి జిల్లా కేంద్రాలకు రప్పించాలని నిర్ణయించారు. ముందుమాట పేజీకి స్టిక్కర్ అంటించి తిరిగి పంపిణీ చేసే వీలుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.



పాఠ్యపుస్తకాల్లోని ముందుమాట పేజీ

పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరు ఉంటే తప్పేంటి?: సబితాఇంద్రారెడ్డి



సాక్షి, హైదరాబాద్: పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరు ఉంటే తప్పేంటని విద్యాశాఖ మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ ఫొటో, ఆయన ఆనవాళ్లు తొలగించాలనే ఆలోచనలను పక్కన పెట్టి పాలనపై దృష్టి పెట్టాలని ఒక ప్రకటనలో హితవు పలికారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికే పాఠ్య పుస్తకాలు అందించాలని తమ ప్రభుత్వం ప్రయత్నించిందని, అందులో భాగంగానే పాఠ్యపుస్తకాల్లో ముఖ్యమంత్రి, ప్రభుత్వ గుర్తులు ఉన్నాయని తెలిపారు. తమిళనాడులో స్టాలిన్ సీఎం కాగానే జయలలిత ఫొటోతో ఉన్న బుక్స్, బ్యాగ్ విద్యార్థులకు ఇచ్చి తమ హుందాతనాన్ని చాటుకున్న విషయం తెలుసుకోవాలన్నారు. కేసీఆర్ పేరు ఉందని, బుక్స్ వెనక్కి తెప్పించడం, పేజీలు చింపివేయడం, ఆ పేజీలపై మరో పేజీ అతికించడం సమంజసమా అని ప్రశ్నించారు. ఈ చర్య వల్ల ప్రజాధనం వృథా అవుతుందని, చింపివేసిన పేజీల వెనుక వందేమాతరం, జనగణమన గేయాలు, ప్రతిజ్ఞ ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.


డీఎస్సీ అర్హత మార్కులు తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ–2024)లో స్వల్ప మార్పులు చేశారు. డీఎస్సీ రాయబోయే వారికి గ్రాడ్యుయేట్ అర్హత మార్కులను తగ్గించారు. స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, పీఈటీలకు ఇది వర్తించనుంది. గతంలో ఇచ్చిన నిబంధనల ప్రకారం డిగ్రీలో జనరల్ అభ్యర్థులు 50% మార్కులు, రిజర్వేషన్ కేటగిరీలు 45% మార్కులు పొందాల్సి ఉంది. సవరించిన నిబంధనల ప్రకారం జనరల్ కేటగిరీ అభ్యర్థులు 45%, రిజర్వేషన్ కేటగిరీలు 40% డిగ్రీలో మార్కులు పొంది ఉంటే సరిపోతుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎ.దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా టెట్ అర్హత పొందిన వారు, టెట్‌లో మార్కులు మెరుగు పరుచుకున్న అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

లాసెట్‌లో 72.66 శాతం ఉత్తీర్ణత

- మూడేళ్ల లా కోర్సుల్లో 73.27 శాతం
- ఐదేళ్ల లా కోర్సుల్లో 65.12 శాతం
- పీజీఎల్‌సెట్‌లో 84.65 శాతం ఉత్తీర్ణత
- ఫలితాలు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి

సాక్షి, హైదరాబాద్: న్యాయవాద విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (లాసెట్)లో ఈ ఏడాది 72.66 శాతం మంది అర్హత సాధించారు. మూడేళ్ల కాలపరిమితి ఉన్న లా కోర్సుల్లో 73.27 శాతం, ఐదేళ్ల లా కోర్సుల్లో 65.12 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పోస్టు–గ్రాడ్యుయేషన్ లాసెట్ (పీజీఎల్‌సెట్)లో 84.65 శాతం మంది అర్హత సాధించారు. లాసెట్ ఫలితాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లాసెట్ కన్వీనర్ బి.విజయలక్ష్మి మాట్లాడుతూ, మూడేళ్ల లా కోర్సుకు 27,993 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా, 25,510 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఐదేళ్ల కోర్సుకు 8,412 మంది హాజరుకాగా, 5,478 మంది ఉత్తీర్ణులయ్యారని, పీజీఎల్‌సెట్‌కు 3,863 మంది హాజరుకాగా, 3,270 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. లాసెట్, పీజీఎల్‌సెట్‌కు ఈసారి మొత్తం 50,684 మంది దరఖాస్తు చేసుకోగా, 40,268 మంది హాజరయ్యారని చెప్పారు. వారిలో 29,258 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఈసారి లాసెట్‌కు ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు హాజరైన నలుగురు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ జి.బి.రెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు వి.వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



లాసెట్ ఫలితాలు విడుదల చేస్తున్న ఆర్. లింబాద్రి, ఇతర అధికారులు

టాపర్లు వీరే..

మూడేళ్ల లా కోర్సుల్లో హైదరాబాద్‌కు చెందిన పీజీఎం అంబేడ్కర్ 97.49 మొదటి ర్యాంకు, గచ్చిబౌలికి చెందిన ప్రత్యూష్ సరస 96.65 రెండో ర్యాంకు, ఖమ్మం జిల్లా సింగరేణికి చెందిన తల్లూరి నరేష్ 95.74 మార్కులతో మూడు ర్యాంకు సాధించారు. అలాగే ఐదేళ్ల లా కోర్సులో మియాపూర్‌కు చెందిన శ్రీరాం బొడ్డు 87 మార్కులతో మొదటి ర్యాంకు సాధించగా, కామారెడ్డికి చెందిన పిప్పిరిశెట్టి దినేష్ 87 మార్కులతో రెండో ర్యాంకు, మల్కాజిగిరికి చెందిన ఆర్బీ విజయనందిని 84 మార్కులతో మూడు ర్యాంకు పొందారు. పీజీఎల్‌సెట్‌లో సికింద్రాబాద్‌కు చెందిన పెరి బాలసాయి విష్ణువర్ధన్ 76 మార్కులతో మొదటి ర్యాంకు సాధించగా, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాకు చెందిన అభినీతి జాసన్ 70 మార్కులతో రెండో ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన నిమన్ సిన్హా 67 మార్కులతో మూడో ర్యాంక్ సాధించారు.

రాష్ట్రంలో కొత్తగా మహిళా శక్తి క్యాంటీన్‌లు

- రెండేళ్లలో 150 క్యాంటీన్ల ఏర్పాటును లక్ష్యంగా నిర్దేశించుకున్నాం
- మహిళా సంఘాలతో నిర్వహణకు చర్యలు: సీఎస్ శాంతికుమారి
- అన్ని ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లు, పర్యాటక కేంద్రాలు, పారిశ్రామిక వాడల్లో ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా మహిళా శక్తి క్యాంటీన్ సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం సచివాలయంలో మహిళా శక్తి క్యాంటీన్ సర్వీసుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్లు, పర్యాటక ప్రాంతాలు, ప్రధాన దేవాలయాలు, బస్ స్టాండ్‌లు, పారిశ్రామిక ప్రాంతాల్లో మహిళా సంఘాలతో ప్రత్యేకంగా క్యాంటీన్‌లను నిర్వహించనున్నట్లు వివరించారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లు, దీదీకా రసోయ్‌ల పనితీరుపై అధ్యయనం చేసినట్లు తెలిపారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా కనీసం 150 క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ క్యాంటీన్‌ల నిర్వహణను గ్రామైక్య సంఘాలకు అప్పగించనున్నట్లు తెలిపారు. క్యాంటీన్ నిర్వహణపై ఈ సంఘాలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంటీన్‌ల పనితీరు, నిర్వహణ, వీటి ఏర్పాటుకు ఎంత విస్తీర్ణంలో స్థలం అవసరం.. వంటి అంశాలపై సవివరంగా ప్రణాళికను రూపొందించాల్సింగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్‌ను శాంతికుమారి ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, ఆరోగ్య శాఖ కమిషనర్ కర్ణన్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, టూరిజం శాఖ డైరెక్టర్ నిఖిల, టూరిజం కార్పొరేషన్ ఎండీ రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బండి ఉన్నా.. లేకున్నా బాదుడే

చోరీకి గురైన వాహనం ఏళ్లుగా దొరక్కపోయినా.. ఆ బండి ఉన్నట్టే లెక్కట

- ఇప్పుడు కొత్త వాహనం కొంటే అది రెండో బండిగా గుర్తింపు
- తాజా కొనుగోలుపై 2 శాతం అదనపు భారం
- కాలం చెల్లిన వాహనాలకూ కప్పం
- నిబంధనల పేరిట ఆర్టీఏ నిర్వాకం
- అడ్డగోలు వసూళ్లతో వాహన కొనుగోలుదార్లపై రూ.వేలల్లో భారం

సాక్షి, హైదరాబాద్: ''కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ పాత బైక్ ఏడేళ్ల క్రితం అపహరణకు గురైంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే మిస్సింగ్ కేసు పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాహనం లభించలేదు. దీంతో పోలీసులు 'నాట్ ట్రేస్‌డ్' అని ధ్రువీకరించారు. ఈ క్రమంలో ఇటీవల ఓ కొత్త కారు కొనుగోలు చేయాలని భావించాడు. అయితే రవాణా శాఖ రికార్డుల్లో అతని పేరిట ద్విచక్ర వాహనం నమోదై ఉన్నందువల్ల మరో వాహనం కొనుగోలు చేయాలంటే 2 శాతం జీవితకాల పన్ను అదనంగా చెల్లించాలని చెప్పారు. అంటే అసలు ఉందో లేదో తెలియని అపహరణకు గురైన వాహనం కోసం శ్రీనివాస్ ఏకంగా రూ.15,000 వరకు ఆర్టీఏకు సమర్పించుకోవలసి వస్తోంది. 'నాట్ ట్రేస్‌డ్' అంటూ పోలీసులు ఇచ్చిన ధ్రువీకరణను సైతం ఆర్టీఏ అధికారులు పరిగణనలోకి తీసుకోకుండా మోటారు వాహన చట్టాలను ఏకరువు పెట్టడంతో అతడు విస్మయానికి గురయ్యాడు.''ఇది కేవలం శ్రీనివాస్ ఒక్కడే ఎదుర్కొంటున్న సమస్య కాదు. గ్రేటర్ హైదరాబాద్‌లో లక్షలాది మంది వాహనదారులపైన రవాణాశాఖ ఇలా అడ్డగోలుగా అదనపు బాదుడుకు పాల్పడుతోంది. వాహనాల ఖరీదు మేరకు ద్విచక్ర వాహనాలపైన 10 శాతం, కార్లపైన 18 శాతం సాధారణంగా జీవితకాలపన్ను విధిస్తారు. కానీ అప్పటికే ఒక వాహనం నమోదై ఉంటే 2 శాతం అదనపు పన్ను చొప్పున బైక్‌లపైన 12 శాతం, కార్లపైన 20 శాతం వరకు చెల్లించాల్సి వస్తోంది.

కాలం చెల్లినా కప్పం కట్టాల్సిందేనా...

గ్రేటర్ హైదరాబాద్‌లో రవాణాశాఖ లెక్కల ప్రకారం ప్రస్తుతం సుమారు 85 లక్షల వాహనాలు ఉన్నాయి. ఏటా కనీసం 2 లక్షలకు పైగా కొత్త వాహనాలు నమోదవుతున్నాయి. కాలం చెల్లిన వాహనాల స్థానంలో చాలా మంది కొత్తవాటిని కొనుగోలు చేస్తున్నారు. 15 ఏళ్ల నుంచి 20 ఏళ్లకు పైగా వినియోగించిన వాహనాలను పక్కన పెట్టేసి కొత్తవి కొనుగోలు చేసేందుకు వాహనదారులు ముందుకొస్తుండగా రవాణాశాఖ మాత్రం కాలం చెల్లిన, డొక్కు, తుక్కు బండ్లను సైతం పరిగణనలోకి తీసుకొని కొత్తవాటిపైన జీవితకాల పన్నును 2 శాతం అదనంగా విధించడం గమనార్హం. కాలం చెల్లిన వాహనాలపైన రవాణాశాఖ ఇప్పటివరకు ఒక నిర్దిష్టమైన, శాస్త్రీయమైన విధానాన్ని అమలు చేయకపోవడంతో లక్షలాది మంది వాహనదారులు దారుణంగా నష్టపోతున్నారు. ఆర్టీఏ అధికారుల అంచనాల మేరకే ఇలాంటి కాలం చెల్లిన వాహనాలు సుమారు 15 లక్షలకు పైగా ఉన్నాయి. ''చాలాకాలంగా వినియోగిస్తున్న బండి ఇక పనికి రాదని మూలనపడేసి కొత్తబండి కొనుగోలు చేస్తున్నప్పుడు పనికి రాని వాహనంపైన పన్ను విధించడం విడ్డూరంగా ఉంది.'' అని కుషాయిగూడ ప్రాంతానికి చెందిన రాఘవ అభిప్రాయపడ్డారు. 'రెండు వాహనాలను వినియోగించినప్పుడు మాత్రమే రెండో వాహనంపైన అదనపు పన్ను విధించాలి.కానీ మూలనపడేసిన వాటిపైన బాదేస్తున్నారు.'అని అసహనం వ్యక్తం చేశారు.



'లేనివి'ఎలా ఉన్నట్లు?

మరోవైపు చోరీకి గురైన వాహనాలను సైతం రవాణా అధికారులు వదిలిపెట్టకుండా అదనపు బాదుడుకు పాల్పడడం విమర్శల పాలవుతోంది. ఏడేళ్ల క్రితం వాహనం అపహరణకు గురైనట్లుగా పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ తమ రికార్డుల్లో వాహనం సదరు యజమాని పేరిట ఉన్నందువల్ల పన్ను చెల్లించవలసిందేనని ఆర్టీఏ అధికారులు తెగేసి చెబుతున్నారు. 'వాహనాలు అపహరణకు గురైనట్లు ప్రతి రోజూ అనేక మంది ఎఫ్ఐఆర్ కాపీలతో వస్తారు. కానీ ఆ ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకొని పన్ను మినహాయింపునిచ్చే అవకాశం మోటారు వాహన చట్టాల్లో లేదు.'అని రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. 'లేని వాహనంఉన్నట్లుగా పరిగణించి అదనంగా వసూలు చేయడం అన్యాయమే కానీ మోటారు వాహన చట్టాన్ని పక్కనపెట్టలేం కదా'అని మరో అధికారి అభిప్రాయపడ్డారు.

అమలుకు నోచని తుక్కు పాలసీ

కేంద్రం అమల్లోకి తెచ్చిన రోడ్డు భద్రతా చట్టం ప్రకారం కాలం చెల్లిన వాహనాలన్నింటినీ తుక్కుగా మార్చాలి. వాహనదారులు తమ వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుగా మార్చేందుకు ముందుకు వస్తే కొత్తగా కొనుగోలు చేసే వాటిపైన పన్ను రాయితీ కూడా ఇవ్వాలి. వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఇది తప్పనిసరి. ముంబై, న్యూఢిల్లీ వంటి కొన్ని మెట్రోపాలిటన్ నగరాల్లో ఈ చట్టం అమలవుతుండగా హైదరాబాద్‌లో మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోంది. కాలం చెల్లిన వాహనాలను తుక్కుగా మార్చేందుకు ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేయాలని చట్టంలో స్పష్టం చేశారు. ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాలం చెల్లిన వాహనాలతో పాటు, అపహరణకు గురైన వాటిపైన కూడా ఒక నిర్దిష్టమైన విధానం ఉండాలని సూచించినా ఆచరణకు నోచకపోవడం గమనార్హం.

క్లుప్తంగా...

సీఎం రేవంత్‌తో జపాన్ రాయబారి భేటీ



జపాన్ రాయబారి సుజుకి హిరోషికి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి


సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జపాన్ రాయబారి సుజుకి హిరోషి గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య వ్యాపార, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం, తెలంగాణలో కొత్త పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు.

అయోధ్య విమాన సర్వీసులు నిలిపివేత

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి అయోధ్యకు నేరుగా నడిపిన సర్వీసులను స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ సంస్థ నిలిపివేసింది. మూడునెలల క్రితం ప్రారంభించిన ఈ సర్వీసులు వారంలో మూడు రోజుల పాటు ఉండేవి. ప్రయాణికుల సంఖ్య అంతగా లేని కారణంగా ఈ నెల 1 నుంచి అయోధ్యకు నేరుగా నడిపించే సర్వీసులు పూర్తిగా నిలిపివేసినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు గురువారం ఓ ప్రకటనలో తెలిపాయి. అయితే కొన్ని ఎయిర్‌లైన్స్ సంస్థలు ఆయా ఎయిర్‌పోర్టుల మీదుగా వయా సర్వీసులను మాత్రం కొనసాగిస్తున్నాయి.

ఆ నియామకంపై ప్రభుత్వ వైఖరేమిటో చెప్పండి

వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడి నియామకంపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడి నియామకంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరేంటో చెప్పాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. కమిషన్ అధ్యక్షుడి నియామకం చేపట్టకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందంటూ న్యాయవాది ఆకాశ్ బాగ్లేకర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. ఆకాశ్ వాదనలు వినిపిస్తూ...కమిషన్ అధ్యక్షుడి నియామకానికి పరీక్ష అవసరం లేదని, ఆ నియామకం కోసం ఏర్పాటు చేసిన కమిటీ నిర్ణయం తీసుకుంటే సరిపోతుందని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. దీనిపై ధర్మాసనం ప్రభుత్వ న్యాయవాది వివరణ అడగ్గా...రెండు వారాలు సమయం కావాలని కోరారు. దీంతో ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

న్యాయాధికారుల నియామకాలు చేపట్టండి

ముఖ్యమంత్రికి టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ వినతి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కోర్టుల్లో న్యాయాధికారుల నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఇంకా గత ప్రభుత్వం హయాంలో నియమించిన వారే కొనసాగుతున్నారని ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ప్రభుత్వం నియమించిన పోస్టుల్లో ఉంటూ సర్కార్‌కు వ్యతిరేకంగా, చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టుల్లో ఉత్తర్వులు వస్తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి స్పందించి వెంటనే కొత్తగా న్యాయధికారుల నియామకాలు చేపట్టాలని, కాంగ్రెస్ లీగల్ సెల్‌లో క్రియాశీలకంగా పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కొలువుదీరిన కేంద్ర మంత్రులు

బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామ్మోహన్, పెమ్మసాని | ఖనిజాలు వెలికితీసి ఉపాధి పెంచేందుకు కృషి: కిషన్‌రెడ్డి



గురువారం ఢిల్లీలోని శాస్త్రిభవన్‌లో కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్‌ను అభినందిస్తున్న కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్న తెలంగాణ, ఏపీకి చెందిన నలుగురు కేంద్ర మంత్రులు కొలువుదీరారు. గురువారం ఢిల్లీలోని శాస్త్రి భవన్‌లోని తన ఛాంబర్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా జి.కిషన్‌రెడ్డి, నార్త్ బ్లాక్ లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బండి సంజయ్, రాజీవ్‌గాంధీ భవన్‌లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రిగా పెమ్మసాని చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య కోలాహలంగా కిషన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగా, మిగతా ముగ్గురు మంత్రులు సాదాసీదాగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈ నలుగురిని కలిసి పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తా: కిషన్‌రెడ్డి

దేశంలో ఉన్న ఖనిజాలను వెలికి తీయడంతోపాటు ఉపాధి అవకాశాలను పెంచేందుకు కృషి చేస్తానని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఖనిజాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసి దేశం ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. శక్తివంతమైన భారత్‌ను రూపొందించడంలో బొగ్గు, గనుల శాఖల పాత్ర కీలకమని, దాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గురువారం ఉదయం 11.15గంటలకు కేంద్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. రానున్న రోజుల్లో దేశ అవసరాలకు సరిపోయేలా బొగ్గు ఉత్పత్తిని పెంచుతామని వెల్లడించారు. పదేళ్ల క్రితం దేశంలో తీవ్ర విద్యుత్ కొరత ఉండేదని, హైదరాబాద్‌లో పారిశ్రామికవేత్తలు విద్యుత్ కోసం సమ్మె చేసిన ఘటనలు మనం చూశామని గుర్తుచేశారు. ప్రధాని మోదీ విద్యుత్ కొరతకు చెక్ పెట్టారని కిషన్‌రెడ్డి తెలిపారు.

అంబేడ్కర్, అమరుల స్తూపానికి నివాళి

బాధ్యతల స్వీకారానికి ముందు కిషన్‌రెడ్డి ఢిల్లీలోని తెలంగాణభవన్‌కు వెళ్లారు. అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి, అమవీరుల స్తూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు వెంకటేశ్వర స్వామి, కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుద్వారా సాహిబ్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తన చాంబర్‌లో ప్రత్యేక పూజల తర్వాత బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డికి ఢిల్లీలోని టీటీడీ ఆలయ అర్చకులు శ్రీవేంకటేశ్వర స్వామి వారి తరఫున ఆశీర్వచనాలు అందజేశారు.

కిషన్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కేంద్రమంత్రి ప్రల్హాద్ జోషి, కేంద్ర సహాయ మంత్రులు బండి సంజయ్, సతీష్‌చంద్ర దూబే, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, తెలంగాణ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ధర్మపురి అర్వింద్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు రాజాసింగ్, వెంకటరమణారెడ్డి, బీజేపీ నేతలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మర్రిశశిధర్‌రెడ్డి, మాధవీలత, ప్రేమేందర్‌రెడ్డి, సుభాష్, అల్జాపూర్ శ్రీనివాస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సామాన్యులకు విమానయాన రంగాన్ని చేరువ చేస్తా: రామ్మోహన్

సామాన్యులకు విమానయాన రంగాన్ని చేరువ చేస్తానని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. గురువారం రాజీవ్‌గాంధీ భవన్‌లోని కార్యాలయంలో మధ్యాహ్నం 1.15గంటలకు కేంద్రమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ..ఏపీ తెలంగాణ సహా రాష్ట్రాల వారీ గా విమానాశ్రయాల అభివృద్ధిని వేగవంతం చేస్తామన్నారు.

సమర్థవంతంగా బాధ్యతలు: పెమ్మసాని

కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రిగా పెమ్మసాని చంద్రశేఖర్ సంచార్ భవన్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు.

సాదాసీదాగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్

కేంద్ర హోంశాఖకు సంబంధించిన అధికారులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య, ఎలాంటి ఆర్భాటంగా లేకుండా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు తీసుకున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు నార్త్ బ్లాక్‌లో కేంద్ర హోంశాఖ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయనకు జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ ఆశీస్సులు అందించారు. అనంతరం సహచర మంత్రి నిత్యానందరాయ్, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు తదితరులు బండి సంజయ్‌ని కలిసి అభినందనలు తెలిపారు. భద్రతా కారణాల రీత్యా ఈ కార్యక్రమానికి ఎవరినీ అనుమతించలేదు. దీంతో బాధ్యత స్వీకారానికి ముందే అధికారిక నివాసంలో బండి సంజయ్‌ను కలిసి ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, అభిమానులు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పంట భూముల డిజిటల్ సర్వే

ప్రతి పంట భూమిని ఫొటో తీసి.. యాప్‌లో అప్‌లోడ్

- రాష్ట్ర వ్యవసాయశాఖ సన్నాహాలు
- కేంద్రం అంగీకరిస్తే వచ్చే ఏడాది నుంచి అమలు
- లేకుంటే ఈ సీజన్ నుంచే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంట భూములను డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ఈ సర్వే కోసం ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖకు సూచించింది. ఈ వానాకాలం సీజన్ నుంచి అమలు చేయాలని కేంద్రం ఆదేశించిన నేపథ్యంలో ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీలైతే వచ్చే ఏడాది నుంచి అమలు చేసేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరాలని భావిస్తోంది. ఒకవేళ కేంద్రం అనుమతిస్తే డిజిటల్ క్రాప్ సర్వే వచ్చే ఏడాదికి వాయిదా పడుతుంది. లేకుంటే ఈ సీజన్ నుంచే చేస్తామని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. డిజిటల్ సర్వే కచ్చితంగా ప్రతీ సర్వే భూమిలో సాగవుతున్న పంటను ఫొటో తీస్తుంది. ఏ పంట సాగయిందో అది స్పష్టత ఇవ్వనుంది. అలా తీసిన పంటల ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీంతో పంట లెక్కల్లో కచ్చితత్వం వస్తుంది. దీనివల్ల పలు వ్యవసాయ పథకాల అమలుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.



ఈ సర్వేతో అర్హులకే పథకాలు

సర్వే నెంబర్‌లో పంట సాగును నమోదు చేయాలంటే కచ్చితంగా ఆ అధికారి ఆ సర్వే నెంబర్‌లో ఉండాల్సిందే. ఆ సర్వే నెంబర్‌కు 50–100 మీటర్ల విస్తీర్ణంలో ఉంటేనే ఆ వివరాలను యాప్ నమోదు చేస్తుంది. దీంతో పంట సాగు నమోదులో అవకతవకలకు, మాన్యువల్ నమోదుకు ఆస్కారం లేకుండా పోయింది. ఇదిలావుండగా, డిజిటల్ క్రాప్ సర్వే వల్ల రైతు భరోసా వంటి పథకాన్ని అర్హులకే అందజేసేలా వీలుంటుందని అంటున్నారు. సాగు చేసే రైతులకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్న తరుణంలో ఈ డిజిటల్ సర్వే మరింత ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

ల్యాండ్ బ్యాంక్ గుర్తింపునకు కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్ : అభివృద్ధి, ఇతర అవసరాలకు అటవీభూమి కేటాయిస్తే ప్రత్యామ్నాయ అటవీకరణ (కంపెన్సెటరీ అఫారెస్టేషన్)లో భాగంగా 'ల్యాండ్ బ్యాంక్'గుర్తింపు కోసం పీసీసీఎఫ్ చైర్‌పర్సన్‌గా ఓ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సభ్యులుగా పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్), రెవెన్యూశాఖ ప్రతినిధి, ఏఎస్ (అసైన్‌మెంట్) సీసీఎల్ఏ అధికారి, అటవీ, పర్యావరణశాఖ అధికారి, సభ్యకార్యదర్శిగా డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (ఎఫ్‌సీఏ) వ్యవహరించనున్నారు. గురువారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రత్యామ్నాయ అటవీకరణ నిమిత్తం క్షేత్రస్థాయిలో సమస్యలు, ఎలాంటి వివాదాలకు తావులేని భూమిని ల్యాండ్‌బ్యాంక్‌లో భాగంగా గుర్తించేలా ఈ కమిటీ చర్యలు చేపట్టనుంది.

గుర్తింపు ఇలా..

- వివిధ కేటగిరీలకు చెందిన అటవీయేతర భూములు.
- వైల్డ్‌లైఫ్ కారిడార్లలోకి వచ్చే ప్రాంతాలు, ఆవాసాల మధ్య కనెక్టివిటీని మెరుగు పరిచేందుకు ఉపయోగపడేవి.
- రక్షిత ప్రాంతాలకు చుట్టుపక్కల ఉన్న భూములు, రక్షిత ప్రాంతాల ఎకో సెన్సిటివ్ జోన్, వాటిని పటిష్టపరిచేందుకు ఉపయోగపడే అటవీ ప్రాంతాలు.
- ముఖ్యమైన నదులు, నీటిసరఫరా పథకాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులు తదితరాల క్యాచ్‌మెంట్ ఏరియాల పరిధిలోకి వచ్చేవి.
- దీనికి సరిపడే ప్రాంతాలు

కేసీఆర్‌కు ముందుంది ముసళ్ల పండగ


- ఈడీ ఆయనపై కేసు నమోదు చేసింది
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మెదక్‌జోన్: చెడపకురా చెడేవు.. అన్నట్లుగా కేసీఆర్ చేసిన పనులు ఆయనకే చుట్టుకున్నాయని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌పై ఈడీ అధికారులు కేసు నమోదు చేశారని, కేటీఆర్, హరీశ్‌రావు, వెంకట్రామిరెడ్డికి ముందు ముందు ముసళ్ల పండుగ ఉందని పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తనను ఓడించేందుకు రూ.200 కోట్లు ఖర్చుపెట్టారని ఆరోపించారు. రైల్వేస్టేషన్‌లో చాయ్ అమ్మిన నరేంద్ర మోదీ 74 ఏళ్ల వయసులో మొక్కవోని దీక్షతో పోరాడి వరుసగా మూడుసార్లు ప్రధాన మంత్రి కావడం గొప్పవిషయమన్నారు. తాను ఎన్నో అవమానాలు భరించానని, ఎంతోమంది హేళన చేసినా పట్టించుకోలేదని తెలిపారు. డబ్బుతో ఎన్నికల్లో గెలుస్తామన్నది మూర్ఖపు ఆలోచన అని, లక్ష కోట్లు ఉన్న వెంకట్రామిరెడ్డిని సంకల్పబలంతో ఓడించానని అన్నారు. ఆరడుగులు, మూడడుగులు ఉన్నోళ్లు కూడా తమను ఆపలేకపోయారని మాజీ మంత్రి హరీశ్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఆయన అన్నారు.

యాదాద్రిలో నా పాత్రేం లేదు

- ఇంధన శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా
- జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు తెలిపిన మాజీ ఐఏఎస్
- 18న కమిషన్ ముందుకు కె.రఘు, ప్రొఫెసర్ కోదండరామ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంధన శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రాను జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి గురువారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో విచారించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణంలో ఆయన పాత్రపై ప్రశ్నించారు. విద్యుత్ కేంద్రం నిర్మాణంపై నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన ఓ సమీక్షలో మాత్రమే తాను పాల్గొన్నానని, ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి నిర్ణయాత్మక పాత్ర పోషించలేదని అజయ్ మిశ్రా వివరించినట్టు తెలిసింది. నిర్ణయాలన్నీ ప్రభుత్వ స్థాయిలో జరిగాయని, తాము కేవలం అమలు చేశామని తెలిపినట్టు సమాచారం. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ముందు ఈ నెల 18న టీజేఏసీ చైర్మన్, విద్యుత్ రంగ నిపుణులు కె.రఘు, టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ హాజరై తమ ఫిర్యాదుల్లోని అంశాలను వివరించనున్నారు. 19న విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాల్ రావు, తిమ్మారెడ్డి హాజరై తమ వద్ద ఉన్న సమాచారాన్ని కమిషన్‌కు తెలియజేయనున్నారు. కాగా, యాదాద్రి విద్యుత్ కేంద్రానికి సంబంధించిన ప్రాజెక్టు అంచనా వ్యయం పెంచుతూ తెలంగాణ జెన్‌కో బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకోగా, అందులో అజయ్ మిశ్రా కూడా పాల్గొన్నారు. జీఎస్టీ అమల్లోకి రావడం, పర్యావరణ పరిరక్షణ కోసం ఎఫ్‌జీడీ నిర్మించాల్సి రావడంతో విద్యుత్ కేంద్రం అంచనా వ్యయాన్ని అప్పట్లో పెంచారు.

ఊపందుకున్న నైరుతి వానలు

- రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు
- నేడూ కురియనున్న వర్షాలు

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల కదలికలు చురుకుగా ఉండటంతో రాష్ట్రంలో వానలు ఊపందుకున్నాయి. గత వారం రోజులుగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదవుతుండగా... గురువారం చాలాచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. రంగారెడ్డి, హైదరాబాద్, ఖమ్మం, మెదక్, సిద్దిపేట, నల్లగొండ, హనుమకొండ, మెదక్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని చాలాచోట్ల వానలు కురిసినట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. గురువారం రాష్ట్రవ్యాప్తంగా సగటు వర్షపాతం 1.8 సెం.మీ. నమోదు కాగా... అత్యధికంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలో 7.45 సెం.మీ. వర్షపాతం నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలతోపాటు, జీహెచ్ఎంసీకి తూర్పు వైపున కొన్నిప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. రానున్న 2 రోజులు రాష్ట్రంలో చాలాచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్ర మట్టం నుంచి 3.1 కి.మీ. నుంచి 5.8 కి.మీ. మధ్య ఎత్తులో కొనసాగుతున్నట్లు తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు నమోదు కావొచ్చని తెలిపింది.

గురువారం రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు



జిల్లా	ప్రాంతం	వర్షపాతం (సెం.మీ.)
రంగారెడ్డి	మంగల్‌పల్లి	7.45
ఖమ్మం	పెద్దగొపాటి	5.88
ఖమ్మం	సిరిపురం	5.20
ఖమ్మం	రావినూతల	4.98
రంగారెడ్డి	ఆరుట్ల	4.95
ఖమ్మం	మధిర	4.70

బిగుస్తున్న 'గొర్రెల' ఉచ్చు

▶ మొదటి పేజీ తరువాయి

సెక్షన్ 54 కింద లేఖ రాసిన ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ మాగిమై అరోకియారాజ్.. కోరిన సమాచారాన్ని అత్యవసరంగా పరిగణించి అందజేయాలని సూచించారు. ఈ కుంభకోణంపై కేసు నమోదు చేయడం, ఆ వెంటనే వివరాలు కోరుతూ సంబంధిత శాఖకు లేఖ రాయడంతో ఈ కేసులో ఈడీ దూకుడు మీద ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లబ్ధిదారుల పేర్ల నుంచి చెక్కుల దాకా..

తెలంగాణలో ఈ పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ ఏడాది జూన్ 11 మధ్యకాలానికి సంబంధించిన పూర్తి వివరాలు ఈడీ అధికారులు కోరారు. జిల్లాల వారీగా లబ్ధిదారుల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాల వివరాలు, టీఎస్‌జీడీసీఎఫ్ఎల్ ద్వారా పంపిణీ అయిన చెక్కుల పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మొత్తం కుంభకోణంలో కీలకమైన గొర్రెల రవాణా కాంట్రాక్టుదారుల వివరాలు, వారికి జరిగిన చెల్లింపులు, గొర్రెల దాణా కొనుగోలు వివరాలు కూడా ఈడీ కోరింది. అంతర్గతంగా జరిగిన అవినీతికి సంబంధించి అదనపు వివరాలు ఏవైనా ఉంటే ఇవ్వాలని లేఖలో సూచించారు.

ఆ ఇద్దరూ చెప్పే విషయాలే కీలకం!

గత ప్రభుత్వ హయాంలో అమలైన గొర్రెల పంపిణీ పథకం కుంభకోణం కేసులో ఏసీబీ అధికారులు ఇప్పటివరకు 9 మందిని అరెస్టు చేశారు. గొర్రెలను విక్రయించినా తమకు డబ్బులు ఇవ్వలేదని, తమ పేరిట ఎవరో డబ్బులు తీసుకున్నారంటూ ఏపీ రైతుల ఫిర్యాదు చేయడంతో మొదటిసారిగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో కామారెడ్డి జిల్లా ఏరియా వెటర్నరీ హాస్పిటల్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.రవి, మేడ్చల్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయి, రంగారెడ్డి జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ పసుల రఘుపతి రెడ్డి, నల్లగొండ వయోజన విద్యా డిప్యూటీ డైరెక్టర్ సంగు గణేష్‌లను అరెస్ట్ చేశారు. ఆ తర్వాత మార్చిలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ అంజిలప్ప, అసిస్టెంట్ డైరెక్టర్ పి.కృష్ణయ్యలను అదుపులోకి తీసుకున్నారు. తదనంతరం ఈ మొత్తం వ్యవహారంలో కీలకమైన తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ సబావత్ రాంచందర్, అప్పటి పశుసంవర్ధ శాఖ మంత్రి దగ్గర ఓఎస్డీగా పనిచేసిన గుండమరాజు కల్యాణ్‌కుమార్‌ల అరెస్టుతో ఈ కేసు కీలక మలుపు తిరిగింది. రాంచందర్, కల్యాణ్‌కుమార్‌లను కస్టడీకి తీసుకుని ఈ నెల 10 నుంచి 13 వరకు ఏసీబీ అధికారులు విచారించారు. దీంతో వారు ఏసీబీకి ఏం చెప్పారన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఇంకా ఎవరెవరున్నారనే దిశగా దర్యాప్తు

ఈ మొత్తం కుంభకోణంలో ఈ ఇద్దరే కీలకంగా పనిచేశారా? ఇంకా ఎవరైనా వీరిద్దరికీ ఆదేశాలు ఇచ్చారా? అప్పటి మంత్రి పేషీలో ఇంకెవరెవరు ఉన్నారు? గొర్రెల కొనుగోలుకు ఎంతమంది బ్రోకర్లు పనిచేశారు? అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. మొదటి నుంచి ప్రచారం జరుగుతున్నట్టుగా గొర్రెల పంపిణీ పథకం కొనుగోల్ మాల్ వ్యవహారాలకు సంబంధించి బ్రోకర్లు ప్రత్యేక సమావేశాలు పెట్టుకోవడం, ఒక్కో యూనిట్‌కు రూ.20 వేలు చేతులు మారినట్టు, ఒకసారి కొనుగోలు చేసిన గొర్రెల యూనిట్‌నే మళ్లీ మళ్లీ కొనుగోలు చేసినట్టు చూపిస్తూ బిల్లులు పెట్టడం..గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కృష్ణా జిల్లాల నుంచి గొర్రెల కొనుగోలు చేయడంలో జరిగిన అక్రమాలు, పశుసంవర్ధకశాఖ లోని ఉద్యోగ సంఘాల నాయకులకు ఇందులో ఉన్న పాత్ర తదితర వివరాలు బహిర్గతం కావచ్చని అంటున్నారు. పరారీలో ఉన్న కాంట్రాక్టర్లు మొయినుద్దీన్, అతడి కుమారుడు ఇక్రమ్ పట్టుబడితే మరికొన్ని కొత్త కోణాలు వెలుగులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

నేడు పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి ఈడీ అధికారులు?

గొర్రెల పంపిణీ కుంభకోణంలో మనీ లాండరింగ్ అంశంపై దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులు శుక్రవారం పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి వెళ్లనున్నట్లు తెలిసింది. ఈ పథకానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని ఇప్పటికే సదరు విభాగాన్ని కోరిన ఈడీ.. ఆ మేరకు వివరాలు సేకరించనున్నట్లు సమాచారం.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 14 । జూన్ । 2024



బక్రీద్‌కు భారీ బందోబస్తు

బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవడానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. -10లో



జల్సాలకు అలవాటు పడి..

జల్సాలకు అలవాటుపడి డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి డ్రగ్స్, నగదు స్వాధీనం చేసుకున్నారు. -10లో

మానవ అక్రమ రవాణా రాకెట్‌కు చెక్



వ్యభిచారం, మనుషుల అక్రమ రవాణా రాకెట్‌ను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకుని ఇద్దరు ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లు, కస్టమర్‌ను అరెస్టు చేశారు. -10లో

హెచ్‌ఎండీఏలో ఫైళ్ల పరుగులు

- 5 నెలల్లో 274.67 లక్షల చ.అడుగుల నిర్మాణాలకు అనుమతులు
- రూ.336.31 కోట్ల ఆదాయం
- 1,030 ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

గత 5 నెలల్లో హెచ్‌ఎండీఏ ఇచ్చిన అనుమతులు

నెల	అనుమతించిన ప్రాజెక్టులు	(లక్షల్లో) చదరపు ఫీట్‌లలో నిర్మాణ ప్రదేశం	ఆదాయం (రూ.కోట్లలో)
జనవరి	208	19.95	72.02
ఫిబ్రవరి	114	7.84	56.01
మార్చి	227	33.60	51.68
ఏప్రిల్	181	28.76	81.87
మే	300	184.52	74.73
మొత్తం	1,030	274.67	336.31

మహా దూకుడు!

సాక్షి, సిటీబ్యూరో: మహానగర పాలక సంస్థ (హెచ్‌ఎండీఏ) అనుమతుల్లో వేగం పుంజుకుంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్మాణ రంగానికి చెందిన ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయి. బహుళ అంతస్తుల భవనాలు మొదలుకొని సాధారణ, మధ్యతరగతి వర్గాలకు చెందిన భవనాల నిర్మాణం వరకు అనుమతులను వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. టీజీబీ పాస్‌ను పూర్తిస్థాయిలో అమల్లోకి తేవడంతో పాటు గతంలో వెసులుబాటు కల్పించిన ఆఫ్‌లైన్ సేవలను నిలిపివేశారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చే దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దీంతో ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు 5 నెలల కాలంలో 274.67 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణ అనుమతులను ఇచ్చారు. చిన్న ప్రాజెక్టులు మొదలుకొని భారీ ప్రాజెక్టుల వరకు మొత్తం 1,030 దరఖాస్తులను పరిష్కరించారు. దీంతో హెచ్‌ఎండీఏకు గత 5 నెలల్లో రూ.336.31 కోట్ల వరకు ఆదాయం లభించింది. మరోవైపు ప్రణాళికా విభాగాన్ని మరింత బలోపేతం చేసి టీజీబీ పాస్ సేవలను మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇలా ఒక నెలలో కనిష్ఠంగా 114 ప్రాజెక్టుల నుంచి గరిష్ఠంగా 300 ప్రాజెక్టుల వరకు కూడా అనుమతులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

కఠిన చర్యలు తప్పవు : దానకిషోర్

ప్రణాళికా విభాగంలో అధికారులు ప్రతి ఫైల్‌ను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి. నిబంధనలకు అనుగుణంగా సేవలను అందజేయాలి. ఫైళ్ల పరిష్కారంలో జాప్యం జరిగినా, గడువులోగా పరిష్కరించకుండా ఫైళ్లు పెండింగ్‌లో పెట్టినా సంబంధిత అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలుంటాయి.

టీజీబీపాస్ నుంచే స్వీకరణ..

మరోవైపు భవన నిర్మాణాల కోసం అనుమతులను ఇక నుంచి టీజీబీపాస్ ద్వారా మాత్రమే స్వీకరించనున్నారు. గతంలో హెచ్‌ఎండీఏ పరిధిలోని సుమారు 1,032 గ్రామాల్లో డీపీఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేది. ఒకవైపు టీజీబీ పాస్ ద్వారా 30 మున్సిపాలిటీలు, హెచ్‌ఎండీఏలోని ఇతర అన్ని ప్రాంతాల్లో అనుమతులను ఇస్తుండగా, గ్రామాల్లో మాత్రం లేఅవుట్ అనుమతులకు డీపీఎంఎస్ ద్వారా వెసులుబాటు కల్పించారు. ఈ రెండు పద్ధతులతో సాంకేతికంగా ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇక నుంచి అన్ని ప్రాంతాల్లో కేవలం టీజీబీపాస్ నుంచే దరఖాస్తులను స్వీకరించి అనుమతులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో హెచ్‌ఎండీఏ సేవలను మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు అవకాశం లభించనుంది.





కన్ను కొట్టి.. గన్ను పట్టి!

ఆదిత్య మెహతా ఫౌండేషన్, జవహర్ నవోదయ విద్యాలయ సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా క్యాంపస్‌లో నిర్వహించిన పారా స్పోర్ట్స్ శిబిరంలో సినీ నటి రెజీనా సందడి చేశారు. పిస్టల్‌ను ఇలా గురి పెట్టి ఆకట్టుకున్నారు.

నాణ్యతపై మూడో నేత్రం

ఇంజినీరింగ్ పనుల్లో తనిఖీల కోసం..

- టెండర్లు పిలిచిన జీహెచ్‌ఎంసీ

గత మూడు సంవత్సరాల్లో జీహెచ్‌ఎంసీలో మంజూరైన ఇంజినీరింగ్ పనులు .. వాటి విలువ

సంవత్సరం	పనులు	విలువ (రూ.కోట్లు)
2021–22	6456	1835
2022–23	7235	3246
2023–24	6386	1951

సాక్షి, సిటీబ్యూరో: ఇంజినీరింగ్ పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు థర్డ్ పార్టీలుగా ప్రముఖ ఇంజినీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలు, రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్‌డీ) సంస్థల నుంచి జీహెచ్‌ఎంసీ టెండర్లు పిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25)లో చేపట్టిన, చేపట్టనున్న రూ.5 లక్షల కంటే ఎక్కువ విలువైన పనుల్ని టెండర్ల ద్వారా ఎంపికయ్యే థర్డ్‌పార్టీలు (ఏజెన్సీలు) తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఇంజినీరింగ్ ప్రమాణాలకనుగుణంగా తగిన నాణ్యతతో పనులు జరిగిందీ లేనిదీ పరిశీలించాలి. ఎక్కడైనా లోటుపాట్లు గుర్తిస్తే వాటిని పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థలకు, ఇంజినీర్లకు తెలియజేయడంతో పాటు వాటిని సరిదిద్దేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పనుల్లో వినియోగించే మెటీరియల్ నాణ్యత తదితరాలను కూడా తనిఖీ చేయాలి.

ఒక్కో ఏజెన్సీకి.. ఒక్కో విభాగం..

- ఏటా చేస్తున్న కోట్లాది రూపాయల పనులు నాణ్యతగా జరిగేందుకు జీహెచ్‌ఎంసీలోని క్వాలిటీ కంట్రోల్ అధికారులతో పాటు థర్డ్‌పార్టీగా నిపుణులతోనూ తనిఖీలు చేసేందుకు ఈ టెండర్లు పిలిచారు. సీఆర్‌ఎంపీ, ఎస్ఎన్‌డీపీ, హౌసింగ్, పీఎంసీ విభాగాలు చేపట్టిన పనులు మినహా మిగతా సివిల్ ఇంజినీరింగ్ పనుల్ని ఎంపికయ్యే ఏజెన్సీలు తనిఖీలు చేస్తాయి. పనుల్ని నిర్ణీత దశల్లో తనిఖీలు చేయాలి. క్షేత్ర స్థాయి తనిఖీలతో పాటు మెటీరియల్స్‌ను లేబరేటరీల్లో పరీక్షించాలి. వీటిలో సిమెంట్ కాంక్రీట్ ఫుట్‌పాత్‌లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, వరద నీటి డ్రెయిన్లు, ఆర్‌సీసీ భవనాలు, కల్వర్టులు, బ్రిడ్జిలు తదితర పనులున్నాయి.
- మొత్తం 12 ఏజెన్సీలుగా థర్డ్‌పార్టీ నిపుణుల్ని ఎంపిక చేయనున్నారు. జీహెచ్‌ఎంసీలోని 30 సర్కిళ్లను 12 విభాగాలుగా చేసి ఒక్కో ఏజెన్సీకి ఒక్కో విభాగం బాధ్యతలప్పగిస్తారు. జీహెచ్‌ఎంసీకి పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇంజినీరింగ్ సంస్థల నిపుణులే ఏజెన్సీలుగా టెండర్లలో పాల్గొనాల్సి ఉంది. సంస్థ ఏర్పాటై కనీసం పదేళ్ల కాలం పూర్తయి ఉండాలి. ఏఐసీటీఈ గుర్తింపు కలిగి ఉండటంతో పాటు ప్రభుత్వ యూనివర్సిటీల్లోని సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌కు అనుబంధంగా ఉండాలి.

12 విభాగాలు.. వాటిల్లోని సర్కిళ్లు

1.కాప్రా, ఉప్పల్
2.హయత్‌నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్
3. మలక్‌పేట, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట
4.చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్
5.మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్
6. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్
7.యూసుఫ్‌గూడ, చందానగర్
8.శేరిలింగంపల్లి, రామచంద్రాపురం–పటాన్‌చెరు
9.మూసాపేట, కూకట్‌పల్లి
10.కుత్బుల్లాపూర్, గాజులరామారం,అల్వాల్
11.ముషీరాబాద్, అంబర్‌పేట
12.సికింద్రాబాద్, బేగంపేట.

జలం.. పుష్కలం

మహా నగరానికి ప్రత్యేక మంచినీటి పథకం

- రూ.5000 కోట్ల వ్యయంతో రూపకల్పన
- మల్లన్నసాగర్ నుంచి నేరుగా పైపులైన్లు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

గజ్వేల్: మహానగరంలో పెరుగుతున్న తాగునీటి అవసరాలకు అదనంగా మరో కొత్త పథకం రాబోతోంది. రూ.5000కోట్ల వ్యయంతో చేపట్టనున్న పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. తొలుత సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని తరలించాలనుకున్నా.. ఆ తర్వాత ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. తాజాగా మల్లన్నసాగర్ నుంచే నేరుగా పైపులైన్లు వేసి నీటిని తీసుకెళ్లాలనే ఆలోచనకు వచ్చారు. మూడు రోజుల క్రితం ఇక్కడ జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి పరిశీలన జరిపారు. ప్రతిష్ఠాత్మక జపాన్ సంస్థ జైకా నుంచి ఇందుకోసం రుణం తీసుకోవాలనుకుంటున్నారు.

నిరంతర సరఫరాకు అవరోధాలుంటాయని..

కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలించాలని ముందుగా భావించారు. కానీ ఈ రిజర్వాయర్ సామర్థ్యం కేవలం 15 టీఎంసీలు మాత్రమే కావడంతో నిరంతరం నీటిని తరలించడానికి అవరోధాలుంటాయని గుర్తించారు. ఈ క్రమంలోనే ఈ నిర్ణయాన్ని విరమించుకున్నారు. తాజాగా మల్లన్నసాగర్ నుంచే నీటిని తరలించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ రిజర్వాయర్‌ను 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. ఈ క్రమంలోనే జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి, ఈడీ, డైరెక్టర్లు మూడు రోజుల క్రితం మల్లన్నసాగర్‌ను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇక్కడి నుంచి ప్రస్తుతం నగరానికి వెళ్తున్న ఎల్లంపల్లి లైన్‌కు సమాంతరంగా మరో కొత్త పైపులైన్ నిర్మించాలని నిర్ణయించారు.

ప్రత్యేకంగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

ముందుగా మల్లన్నసాగర్ నుంచి మేడ్చల్ జిల్లా ఘనపూర్ వరకు సమారుగా 80 కిలోమీటర్ల మేర 4 డయామీటర్ల పైపులైన్ నుంచి నిర్మించి అక్కడ ప్రత్యేక డబ్ల్యూటీపీ (వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) నిర్మించాలని నిర్ణయించారు. అక్కడి నుంచి గండిపేటకు అవుటర్ రింగు రోడ్డు గుండా పైప్‌లైన్ నిర్మించి అక్కడ కూడా డబ్ల్యూటీపీ నిర్మించాలని భావిస్తున్నారు. వీటి ద్వారా ఏటా 10 టీఎంసీల నీటిని మంచి నీటి అవసరాలకు వాడుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఏటా మరో 5 టీఎంసీల నీటిని మూసీ నది ప్రక్షాళన, సందరీకరణ కోసం వాడుకోవాలని కూడా నిర్ణయించినట్లు తెలిసింది. అధికారులు ఇచ్చిన డీపీఆర్‌కు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన సర్వే పనులు కూడా ప్రారంభమయ్యాయి.

మల్లన్నసాగర్ రిజర్వాయర్



నగరంలో కుండపోత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సైదాబాద్, చార్మినార్, బండ్లగూడ, అంబర్‌పేట, సరూర్‌నగర్, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, నాగోలు, చైతన్యపురి, గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్ మలక్‌పేట, ఆస్మాన్‌ఘర్, బహదూర్‌పురా, నాంపల్లి, సికింద్రాబాద్, మారేడుపల్లి, మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో కుండపోతగా వాన కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యధికంగా సైదాబాద్ కుర్మగూడలో 4.1 సెంటీ మీటర్లు, డబీర్‌పురా 3.9, సర్దార్ మహల్ 3.3, ఆస్మాన్‌ఘర్ 3.2, కంచన్‌బాగ్‌లో 3 సెం.మీ మేర వర్షంపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో కారు మబ్బులు కమ్ముకున్నాయి.



సనత్‌నగర్‌లో స్థానికుల ఇబ్బందులు..



మహబూబ్ గంజ్‌లో..



మలక్‌పేట్‌లో వరద నీటిలో వెళ్తున్న వాహనాలు

ప్రయాణికుల భద్రతే ప్రధానం

రైళ్ల నిర్వహణపై మెట్రో ఎండీ సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: రైళ్ల నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ విభాగాలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ట్రాక్‌ల పటిష్టత, విద్యుత్ సరఫరా, రైళ్ల రాకపోకల నిర్వహణ వంటి అన్ని అంశాల్లో 24 గంటల పర్యవేక్షణ కొనసాగాలని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ మెట్రో రైల్ భవన్‌లో వివిధ విభాగాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే సత్వరమే తగిన చర్యలు చేపట్టేవిధంగా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. వయాడక్ట్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వరదనీరు నిల్వ లేకుండా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జాయింట్‌లు, నట్లు,బోల్టులు వంటి వాటి పటిష్టత ఎంతో ముఖ్యమని చెప్పారు. మెట్రో ట్రాక్ మార్గాల్లో ఫ్లెక్సీలు, అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులను తొలగించాలి. మరోవైపు వర్షాకాలంలో ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.

దసరాలోగా నూతన భవనం నిర్మిస్తాం

ఎర్రమంజిల్ పాఠశాలను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి ఎఫెక్ట్



ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల సమస్యలపై చర్చిస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, విజయారెడ్డి తదితరులు

పంజగుట్ట: వచ్చే దసరాలోగా ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని నిర్మించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు. 'బాటలు మూసి.. గోతులు తవ్వి' శీర్షికన గురువారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డితో పాటు అధికారులు ఈ పాఠశాల విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. ఎర్రమంజిల్ మహిళా మండలి నుంచి పాఠశాలకు 100 అడుగుల మేర దారి వదలాలని, అక్కడ కేవలం విద్యార్థులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. ప్రైవేట్ వాహనాలకు అనుమతి లేదని బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రహదారి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రిని కలిసి ఎర్రమంజిల్ పాఠశాల నూతన భవనానికి ఆయన చేతుల మీదుగానే శంకుస్థాపన చేయిస్తామన్నారు.

ప్రాణాలు తీసిన పైశాచికానందం

- పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న యువకులు
- మద్యం మత్తులో కారుతో రహదారిపై చక్కర్లు
- ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్‌కు గాయాలు
- వీరి కారును ఆపేందుకు యత్నించిన మరో యువకుడు
- అతని బైక్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం
- నాంపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి హిట్ అండ్ రన్ ఘటన



మృతుడు అజయ్ (ఫైల్)

నాంపల్లి: ఒకరి పుట్టిన రోజు వేడుక మరో వ్యక్తి ప్రాణాలను బలి తీసుకుంది. ఇంకొకరిని గాయాల పాల్జేసింది. మద్యం మత్తులో కొందరు యువకుల పైశాచిక ఆనందమే ఇందుకు కారణమైంది. మితిమీరిన వేగంతో కారును నడుపుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. నాంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఈ దారుణం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని ఓ హాస్టల్‌లో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ముగ్గురు బ్యాచిలర్లు రాజశేఖర్, మధు, శ్రీకాంత్‌లతో పాటు రామాంజనేయులు అనే వివాహితుడు ఉంటున్నారు. వీరు ఓ ప్రైవేట్ ట్రావెల్స్ కంపెనీలో పని చేస్తున్నారు. ఈ నెల 10న రాజశేఖర్ పుట్టిన రోజు సందర్భంగా వీరంతా పీకల దాకా మద్యం తాగారు. కూకట్‌పల్లి నుంచి కారులో చార్మినార్‌కు వెళ్లి సంబరాలు చేసుకునేందుకు బయలుదేరారు. అర్ధరాత్రి 12 గంటలకు చార్మినార్ దగ్గర పుట్టిన రోజు కేక్‌ను కట్ చేశారు. అనంతరం వేడుకలను ముగించుకుని కూకట్‌పల్లికి తిరిగి వెళ్తున్నారు. అర్ధరాత్రి 12.30 గంటలకు నాంపల్లి మెట్రో రైల్వే స్టేషన్ బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో కారు మితిమీరిన వేగం కారణంగా ఆటోను ఢీకొట్టారు. ఈ ఘటనలో హాఫీజ్‌పేటకు చెందిన నర్సింగ్ రావు అనే ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన ఆటో డ్రైవర్ కాచిగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. మద్యం మత్తులో ఉన్న బ్యాచిలర్లు కారును ఆపకుండా వేగంగా పారిపోయే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అటు నుంచి వెళ్తున్న నేరెడ్‌మెట్‌కు చెందిన అజయ్ (27) అనే యువకుడు కారును ఆపే ప్రయత్నం చేశాడు. కానీ ఆ నలుగురు స్నేహితులు కారును ఆపకుండా వెళ్లారు. ఈ క్రమంలో అజయ్ బైక్‌ను కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్నేహితుడు సాయితేజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ ఘటనలో రాజశేఖర్, మధు, శ్రీకాంత్, రామాంజనేయులును పోలీసులు అరెస్టు చేశారు.

'సంతాన' కలలను నెరవేర్చుతున్నాం

ఫెర్టీ9 ఫెర్టిలిటీ సంస్థ డైరెక్టర్ జ్యోతి



ఫెర్టీ9 ఫెర్టిలిటీ కేంద్రం లోగోను ఆవిష్కరిస్తున్న ఆ సంస్థ డైరెక్టర్ జ్యోతి, ఇతర వైద్యులు

సాక్షి, సిటీబ్యూరో: పిల్లలు లేని దంపతులకు సంతాన భాగ్యం కల్పించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫెర్టీ9 ఫెర్టిలిటీ కేంద్రాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని ఆ సంస్థ డైరెక్టర్ జ్యోతి అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఫెర్టీ9 ఫెర్టిలిటీ కేంద్రాల ద్వారా సుమారు 10 వేల జంటలు తల్లిదండ్రులయ్యారని తెలిపారు. సంతాన లేమి అంటే సాధారణంగా స్త్రీలనే పరీక్షిస్తున్నారని, కానీ 45 నుంచి 50 శాతం మంది మగవారిలోనూ లోపాలు ఉంటున్నాయన్నారు. అయితే మగవారు సమస్యలు చెప్పుకోవడానికి సరైన వైద్యులు (పురుషులు) అందుబాటులో లేకపోవడంతోపాటు మహిళా వైద్యుల దగ్గర అన్ని విషయాలు చెప్పుకోలేకపోతున్నారని తెలిపారు. పొగ తాగడం, మద్యం సేవించడం, వయసు ప్రభావం వల్ల ఫెర్టిలిటీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, అందుకోసం ప్రత్యేకంగా ఆండ్రో విభాగం ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా రాజమండ్రి, తిరుపతిలో నూతన బ్రాంచీలను ఈ నెల 15న ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ నెల 16న తండ్రుల దినోత్సవం సందర్భంగా 25 శాతం ఫీజు రాయితీ అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు శశాంక్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

రేపు భరోసా కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసుల ఆధ్వర్యంలో సైఫాబాద్ హాకా భవన్‌లోని భరోసా సెంటర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. జనన లోపాలు, ప్రమాద, కాలిన గాయాలు, కణితుల కారణంగా ఏర్పడే శారీరక వైకల్యాలను గుర్తించడానికిగాను ఆకార్ ఆశా హాస్పిటల్ వైద్యులు ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. లోపాలున్నవారికి ఆకార్ ఆస్పత్రిలో ఉచిత శస్త్ర చికిత్సలు సైతం చేయనున్నారు. రోగితోపాటు సహాయకులకు ఉచిత బస, ఆహారం ఏర్పాటు చేస్తారు. నిరుపేద, అర్హులైన రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీపీ డి.కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భరోసా కేంద్ర ఫోన్ నెం.040–27852500, మెయిల్ ఐడీ (bharosahydpolice@gmail. com), ఆకార్ ఆశ హెల్ప్ లైన్ నెం.040–48215050ల్లో సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

బోడుప్పల్ మేయర్ అవిశ్వాసంపై స్టే రద్దు

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ చెందిన కార్పొరేటర్లు మేయర్, డిప్యూటీ మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఇచ్చిన స్టేను గురువారం హైకోర్టు కొట్టివేసింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన 21 మంది కార్పొరేటర్లు మే 21వ తేదీన మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్‌పై అవిశ్వాస తీర్మానానికిగాను మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు నోటీసు ఇచ్చారు. దీంతో కలెక్టర్ అవిశ్వాస తీర్మానానికి జూన్ 6వ తేదీ షెడ్యూల్ కేటాయించారు. అయితే అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నిబంధనలు పాటించలేదంటూ మేయర్ బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ లక్ష్మీరవిగౌడ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు జూన్ 12వ తేదీ వరకు హైకోర్టు స్టే విధించింది. దీంతో ఈ నెల 6న జరగాల్సిన అవిశ్వాస తీర్మానం రద్దు అయింది. మేడ్చల్ జిల్లా కలెక్టర్, కాంగ్రెస్ పార్టీ నేతలు మళ్లీ కోర్టును ఆశ్రయించి స్టేను గురువారం రద్దు చేయించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అవిశ్వాస తీర్మానానికి షెడ్యూలు ప్రకటించాల్సి ఉంది.

స్ఫూర్తిదాయకంగా నిలవాలి

పారాస్పోర్ట్స్ శిబిరంలో సైబరాబాద్ సీపీ అవినాష్



పారా స్పోర్ట్స్ విద్యార్థుల ఎంపిక, శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులతో గోపాలకృష్ణ, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, సినీ హీరోయిన్ రెజీనా

రాయదుర్గం: పారా స్పోర్ట్స్ క్రీడాకారుల విజయాలు పిల్లలకు స్ఫూర్తిదాయకం కావా లని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్, జవహర్ నవోదయ విద్యాలయ సమితి సంయుక్త ఆధ్వర్యంలో గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా క్యాంపస్‌లో నిర్వహిస్తున్న అతిపెద్ద పారా స్పోర్ట్స్ శిబిరాన్ని ఆయన సినీ హీరోయిన్ రెజీనా కసాండ్రాతో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికలాంగ పిల్లల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ఆదిత్య మెహతా ఫౌండేషన్, జవహర్ నవోదయ విద్యాలయ సమితి సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించి దేశం గర్వపడేలా చేయా లని రెజీనా కసాండ్రా సూచించారు. ఆదిత్య మెహతా ఫౌండేషన్ కోచ్, వ్యవస్థాపకుడు ఆదిత్య మెహతా మాట్లాడుతూ యూత్ ఏషియన్ గేమ్స్–2025, పారా ఒలింపిక్స్–2028లో మనదేశానికి 100కిపైగా పతకాలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ, ఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ టి. గోపాలకృష్ణ, జేఎన్‌వీ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, కోచ్‌లు, విద్యా ర్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఎంపిక, శిక్షణ కార్యక్రమంలో గోపాలకృష్ణ, అవినాష్‌మహంతి, రెజీనా



శిబిరంలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థి

బక్రీద్‌కు భారీ బందోబస్తు



చార్మినార్: బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవడం కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ నెల 17వ తేదీన బక్రీద్ పండుగను పురస్కరించుకొని సాలార్జంగ్ మ్యూజియంలో గురువారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్, జలమండలి, జీహెచ్‌ఎంసీ, పోలీస్ తదితర ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పండుగ సందర్భంగా అన్ని వర్గాల వారు పోలీసులకు సహకరించాలని, చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదన్నారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఆమ్రపాలి, నగర అదనపు పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) విక్రమ్ సింగ్ మాన్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ అదనపు పోలీసు కమిషనర్ వి.సత్యనారాయణ, మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

'ఫ్లో'.. అత్యాధునిక బస్సు



బస్సులో ఉన్న సాంకేతిక వ్యవస్థను చూపుతున్న దృశ్యం

పంజగుట్ట: ఇంజనీరింగ్ చేసిన 18 మంది విద్యార్థులు అత్యాధునిక బస్సును తయారు చేశారు. బస్సు డీజిల్‌తో నడిచినా, అందులోని టెక్నాలజీకి మాత్రం సౌరవిద్యుత్తే ఆధారం. ఈ బస్సుకు ది ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్(ఫ్లో) అనే నామకరణం చేశారు. ఫ్లో బస్సులో ఆధునిక సాంకేతితతో కూడిన సెన్సార్‌లు అనుసంధానించిన రోబోటిక్స్, ఏఆర్, వీఆర్, డ్రోన్ టెక్నాలజీ, 3డీ ప్రింటింగ్, 3డీ హోలోగ్రామ్, మొబైల్ ప్లానిటోరియం ఏర్పాటు చేశారు. బస్సును ఈ నెల 10న రవీంద్రభారతిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించగా, గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో దానిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏడోధ్వజ ఫౌండేషన్ వ్యవస్థాపక సీఈవో మధులాష్ బాబు మాట్లాడుతూ ఈ బస్సును ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వద్దకు తీసుకువెళ్లి టెక్నాలజీ గురించి వివరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ కె.ప్రసన్న మౌనిక, కె.వికాస్ పాల్గొన్నారు.

తట్టుకోవాలి.. తలెత్తుకోవాలి..

– ట్రాన్స్‌జెండర్ల వివక్షపై బ్రిటీష్ డిప్యూటీ హైకమీషనర్



పేపర్ ప్లేట్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న బ్రిటీష్ డిప్యూటీ హైకమీషనర్ గరెత్ విన్ ఒవెన్

అడ్డగుట్ట: ట్రాన్స్‌జెండర్లు వివక్షను తట్టుకొని, తలెత్తుకొని బతకాలని బ్రిటీష్ డిప్యూటీ హై కమీషనర్ గరెత్ విన్ ఒవెన్ అన్నారు. హైదరాబాద్ ఆర్చ్ డయోసిస్ సోషల్ సర్వీస్ సొసైటీ(హస్స్) ఆధ్వర్యంలో మిజీరియల్ సహకారంతో గురువారం లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో ప్రేమలీల అనే ట్రాన్స్‌జెండర్‌కు ఉచితంగా అందజేసిన పేపర్ ప్లేట్ మేకింగ్ మెషీన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గరెత్ విన్ మాట్లాడుతూ అణచివేతకు గురవుతున్న వర్గాలకు తోడుగా ఉంటూ, వారి జీవనోపాధి కోసం కృషి చేస్తున్న హస్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదాను ఆంథోనిని అభినందించారు. 'సహాయం పొందడం దీనుల హక్కు' అని, ట్రాన్స్‌జెండర్లు స్వశక్తితో నిలబడాలనే ఉద్దేశంతో ఇప్పటి వరకు జ్యూట్ బ్యాగ్, కుట్టు మెషీన్‌లు అందించామని మాదాను ఆంథోని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ఎకానమీ అడ్వైజర్ నళిని, ట్రాన్స్ కమ్యూనిటీ లీడర్ వైజయంతి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా రాకెట్‌కు చెక్

పోలీసులకు పట్టుబడిన ముగ్గురు నిర్వాహకులు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

పంజగుట్ట: వ్యభిచారం, మనుషుల అక్రమ రవాణా రాకెట్‌ను వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకుని ఇద్దరు ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లు,కస్టమర్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 89.500 నగదు, 2 కార్లు, 3 ద్విచక్ర వాహనాలు, 2 ల్యాప్‌ట్యాప్స్, 2 ట్యాబ్‌లు, 45 వివిధ బ్యాంకుల డెబిట్, క్రెడిట్ కార్డులు, 13 బ్యాంకు పాస్‌బుక్‌లు, 25 ఆధార్ కార్డులు, 7 పాన్ కార్డులు, ఒక చెక్‌బుక్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన కె.సూర్యకుమారి అలియాస్ వర్ష అలియాస్ అంజలి అలియాస్ కుమారి అలియాస్ రాణి(38) అమీర్‌పేట, మధురానగర్‌లో నివాసం ఉంటోంది. ఆమె పాత నేరస్థురాలు. ఆమెకు తెలుగు రాష్ట్రాల్లో 16 కేసులతో ప్రమేయం ఉంది. 2020లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తుంటే రాచకొండ పోలీసులు సూర్యకుమారిపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, త్రిపుర, వివిధ రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకువచ్చి వెస్ట్‌జోన్ పరిధిలోని వివిధ లాడ్జీల్లో, తన ఇంట్లో ఉంచుకుంటుంది. తిరుపతికి చెందిన కె.విజయశేఖర్‌రెడ్డి (49) అమీర్‌పేట, మధురానగర్‌లో ఉంటూ ఆన్‌లైన్ వేదికగా కస్టమర్లను సంప్రదించి వారుండే లాడ్జీలకు మహిళలను పంపించేవాడు. పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పార్క్ హోటల్‌లో ఓ గదిలో వ్యభిచారం జరుగుతుందని పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి బాధితురాలిని, మణికొండకు చెందిన కె.కీర్తితేజ (29)ని అదుపులోకి తీసుకున్నారు. అన్ని స్థావరాలపై దాడులు నిర్వహించి సూర్యకుమారి, కె.విజయశేఖర్‌రెడ్డి, సబ్ ఆర్గనైజర్లు పశ్చిమబెంగాల్‌కు చెందిన అర్కోజిత్ ముఖర్జీ(24), తిరుపతికి చెందిన వేణుగోపాల్ బాలాజీ (50)లను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న డెబిట్, క్రెడిట్ కార్డులు

అత్యున్నత నగరాలతో పీర్జాదిగూడ పోటీ

కర్ణాటక 5వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ నారాయణ స్వామి



పీర్జాదిగూడలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల చాయాచిత్రాలతో కూడిన టేబుల్‌బుక్‌ను సభ్యులకు అందిస్తున్న మేయర్

మేడిపల్లి: పట్టణ స్థానిక సంస్థలు, పంచాయతీ రాజ్ సంస్థ ఆర్థిక స్థితిగతుల సమీక్ష, విభజన, వనరుల కేటాయింపుపై ఏర్పాటు చేసిన కర్ణాటక 5వ ఫైనాన్స్ కమీషన్ బృందం సభ్యులు గురువారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్యటించారు. మేయర్, కమిషనర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం కర్ణాటక 5వ ఫైనాన్స్ కమీషన్ చైర్మన్ డా.సి.నారాయణస్వామి మాట్లాడుతూ అభివృద్ధిపరంగా దేశంలోని అత్యున్నత స్థాయి నగరాలతో పీర్జాదిగూడ పోటీపడుతోందని కితాబు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మొహమ్మద్ సనాహుల్లా, వాహబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ కాన్సులేట్‌లోకి వెళ్లకుండా అడ్డగింత

నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్‌లోకి వెళ్లి వినతి పత్రం అందజేయడానికి యత్నించిన నలుగురిని గచ్చిబౌలి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. టార్గెటెడ్ ఇండివిడ్యువల్స్ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు వినతిపత్రాన్ని ఇవ్వాలని నిర్ణయించుకొని అమెరికన్ కాన్సులేట్ సమీపంలోని ఒక హోటల్‌లో ఉండగా గచ్చిబౌలి పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనుమతి లేనిదే అమెరికన్ కాన్సులేట్‌కు వెళ్లనిచ్చేది లేదని స్పష్టం చేశారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అమెరికాలోని భారతీయులను న్యూరో వెపన్స్ ద్వారా నిఘా విభాగాలు వేధింపులకు గురిచేస్తున్నాయని ఆ సంస్థ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై వినతిపత్రాన్ని అందించి భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని కోరుకున్నామని తెలిపారు. కానీ, పోలీసులు అదుపులోకి తీసుకోవడం పట్ల సంస్థ కన్వీనర్ రావి తరుణ్ నిరసన అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఏఐపై హ్యాకథాన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

– ముగ్గురు విజేతలకు రూ.10 లక్షల నగదు బహుమతి

సాక్షి, సిటీ బ్యూరో: బ్యాంక్ ఆఫ్ బరోడా మైక్రోసాఫ్ట్‌ తో కలిసి జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(జెన్ ఏఐ)పై దేశవ్యాప్త ఆన్‌లైన్ హ్యాకథాన్ ప్రారంభించిందని ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ ముదలియార్, మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆవిష్కరణలతో బ్యాంకింగ్ రంగంలో అందరికంటే ముందుండటానికి బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు https://bobhackathon. com వెబ్‌సైట్ ద్వారా హ్యాకథాన్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ నెల 27 వరకు దరఖాస్తులు పంపాలని, మొదటి బహుమతి రూ. 5 లక్షలు, ద్వితీయ బహుమతి రూ. 3 లక్షలు, తృతీయ బహుమతి రూ. 2 లక్షల నగదు అందిస్తామని పేర్కొన్నారు.

లంచాల ఇన్‌స్పెక్టర్ పరుగో పరుగు!

ఏసీబీ అధికారులకు పట్టుబడిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: నేరాలకు అడ్డుకట్ట వేయాల్సిన హైదరాబాద్ నగర నేర పరిశోధన విభాగం(సీసీఎస్) వాటికే అడ్డాగా మారింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీపీ ఉమామహేశ్వరరావు గత నెలలో అరెస్టు కాగా, తాజాగా అందులోని ఎకనమికల్ అఫెన్సెస్ టీమ్–7 (ఈఓడబ్ల్యూ) ఇన్‌స్పెక్టర్ చామకూరి సుధాకర్ రూ.3 లక్షలు లంచం తీసుకుంటూ గురువారం పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులను చూసి పరుగు అందుకోగా అతడిని పట్టుకుని అరెస్టు చేశారు. వివరాలు... సికింద్రాబాద్‌లోని ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన మణి రంగస్వామిపై సీసీఎస్‌లో ఈ ఏడాది ఓ కేసు నమోదైంది. నకిలీపత్రాలతో రూ.1.50 కోట్ల విలువైన విల్లా విక్రయిస్తున్నారనేది ప్రధాన అభియోగం. దీన్ని ప్రస్తుతం టీమ్–7 ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సుధాకర్ దర్యాప్తు చేపట్టాడు. ఈ కేసును రంగస్వామికి అనుకూలంగా ముగింపు పలుకుతానంటూ సుధాకర్ ఆయనతో బేరసారాలకు దిగాడు. దీని కోసం రూ.15 లక్షలు లంచం డిమాండ్ చేసి అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు తీసుకున్నాడు. తాజాగా మరో రూ.5 లక్షలు ఇవ్వాల్సిందిగా వేధించసాగాడు. లేదంటే కేసు మొత్తం తిరిగదోడతానని, తీవ్రమైన అభియోగాలతో చార్జ్‌షీట్ దాఖలు చేసి కటకటాల్లోకి పంపుతానని బెదిరించాడు.

వేధింపులు తాళలేక..

ఇన్‌స్పెక్టర్ వేధింపులు తాళలేకపోయిన రంగస్వామి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారులు కేసు నమోదు చేసి ఆధారాలు సేకరించారు. ఈ క్రమంలో గురువారం లంచం సొమ్ము ఇవ్వాల్సిందిగా సుధాకర్ నుంచి రంగస్వామికి వర్తమానం వచ్చింది. ఆయన ఈ విషయం ఏసీబీ అధికారులకు చెప్పడంతో ట్రాప్‌కు రంగం సిదమైంది. అవినీతి నిరోధక శాఖ హైదరాబాద్ సిటీ యూనిట్–2 డీఎస్పీ గంగసాని శ్రీధర్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ సతీష్, కానిస్టేబుళ్లు మున్నా, గోవింద్‌నాయక్, హరికాంత్ రెడ్డి రంగంలోకి దిగారు. రంగస్వామి గురువారం సాయంత్రం రూ.3 లక్షలు తీసుకుని బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ వద్దకు వెళ్లి సుధాకర్‌ను సంప్రదించగా కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో వేచి ఉండాలని చెప్పాడు. సాయంత్రం 6.10 గంటల సమయంలో సుధాకర్ అక్కడికి వచ్చి లంచం డబ్బులను తన బ్యాగ్‌లో పెట్టించాడు. ఆ సమీపంలో మాటువేసిన ఏసీబీ అధికారులను గుర్తించి బ్యాగ్‌ను అక్కడే పడేసి పరుగు లంకించుకున్నాడు. అతడిని కొద్దిదూరం వెంబడించిన ఏసీబీ అధికారులు ఎట్టకేలకు పట్టుకుని సీసీఎస్ కార్యాలయానికి తరలించారు. సుధాకర్‌ను అరెస్టు చేసి, అతడి చాంబర్‌లో సోదాలు చేసి కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సుధాకర్‌ను శుక్రవారం ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు. మరోపక్క ఏసీబీ బృందం అతడి ఇంట్లో సోదాలు ప్రారంభించింది.

జల్సాలకు అలవాటు పడి.. డ్రగ్స్‌తో పట్టుబడి..



పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ ప్యాకెట్‌లు, నగదు

మైలార్‌దేవ్‌పల్లి: జల్సాలకు అలవాటుపడి డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి డ్రగ్స్, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ పైడినాయుడు తెలిపిన వివరాల ప్రకారం... శాస్త్రీపురం ప్రాంతానికి చెందిన ఏసీ మెకానిక్ అబ్దుల్ సోహైల్ (25), సయ్యద్ నవాజ్ (19) అనే విద్యార్థి స్నేహితులు. జల్సాలకు అలవాటు పడి పక్కదారి పట్టారు. బుధవారం ఎంఎస్ గార్డెన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లారు. వారిని చూడగానే పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొని విచారించారు. వారి వద్ద ఉన్న బ్యాగులో 4.7 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, రూ.44 వేల నగదు, మూడు సెల్ ఫోన్‌లు లభించాయి. కొన్ని రోజులుగా హ్యాష్ ఆయిల్ వ్యాపారం చేస్తున్నామని చెప్పారు. హ్యాష్ ఆయిల్‌ను వైజాగ్‌కు చెందిన వెంకట్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి ముంబై క్రాఫ్‌ఫోర్డ్ మార్కెట్‌లోని ఓవైసి, అక్బర్ అనే వ్యక్తులకు ఎక్కువ ధరకు విక్రయిస్తామని, వారి నుంచి ఎండీఎంఏ డ్రగ్స్‌ను కొనుగోలు చేశామని నిందితులు చెప్పారు.

నగర శివారులో 'ధార్' ముఠా సంచారం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ



ఇబ్రహీంపట్నం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ధార్ ముఠా దోపిడీలు చేసేందుకు నగర శివారు ప్రాంతాల్లో సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐదు నుంచి ఆరుగురితో కూడిన ఈ ముఠాలు లాడ్జిల్లో ఉంటూ పగటిపూట ఆటోల్లో రెక్కీ నిర్వహించి రాత్రి పూట దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతుంటాయని తెలిపారు. ఈ భయంకరమైన ముఠా నగరశివార్లలో సంచరిస్తున్నట్లు అనవాళ్లతోపాటు స్పష్టమైన సమాచారం ఉందన్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లు, పట్టణ శివారు ప్రాంతాల్లోని ఆవాసాలు, విల్లాలు, అపార్ట్‌మెంట్లను ఈ ముఠా టార్గెట్ చేస్తుందని తెలిపారు. మెయిన్ గేట్ వద్ద శబ్దం కాకుండా ప్రహరీ దూకి వచ్చి డోర్ కొడుతారని, తలుపులు తెరిస్తే.. ఇంట్లోని వ్యక్తులపై దాడిచేయడంతో పాటు చంపేందుకు వెనకాడరన్నారు. అందినంత మేర బంగారు నగలు, నగదు దోచుకెళ్తారని చెప్పారు. రాత్రి వేళ ఎవరు తలుపులు కొట్టినా నిర్ధారించుకోకుండా తీయొద్దని, అనుమానం ఉంటే కిటికీలోంచి గమనించాలని, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై పోలీసుల ఫోకస్

- ప్రజలు భాగస్వామ్యం కావాలని వినతి
- తొలుత సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు
- బోరబండ పీఎస్ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ భూపాల్‌గౌడ్



రహమత్‌నగర్: అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ఫుటేజీలు కీలకంగా మారుతాయని, సీసీ కెమెరాలు ఏర్పాటులో ప్రజలు భాగస్వామ్యం కావాలని బోరబండ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ భూపాల్‌గౌడ్ సూచించారు. బోరబండ పీఎస్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ... విస్తృత పరిధి కలిగి సమస్మాత్మక ప్రాంతలు అధికంగా ఉన్న బోరబండ పోలీస్‌స్టేషన్ పరదిలో 90 సీసీ ఉన్నాయన్నారు. వాటికి మరింత పెంచే ప్రయత్నంలో పోలీసులకు స్థానికులు సహకరించాలని కోరారు. వ్యాపార కేంద్రాల వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై సెక్టార్ల వారీగా ప్రజలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటికే స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రధానంగా రహదారుల పక్కన ఉన్న వ్యాపార కేంద్రాల యాజమానులు తమ దుకాణాల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే వారి దుకాణాలకు రక్షణగా ఉండటమే కాకుండా ఏదైనా జరగరాని సంఘటన జరిగినప్పుడు నిందితులను పట్టుకోవడంలో పోలీసులకు సహకరించిన వారవుతారని అన్నారు. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై మొదట తాము దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. ఎస్పీఆర్ హిల్స్ క్వారీ గుట్టల్లో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్న దృష్ట్యా గుట్టల్లోకి వెళ్లే దారి వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారితో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ భూపాల్‌గౌడ్ వివరించారు.

డ్రైనేజీ మ్యాన్‌హోళ్లపై రెడ్‌మార్క్ వేస్తున్న జలమండలి సిబ్బంది



మ్యాన్‌హోల్ మూత కింద ఏర్పాటు చేసిన సేఫ్టీ గ్రిల్స్





హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

లోతైన మ్యాన్‌హోల్ ఉంది..

పారాహుషార్!

- మూతలపై రెడ్‌మార్క్‌లతో అలర్ట్
- వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు
- ప్రతి మ్యాన్‌హోల్ మూత వద్ద జాగ్రత్తలతో కూడిన సూచికలు

బంజారాహిల్స్: వర్షాకాలం నేపథ్యంలో వరదనీటిలో జలమండలి డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతలు తెరవకుండా ఇక్కడ లోతైన మ్యాన్‌హోల్ ఉంది.. అంటూ హెచ్చరికలు జారీ చేస్తూ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జలమండలి వర్షాకాలానికి మూడు వారాల ముందే మేల్కొని ఎక్కడెక్కడ లోతైన మ్యాన్‌హోళ్లు ఉన్నాయో వాటిని గుర్తించారు. అంతేకాకుండా వరదలు వచ్చినప్పుడు ఆ మ్యాన్‌హోళ్ల వద్ద జాగ్రత్తగా వెళ్లాలంటూ మూతలపై రెడ్‌మార్క్ వేయడమే కాకుండా అక్కడ ప్రమాదం పొంచి ఉంది అనే జాగ్రత్తలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

- జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఒకటిన్నర మీటర్ల లోతు పైగా ఉన్న 1200 మ్యాన్‌హోళ్లను అత్యంత లోతైనవిగా గుర్తించారు.
- మ్యాన్‌హోల్ మూతల కింద పొరపాటున ఎవరైనా కాలు వేసినా జారిపోకుండా బ్లూకలర్ సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఈ మ్యాన్‌హోల్ లోతైనవి అని తెలియజేసేందుకు మూతలపై ఎరుపు రంగుతో మార్క్‌లు వేసి అలెర్ట్ చేస్తున్నారు.
- ఇప్పటికే 800లకు పైగా మ్యాన్‌హోళ్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎరుపు రంగు కలర్ కూడా వేయడం పూర్తి చేశారు.
- డివిజన్–6 పరిధిలో మొత్తం 33 వేల మ్యాన్‌హోళ్లు ఉండగా ఇందులో 1200 మాత్రమే లోతైనవని, అందుకే వీటి వద్ద జాగ్రత్తలు సూచిస్తున్నట్లు జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు.



దివ్యశక్తి అపార్ట్‌మెంట్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సోమాజిగూడ డీజీఎం వంశీకృష్ణ

జీహెచ్‌ఎంసీ మేల్కొనదా..?

జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ పరిధిలో వరదనీరు వెళ్లే మ్యాన్‌హోళ్లు వేలల్లో ఉన్నాయి. సంబంధిత అధికారులు మాత్రం సదరు మ్యాన్‌హోళ్ల వద్ద ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.

- గతంలో వరదనీటితో పాటు నాలాల్లో కొట్టుకుపోయి పౌరులు మృతి చెందిన ఘటనలు వెలుగుచూసినా జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లలో మాత్రం స్పందన లేకుండాపోయింది.
- జీహెచ్‌ఎంసీకి సంబంధించిన వరదనీటి మ్యాన్‌హోళ్లు లోతైనవి వేలల్లో ఉండగా అవి ఎక్కడెక్కడ ఉన్నాయో సంబంధిత ఇంజినీర్లకే తెలియని పరిస్థితి నెలకొంది.
- వర్షాకాలం కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంలో, అమలుచేయడంలో జలమండలి ముందుండగా, జీహెచ్‌ఎంసీకి మాత్రం తీరుబడి లేకుండాపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఖాజానగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం



శంకుస్థాపన చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఖాజానగర్ బస్తీలో రూ. 3.05 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన 100ఎంఎం డయా మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు గురువారం గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... బస్తీలో మంచినీటి సమస్య గత కొంతకాలంగా స్థానికులను ఇబ్బంది పెడుతుందని, ఈ నేపథ్యంలో నిధులు మంజూరు చేయించినట్లు ఆమె తెలిపారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. వాటర్ పైప్‌లైన్ పూర్తయితే స్థానికంగా మంచినీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

కేంద్ర మంత్రులకు శుభాకాంక్షలు





శ్రీనగర్‌కాలనీ: కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను గురువారం బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇంచార్జ్ లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కొలన్ సత్యనారాయణలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



దోమల మందు చల్లిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

వెంగళరావునగర్: వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆమె ఎంటమాలజీ శాఖ సిబ్బందితో పర్యటించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం రూపొందించిన కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. క్రమం తప్పకుండా చెత్త నిల్వ ఉండే ప్రాంతాలు, నీటి మడుగులు, డ్రైనేజీల్లో దోమల మందును పిచికారీ చేయాలని సూచించారు. ప్రజలకు ఈ విషయంలో అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఎంటమాలజీ సిబ్బందితోపాటు బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బీజేఆర్‌నగర్ బస్తీ పాఠశాలకు కొత్త భవనాన్ని నిర్మించాలి

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని, ఈ బిల్డింగ్‌ను పునఃనిర్మించాలని బీజేఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.యాదగిరి, జనరల్ సెక్రటరీ దామోదర్ తదితరుల ఆధ్వర్యంలో బస్తీవాసులు గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. వరదనీరు, మురుగునీరు ఈ పాఠశాల భవనంలోకి చేరడంతో పూర్తిగా భూమిలోకి కుంగిపోయిందన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇకనైనా ఈ పాఠశాల భవన నిర్మాణం చేపట్టడం వల్ల ఎంతోమంది విద్యార్థులకు మేలు చేకూరుతుందన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేఆర్‌నగర్ బస్తీవాసులు

పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి డిమాండ్

హిమాయత్‌నగర్: జీవో నెం.1ను ఉల్లంఘిస్తూ పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, స్టేషనరీలను పాఠశాలలో విక్రయిస్తున్న హిమాయత్ నగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తున్న పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గౌతమ్ మోడల్ స్కూల్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ పోరాటంతో గౌతమ్ మోడల్ స్కూల్ పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయిస్తున్న గదిని హైదరాబాద్ జిల్లా డిప్యూటీ విద్యాశాఖాధికారి విజయలక్ష్మి సీజ్ చేశారు. ఈ నెల 4వ తేదీన సదరు పాఠశాలకు అధికారులు వచ్చి సర్వే నిర్వహిస్తే, తమ పాఠశాలలో ఎటువంటి అమ్మకాలు జరపడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ... హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా తక్షణమే అన్ని పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని, నిబంధనలను ఉల్లంగిస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

'స్వచ్ఛత'పై అవగాహన

హిమాయత్‌నగర్: స్వచ్ఛ హిమాయత్‌నగర్ సాధన కార్యక్రమంలో భాగంగా హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ ప్రజలకు అవగాహన కల్పించారు. గురువారం విట్టల్ వాడీ, ఆయిల్ సీడ్స్ కాలనీ, ఇతర ప్రాంతాల్లో పబ్లిక్ ఏరియాలలో చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్‌గౌడ్, హెల్త్ ఆఫీసర్ హేమలత, మహేష్, శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

రహమత్‌నగర్: తమ బస్తీలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించాలని హనుమాన్ స్టోన్ కట్టర్స్ కాలనీ ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీ నాయకులు రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డికి గురువారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బస్తీ అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ... తమ బస్తీలో డ్రైనేజీ, సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు నివేదికలు రూపొందించి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదని విచారం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన దృష్ట్యా పనులకు నిధులు మంజూరు చేయించాలని ఆయన కోరారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్‌లోని అన్ని బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని వెల్లడించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. బస్తీ నాయకులు చెన్నయ్య, కృష్ణాచారి, వెంకటేశ్, దశరథ్, భరత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బస్తీ నాయకులు



బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి



హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలోని కురుమ సామాజికవర్గ ప్రతినిధి బీర్ల అయిలయ్యకు రాష్ట్ర మంత్రివర్గంలోకి తక్షణమే తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని తెలంగాణ కురుమ రాజకీయ జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జేఏసీ నేత జక్కుల వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణతో కలిసి వంశీకృష్ణ మాట్లాడారు. కుల ప్రాతినిధ్యం లేకుండా దేశంలో దాదాపు ఏ మంత్రివర్గం లేదన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన బెల్లిలలితది కురుమ సామాజిక వర్గమే అని, అదే ప్రాంతానికి, కులానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీర్ల అయిలయ్యకు తక్షణమే మంత్రి పదవి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేశ్ యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ కురుమ, జేఏసీ నాయకులు గొరిగె మల్లేశ్, రఘునాథ్, కొంగల పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా కోడ్ అమల్లోకి తీసుకురావాలి



మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం జాతీయ క్రీడా కోడ్‌ను వెంటనే అమల్లోకి తీసుకురావాలని తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ టోర్నమెంట్ జరిగిన సంబంధిత క్రీడల్లో గుర్తింపు కలిగిన రాష్ట్ర, జిల్లా క్రీడా సంఘాల అనుమతితోనే జరిగాయని గుర్తు చేశారు. ఇష్టారాజ్యంగా టోర్నమెంట్‌లు పెడుతూ క్రీడాకారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్ రాష్ట్రీయ క్రీడా పోటీల పేరుతో కొంత మంది లక్షల్లో డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. క్రీడలపై అవగాహన లేని తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ పనికి రాని ఆటలు ఆడించి ఆ తరువాత బాధ పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. క్రీడా రంగాన్ని కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలోకి తెచ్చేలా ప్రభుత్వం క్రీడా ప్రణాళికలను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్(టీఓఏ)ని ప్రక్షాళన చేసి, క్రీడా సంఘాలు ఏర్పడేలా చూడాలన్నారు. క్రీడా సంఘాలన్నింటికి సముచిత స్థానం కల్పించేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేష్, ప్రతినిధులు లక్ష్మణ్, తిరుమల్ రెడ్డి, విజయ్ కుమార్, సురేందర్, సంజయ్ కుమార్, సి.పుల్లయ్య పాల్గొన్నారు.



రెజుమ్ థెరపీతో మూత్రనాళంలో బ్లాకేజీకి చెక్

విజయవంతం చేసిన యశోద ఆస్పత్రి వైద్యులు



రెజుమ్ థెరపీ చేయించుకున్న రోగి అంజా గౌడ్‌తో యశోద వైద్యనిపుణులు

లక్డీకాపూల్/పంజగుట్ట: ప్రొస్టేటిక్ అబ్‌స్ట్రక్షన్ (మూత్రనాళంలో బ్లాకేజ్) సమస్యకు రెజుమ్ థెరపీతో యూరాలజీ వైద్యులు రిలీఫ్ కల్పించారు. వైద్య రంగంలో ఇప్పటికే ఎన్నో అత్యాధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా ఎంతో మంది ప్రాణాలను వైద్య నిపుణులు కాపాడుతున్నారు. ఈ క్రమంలో కొన్ని వారాలుగా మూత్ర విసర్జన సమయంలో విపరీతమైన నొప్పి, అసౌకర్యానికి లోనవుతున్న 68 ఏళ్ల రైతుకు యశోద వైద్యులు రెజుమ్ వాటర్ వేపర్ థెరపీతో ఉపశమనం కల్పించారు. కామారెడ్డికి చెందిన అంజాగౌడ్‌కి గత నెల 28న చికిత్స చేశామని, శస్త్ర చికిత్సకు ఇష్టపడని రోగులకు ఈ ప్రక్రియ ఉత్తమ ప్రత్యామ్నాయమని సోమాజిగూడలోని యశోద ఆస్పత్రి సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ వి.సూర్యప్రకాష్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియతో మూత్రనాళంలో ఏర్పడ్డ బ్లాక్‌లు తొలగి మూత్రనాళానికి ఒత్తిడి తగ్గడంతో రోగి ఉపశమనం పొందుతారని.. అంజాగౌడ్ విషయంలో ఇదే జరిగిందన్నారు. డే–కేర్ ట్రీట్‌మెంట్‌కు అనుకూలమైన ఈ ప్రక్రియతో రోగి చికిత్స చేసిన రోజే ఇంటికి వెళ్లవచ్చని డాక్టర్ సూర్య ప్రకాష్ తెలిపారు.

అవిశ్రాంత రైతు ఉద్యమ నేత అతుల్‌కుమార్ అంజాన్

అఖిల భారత కిసాన్ సభ

హిమాయత్‌నగర్: రైతుల పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర లభించే విధంగా మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు రుణ విమోచన చట్టాలను సాధించుకున్నప్పుడే అవిశ్రాంత రైతు ఉద్యమ నాయకులు, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత అతుల్ కుమార్ అంజాన్‌కు మనమిచ్చే ఘన నివాళి అవుతుందని రైతులు సంఘాల నాయకులు, వ్యవసాయ రంగ శాస్త్రవేత్తలు అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బుధవారం సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు, అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి దివంగత అతుల్ కుమార్ అంజాన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త రావుల వెంకయ్య మాట్లాడుతూ... రైతు ఉద్యమ నాయకులు అతుల్ కుమార్ అంజాన్ మరణం భారత రైతాంగంతో పాటు ఏఐకేఎస్ తీరని లోటు అన్నారు. రైతుల సమస్యలను తేట తెల్లంగా పరిష్కరించడంతో, అందుకు కావాల్సిన కార్యచరణను రూపొందించడంలో అతుల్‌కుమార్ అంజాన్ మించిన నాయకుడు లేడని కొనియాడారు. ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, వ్యవసాయ రంగ శాస్త్రవేత్తలు సోమ మర్ల, దొంతి నర్సింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, ఆఫీస్ బేరర్లు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పలువురు రైతులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష





నిందితులు బస్వంత్ కుమార్, నాగేందర్

హిమాయత్‌నగర్: హత్య కేసులో ఇద్దరికి కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలివీ... నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక చవితి నిమజ్జనం కోసం బీదర్‌కి చెందిన సంజూ అనే వ్యక్తి 2018లో విట్టల్ వాడిలోని తన అన్న శివాజీ ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటిపై సంజూ తన స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి యజమాని కొడుకు బస్వంత్ కుమార్, అతని స్నేహితుడు నాగేందర్‌లు వచ్చి విచక్షణ రహితంగా వారిని కొట్టి పై నుంచి కిందికి మెట్ల మీద నుంచి లాక్కొచ్చి రోడ్డుపై పడేసి కొట్టడం వల్ల బీదర్ నివాసి సంజూ హాస్పిటల్లో అడ్మిట్ అయి మృతిచెందాడు. ఈ కేసులో నిందితులైన బస్వంత్ కుమార్, నాగేందర్‌లను అరెస్టు చేసి విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో గురువారం నాంపల్లి కోర్టు న్యాయమూర్తి నిందితులిద్దరికీ పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 11 వేలు జరిమానా విధించారు.

ద్విచక్ర వాహనం చోరీ




వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... రహమత్‌నగర్‌కు చెందిన ఆర్.రమేష్ కాంట్రాక్టర్. ఈ నెల 11న తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి 12 ఉదయం బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో ఆటో...

వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్‌లో నివాసం ఉండే డి.శివకుమార్ ఆటో డ్రైవర్. ఈ నెల 11వ తేదీ రాత్రి తన ఆటోను ఇంటి ముందు పార్క్ చేశాడు. 12వ తేదీ చూడగా పార్క్ చేసిన ఆటో కనిపించలేదు. దీంతో గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు



శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 41, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 61, పచ్చ కాకర 45, పందిరి బీర 65, క్యాబేజ్ 21, క్యారెట్ 40, దొండ 26, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 45, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 25, రూట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 35, చామగడ్డ 40, మొరంగడ్డ 25, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి రూ. 4–5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

యువకుడి అదృశ్యం

కాచిగూడ: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బావను చూసేందుకు వచ్చిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి సమాచారం మేరకు... మంగళ్‌హాట్‌కు చెందిన రాజు(22) గత నెల 27వ తేదీన కాచిగూడలోని సాయికృష్ణ న్యూరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బావను చూసే నిమిత్తం ఇంటి నుంచి వచ్చాడు. తిరిగి రాలేదు. ఎంత వెతికినా అతని ఆచూకీ తెలియకపోవడంతో గురువారం రాత్రి బాధితుడి తల్లి అంజమ్మ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న ఆర్‌పీఐ సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జతారకం) ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను సాంబయ్య తెలిపారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ బి.సుదర్శన్, డాక్టర్ జిలకర శ్రీనివాస్ పాల్గొంటారన్నారు.

గ్యాస్ లీక్: తప్పిన ప్రమాదం

రహమత్‌నగర్: ఓ ఇంట్లో వంట గ్యాస్ లీక్ అయింది. సకాలంలో గ్యాస్ సిబ్బంది స్పందించడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన రహమత్‌నగర్ డివిజన్‌లో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఎస్పీఆర్‌హిల్స్ హనుమాన్‌స్టోర్ కట్టర్స్ కాలనీలో వేణు, లక్ష్మమ్మలు నివసిస్తున్నారు. వీరి ఇంట్లో గురువారం సాయంత్రం గ్యాస్ లీకయింది. స్థానికులు గ్యాస్ ఏజెన్సీకి ఫోన్ల ద్వారా సమాచారం అందించారు. దాదాపు రెండు గంటల పాటు గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చాయి. ముందు జాగ్రత్త చర్యగా మందపాటి బట్టలు కప్పారు. హెచ్‌పీ గ్యాస్ సిబ్బంది వచ్చి సిలిండర్ నుంచి గ్యాస్ రాకుండా బంద్ చేశారు. దాంతో మంటలు ఆగిపోయి ప్రమాదం తప్పింది. అయితే ఇంట్లోని విద్యుత్ వైర్లు, వస్తువులు కాలిపోయాయి.

ఆగని టీడీపీ ఉన్మాదం

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం

కనీస చర్యలు తీసుకోని ప్రభుత్వం

రెచ్చిపోతున్న టీడీపీ నాయకులు



పుంగనూరు మండలం పాలెంపల్లెలోని గ్రామ సచివాలయం శిలాఫలకాలు ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల్లో కూటమి విజయం తర్వాత టీడీపీ శ్రేణుల్లో చెలరేగిన ఉన్మాదం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై దాడుల రూపంలో కొనసాగుతూనే ఉంది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెంటనే మొదలైన ఈ దాడుల నియంత్రణకు ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయడంలేదు. దీన్ని ఆసరా చేసుకొని టీడీపీ శ్రేణులు మరింతగా రెచ్చి పోతు న్నాయి. గురువారమూ టీడీపీ శ్రేణులు పలు సచి వాలయాలు, ప్రభుత్వ స్థలాలపై దాడులు చేశాయి. శిలాఫలకాలు ధ్వంసం చేశాయి. బోర్డులు విరగ్గొట్టాయి.

- చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో బైరెడ్డిపల్లె, నగరి మండలాల్లోని పలు సచివా లయాల్లో ఉద్యోగులు విధి నిర్వహణలో ఉం డగానే టీడీపీ నాయకులు శిలాఫలకాలను ధ్వం సం చేశారు. పుంగనూరు మండలంలోని పాలెం పల్లి, భీమగానిపల్లి, బోడేవారిపల్లె సచివాల యాలకు, వెల్‌నెస్ సెంటర్లకు, ఆర్‌బీకెలకు, ఆర్‌వో ప్లాంటుకు, నాడు–నేడు స్కూల్ ప్రారం భించేందుకు వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫోటోలు ఉన్న శిలాఫలాకాలను గునపాలతో ధ్వంసం చేశారు. దీంతో సచివాలయ కార్యదర్శులు భయంతో పరుగులు తీశారు.
- బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెలో సచివాలయంలోని శిలాఫలకాలు, సంక్షేమ పథకాల బోర్డులను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. శిలాఫలకాలు తొలగించాలని ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు లేవని ఎంపీడీవో రాజేష్ చెప్పారు. కొంతమంది గ్రామీణ ప్రాం తాల్లో రెచ్చగొడుతూ శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.
- నగరి మండలం తెరణి గ్రామంలో సచివాలయ భవనంపై ఉన్న నవరత్నాల ఫలకాన్ని గురువారం టీటీడీ నాయకులు, కార్యకర్తలు తొలగించారు. భవనం ముందు ఉన్న ప్రారం భోత్సవ శిలాఫలకంపై పెయింట్ పూశారు. ఈ ఘటనపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసు లకు సమాచారం అందించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయ పట్నం గ్రామ సచివా లయం భవనంపై ఉన్న నవరత్నాల బోర్డును టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు.
- నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం లోని కల్వటాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మి నరల్ వాటర్ ప్లాంట్ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి చేశారు.
- బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వలాపల్లిలో 2017–2018లో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. 2019లో దానిపై మొదటి అంతస్తు నిర్మించి, సచివాలయం ఏర్పాటు చేశారు. ఈ సచివాలయం శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు.

కోర్టు ప్రాంగణంలోనే హత్యాయత్నం

- విజయవాడ సిటీ సివిల్ కోర్టుల ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం
- మూడు ఆటోల్లో వచ్చిన 15 మంది టీడీపీ కార్యకర్తలు
- వందలాది మంది చూస్తుండగానే రాడ్లు, బీరు సీసాలతో మద్దెల పవన్‌పై దాడి

నిబ్బరంతో నిలబడదాం

ఎమ్మెల్సీలతో సమావేశంలో వైఎస్ జగన్ దిశానిర్దేశం

ఆత్మస్థైర్యాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు.. భవిత మనదే



మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు

- కూటమికి ఓటేయలేదనే ఏకైక కారణంతో దాడులకు తెగబడి రావణకాష్టంలా మార్చారు
- కేంద్రంలో బీజేపీ 240 స్థానాలకే పరిమితమైంది
- ఇలాంటి పరిస్థితుల్లోనూ ప్రత్యేక హోదా అడగకుండా చంద్రబాబు పాపం చేశారు
- అసెంబ్లీలో ఏకైక ప్రతిపక్షమైన మనకు అవకాశం ఇస్తారా? అన్నది సందేహమే
- శాసన మండలిలో మీ పాత్ర కీలకం
- ప్రజల్లోనే ఉందాం.. ప్రజల కోసం పోరాడదాం

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం హనీమూన్ కాలం నడుస్తోంది. వాళ్లకు కొంత సమయం ఇద్దాం. దాడులకు గురైన మన కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపి ఆత్మస్థైర్యంతో నిలబడదాం'అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం తాడేప ల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'శాసనసభలో ఇప్పుడు మన సంఖ్యా బలం పెద్దగా లేదు. ఆ సభలో గొంతు విప్పే అవకాశం మనకు రాకపోవచ్చు. మనల్ని గొంతు విప్పనివ్వకపో వచ్చు. కానీ శాసన మండలిలో మనకు బలం ఉం ది. ప్రజల పక్షాన మీ పాత్ర మీరు సమర్థంగా పోషించాలి'అని ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. 'రాబోయే రోజుల్లో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు ముమ్మరం చేద్దాం. ప్రజల్లోనే ఉందాం. ప్రజలతో కలసి పోరాడే కార్యక్రమాలు చేపడదాం. గతంలో నేను ఏకంగా 14 నెలలు పాద యాత్ర చేశా. ఆ వయసు, సత్తువ నాకు ఈ రోజుకీ ఉన్నాయి'అని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఫలితాలు చూసి నిబ్బరం కోల్పోవద్దు..

ఈ ఫలితాలు చూసి మీరు నిబ్బరాన్ని కోల్పోవా ల్సిన అవసరం లేదు. జరిగిన పరిస్థితులన్నీ మీకు తెలుసు. గత ఐదేళ్లలో చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఏకంగా 99 శాతం వాగ్దానాలను అమలు చేశాం. ఏకంగా రూ.2.7 లక్షల కోట్లు ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా ప్రజలకు నేరుగా అందించాం. కానీ.. ఎన్నికల్లో ఏమైందో తెలియదు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లు ఇట్టే గడిచిపోయాయి. అదే మాదిరిగా 2024 నుంచి 2029 వరకు కూడా ఐదేళ్లు ఇట్టే గడు స్తాయి. మనం గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమి టంటే.. సినిమాలో ప్రస్తుతం ఫస్ట్ హాఫ్ మాత్రమే అయింది. గతంలో ఇదే మాదిరిగా పరిస్థితులు ఉన్నప్పుడు మనం ఎలా పైకి లేచామో మీ అందరికీ తెలిసిందే. మనం చేసిన మంచి ఇవాళ్టికీ ఉంది. ఇం టింటికీ మనం చేసిన మంచి బతికే ఉంది. మన పాలన మీద విశ్వసనీయత ప్రజల్లో ఇప్పటికీ ఉంది. మన పట్ల విశ్వసనీయత ఇంకా బతికే ఉంది. గడప గడపకూ మనం చేసిన మంచి ఇంకా బతికే ఉంది. ఇవన్నీ ఉన్నప్పుడు మళ్లీ మనం పైకి లేవడం అన్నది కూడా తథ్యం. కాకపోతే కొంత సమయం పడుతుం ది. ఆ సమయం మనం ఇవ్వాలి. ఆ టైం ఇచ్చిన ప్పుడు, వాళ్ల పాపాలు పండినప్పుడు కచ్చితంగా మనం పైకి లేస్తాం. ఈ విషయం ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి.

శిశుపాలుడి పాపాలు అప్పుడే మొదలయ్యాయి

మనల్ని ఎవరూ ఏమీ చేయలేరు. మహా అయితే ఇంకో నాలుగు కేసులు పెట్టగలుగుతారు. అంతకు మించి వాళ్లు ఏం చేయగలుగుతారు? చంద్రబాబు హయాంలో చాలా త్వరగా పాపాలు పండుతాయి. మన కళ్లముందే చంద్రబాబు పాపాలు ఎలా పండు తాయో గతంలో మనం అంతా చూశాం. మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కులం, మతం , ప్రాంతం, రాజకీయాలు చూడలేదు. చివరికి ఏ పార్టీకి ఓటు వేశారు అన్నది చూడకుండా ప్రతి పథ కాన్ని డోర్ డెలివరీ చేశాం. అర్హతే ప్రామాణికంగా ప్రతి పథకాన్ని ఇంటికే అందించాం. అలాంటి పాలన మనదైతే.. ఈ రోజు వాళ్ల పార్టీకి ఓటు వేయ కపోవడమే పాపం అన్నట్టుగా రావణకాష్టం సృ ష్టిస్తున్నారు. అమానుషంగా దాడులకు దిగు తున్నారు. అవమానిస్తున్నారు. ఇవన్నీ శిశుపాలుడి పాపాల మాదిరిగా మొదలయ్యాయి. వారు చేసిన పాపాలు ఊరికే పోవు.

హోదా అడక్కపోతే ఏ ఒక్క యువకుడూ క్షమించడు..

చంద్రబాబు రెండో పాపం కూడా అప్పుడే పండిం ది. కేంద్రంలో ఇప్పుడు నెలకొన్న రాజకీయ పరిస్థి తులు ఈ మధ్య కాలంలో ఎప్పుడూ లేవు. కేంద్రం లో బీజేపీ 240 సీట్లకే పరిమితం కావడం, మరో వైపు రాష్ట్రంలో టీడీపీకి మంచి ఎంపీ సీట్లు రావడం తో ఎన్‌డీఏలో కీలకంగా మారిన పరిస్థితులు నెలకొ న్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రత్యేక హోదా అడగకపోవడం చంద్రబాబు చేసిన మరో పాపం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రత్యేక హోదాను అడ గకుంటే రాష్ట్రంలో ఏ ఒక్క యువకుడూ క్షమించడు.

నైతిక విలువలు పాటిస్తారా?


అసెంబ్లీలో మనకున్న బలం ప్రకారం ప్రతి పక్ష హోదా ఇస్తారా? లేదా అన్నది సందే హమే. తమకు ఓటు వేయలేదన్న ఒకే ఒక్క కారణంతో మనుషుల మీద దాడులు చేస్తూ.. ఆస్తులకు నష్టం చేకూర్చి అవమాని స్తున్న పరిస్థితుల్లో.. ప్రతిపక్షంగా ఉన్న ఒకే ఒక్క పార్టీకి ఆ హోదా ఇవ్వాలన్న కనీస నైతిక విలువలు పాటిస్తారా? లేదా? అన్నది సందేహమే. అందుకే శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల పాత్ర కీలకం.

ఐదు సంతకాలు

బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు

16,347 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీపై మొదటి సంతకం

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్లు రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు



డీఎస్సీపై నిరుద్యోగుల సమక్షంలో తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమం త్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు గురువారం అమరావతిలోని సచివా లయం మొదటి బ్లాక్‌లో సాయంత్రం 4.41 గంట లకు వేద పండితుల పూజల అనంతరం బాధ్య తలు చేపట్టారు. ముఖ్యమంత్రి హోదాలో ఐదేళ్ల తర్వాత తొలిసారి వెలగపూడిలోని సచివాలయానికి వచ్చిన చంద్రబాబుకు రైతులు, మహిళలు సీడ్ యాక్సిస్ రోడ్డుకు ఇరువైపులా నిలబడి రహదారిపై పూలు చల్లి ఘనస్వాగతం పలికారు. వెంకటపాలెం వద్ద గజమాలతో స్వాగతించారు. సచివాలయం వద్ద ఉద్యోగులు, అధికారులు సీఎంను సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఆలిండియా సర్వీస్ అధికారులు, పలువురు మంత్రులు సీఎంని కలసి శుభాకాంక్షలు తెలిపారు. తొలి రోజు ఐదు ఫైళ్లపై సీఎం చంద్రబాబు సంత కాలు చేశారు. మొదటి హామీ అయిన మెగా డీఎస్సీపై నిరుద్యోగుల సమక్షంలో తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ల్యాండ్ టైటిలిం గ్ యాక్ట్‌ను రద్దు చేస్తామన్న రెండో హామీపై రైతుల సమక్షంలో సీఎం సంతకం చేశారు. సామాజిక పెన్షన్లు రూ.4 వేలకు పెంపు దస్త్రంపై లబ్ధిదారుల సమక్షంలో మూడో సంతకం చేశారు. అన్న క్యాం టీన్ల పునరుద్ధరణపై నాలుగో సంతకం, నైపుణ్య గణన దస్త్రంపై విద్యార్థుల సమక్షంలో ఐదో సంత కాన్ని పెట్టారు.


నగర వార్తలు

27 నుంచి రామకృష్ణ మఠంలో శౌర్య క్యాంప్



కవాడిగూడ: రామకృష్ణమఠంలో ఈ నెల 27 నుంచి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు గల యువతకు శౌర్య పేరిట మూడురోజులపాటు ప్రత్యేక క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు రామ కృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమ యానంద తెలిపారు. ఈ శిబిరంలో యువతకు స్వామి వివేకానంద సందేశం పై ప్రత్యేక తరగ తులు ఉంటాయన్నారు. ఈ క్యాంపు ద్వారా యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించ డంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొం దేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రూప్ చర్చలతోపాటు ప్రశ్న – జవాబుల సెషన్ ఉంటుందన్నారు. యోగా, ధ్యానం, భక్తి సంగీతంపై ప్రత్యేక తరగతులు నిర్వహి స్తామన్నారు. శిబిరానికి హాజరయ్యే యువత తెల్లని దుస్తులు ధరించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9177232696 ఫోన్ నెంబ ర్‌లో సంప్రదించాలన్నారు.

ఢిల్లీలో బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న లాల్‌దర్వాజా ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: దేశ రాజధాని ఢిల్లీలో నిర్వ హించనున్న లాల్‌దర్వాజా బోనాల జాతర ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ ప్రతిని ధుల బృందం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరింది. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్ యాదవ్, కన్వీనర్ అరవింద్ కుమార్ గౌడ్, మాజీ చైర్మన్లు వెంకటేష్, బంగ్లా రాజు యాదవ్, సి.రాజు కుమార్ యాదవ్, లక్ష్మీనారాయణ గౌడ్‌లతో పాటు వినోద్, విఠల్, రవి గురువారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ భవన్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు తెలి యజేసే విధంగా ఏటా ఆషాఢ మాసం బోనాలు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే నెల 8,9,10 తేదీలలో జరిగే ఉత్సవాలకు అవసర మైన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భిన్న రుచుల సమ్మేళనం...

- హైటెక్స్ వేదికగా ఏఫెయిర్ ఫుడ్ ఎగ్జిబిషన్...
- ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్, ఆర్గానిక్ ఆహార ఉత్పత్తుల ప్రదర్శన ...
- ఆకట్టుకుంటున్న గ్రామీణ రుచులు, ఆహా అనిపిస్తున్న ఆధునిక వంటకాలు...
- రుచులను ఆస్వాదించిన పుల్లెల గోపీచంద్..





సాక్షి, సిటీబ్యూరో: డెయిరీ, ఆర్గానిక్‌తో పాటుగా ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్ రంగాల్లోని విప్లవాత్మక మార్పులను, సరికొత్త ఆవిష్కరణలను ప్రదర్శించ డానికి నగరం వేదికగా ఫుడ్ ఎ' ఫెయిర్' ప్రారం భమైంది. మూడు రోజుల ఆహార ఉత్పత్తుల ప్రద ర్శనను దక్షిణాదిలోని ఫుడ్–బేవరేజ్ రిటైల్, మోడ్రన్ ట్రేడ్‌కు అనుబంధంగా గురువారం నగ రంలోని హైటెక్స్ వేదికగా ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తెలంగాణా ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (టీఎఫ్‌పీఎస్) డైరెక్టర్ అఖిల్ గవార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లెల గోపీచం ద్ మాట్లాడుతూ..వినూత్న ఆలోచనతో ఏర్పాటు చేసిన ఈ ఫుడ్ ఫెయిర్ ఆకట్టుకుందన్నారు. కొన్ని స్వయం సహాయక బృందాలు జొన్న రొట్టెలు, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ వంటి విభిన్నమైన ఉత్పత్తులు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రస్తుత కాలంలో విచ్చలవిడిగా ఎరువులు వాడుతూ., భూమిని నాశనం చేస్తుమని,. దీనిని నివారించడా నికి ఆర్గానిక్ వ్యవసాయం తప్పనిసరి కావాలని ఆకాంక్షించారు.

ఊరి నుంచి అమెరికాకు పచ్చళ్లు...



సిద్దిపేట జిల్లాకు చెందిన ఇర్కోడ్ గ్రామం మాది. మహిళా సంఘంలోని 9 మందిమి కలిసి పచ్చళ్ల వ్యాపారం మొదలు పెట్టాం. ఐదేళ్ల క్రితం ప్రారంభించిన ఈ చిరువ్యాపారం ప్రస్తుతం అమెరికా, దుబాయ్ వంటి దేశాలకు పంపిణీ చేయగలుగుతున్నాం. ప్రతి నెల 2 వందల కిలోల పచ్చళ్లను అమ్ముతున్నాం. చికెన్, మటన్ వంటి నాన్‌వెజ్ పచ్చళ్లతో పాటు టమాట, చింతకాయ, పండుమిర్చి, నిమ్మకాయ వంటి పచ్చళ్లను పెడుతున్నాం. మొదట్లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నగరంలోని చెంగి చెర్ల వేదికగా శిక్షణ ఇచ్చారు. ఆ అనుభవంతో స్వయంగా వ్యాపారం ప్రారంభించాం . ప్రస్తుతం ఆర్డర్లు పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం నుంచి లోన్ తీసుకుని ఉత్పత్తిని పెంచాం. ఏడాదికి రూ. 15 లక్షల వరకు పచ్చళ్లను అమ్ముతున్నాం.

– చందన, ఇర్కోడ్ పచ్చళ్లు సభ్యురాలు

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా... ఎడిబుల్ కప్పులు



ప్లాస్టిక్ వాడకానికి ప్రత్యామ్నాయంగా రాగిపిండితో టీ, ఐస్‌క్రీం కప్పులను తయారు చేస్తున్నారు. ప్రతి రోజు 5, 6 వం దల ఈ ఎడిబుల్ కప్పులు తయారు చేస్తు న్నాను. రాగిపిండి, మైదా, చక్కెర సమ్మే ళనాలతో తయారు చేసిన ఈ కప్పులు వేడి వేడి ఛాయ్ పోశాక 20 నిమిషాల వరకు కరగకుండా ఉంటుంది. టీ తాగాక ఈ కప్పులను తినవచ్చు. 6 నెలల క్రితం ప్రారంభించిన ఈ వ్యాపారం మెల్లిగా ఆదరణ పొం దుతుంది. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే కేన్సర్ వంటి రోగాలకు నివా రణగా ఈ కప్పులు పనిచేస్తాయి.

– శ్రీదేవి, యాద్గార్‌పల్లి, కీసర

అడవుల సంరక్షణలో అటవీ శాఖ అధికారుల పాత్ర కీలకం



సుభాష్‌నగర్: వాతావరణ సమతుల్యత దెబ్బతిన డంతోనే అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులు తలెత్త తున్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అడవుల సంరక్ష ణలో అటవీ శాఖ అధికారుల పాత్ర ఎంతో కీల కమని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ సంచాలకులు ఎస్.జె.షా అన్నారు. గురువారం దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 22వ బ్యాచ్ అటవీ సెక్షన్ అధికారుల స్నాతకోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై షా శిక్షణ పూర్తి చేసుకున్న 16 మంది అధి కారులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. అనంతరం సెక్షన్ అధికారుల కోర్స్ డైరెక్టర్ ఎస్. ఎ.నాగినీ భాను, శిక్షణ కార్యక్రమం రిపోర్టును సమర్పించారు. భూపాలపల్లి జిల్లా మహాదేవ పూర్ డివిజన్ కు చెందిన వినోద్ కుమార్ అత్య ధికంగా ఐదు బంగారు పతకాలను సాధించగా ఆదిలాబాద్ డివిజన్‌కు చెందిన వి.సరిత(3), జి.శ్రీనివాస్(2), ఎస్.కె.నహీదా పర్వీన్, కె. అరిస్టా టిల్, ఎస్.శ్రీకాంత్, పి.మమత ఒక్కో బంగారు పతకాన్ని సాధించారు. అనంతరం వారిని ఉద్దేశిం చి ఎస్‌జె షా మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఫారెస్ట్ అధి కారులు ఎ.కిషన్, జి.రవీందర్, అకాడమీ అద నపు సంచాలకులు ఎస్. రమేష్, సంయుక్త డైరెక్టర్ బి.ప్రవీణ, డిప్యూటీ డైరెక్టర్లు సి.హెచ్.గంగారెడ్డి, వి.ఆంజనేయులు, వి.రామ మోహన్, ఎన్.ఆర్. సంగీత పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై కోదండరెడ్డి ఫిర్యాదు

ముషీరాబాద్: సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా తనపై ఆరోపణలు చేస్తూ తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించిన కాంగ్రెస్ నాయకుడిపై ముషీరా బాద్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కిసాన్‌సెల్ ఉపాధ్య క్షులు కోదండరెడ్డి సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసుల కథనం మేరకు వివ రాలిలా ఉన్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడి అడ్మిన్‌గా ఉన్న ఓ వాట్సాప్ గ్రూప్‌లో మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డిపై ఆరోపణలు చేస్తూ వాయిస్ మెసేజ్‌ను అదే డివిజన్ జవహర్‌నగర్‌కు చెందిన డికె శ్రీనివాస్ పోస్టు చేశాడన్నారు. సదరు మెసేజ్‌లో తన పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు ఉన్నాయని, వాటిని నిరాధార ఆరోపణ లుగా పేర్కొన్నారు. వాయిస్ మెసేజ్ పోస్ట్ చేసిన శ్రీనివాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

అలరించిన పేరిణి సప్తతాండవాలు



కళాకారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పీఆర్‌కే నాట్యప్రపంచం ఆధ్వ ర్యంలో గురువారం రవీంద్రభారతిలో పేరిణి సప్త తాండవాలు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ జాతీయ అవార్డు గ్రహీత పేరిణి రాజ్‌కుమార్ నృత్య రూప కల్పన చేసిన నాట్యం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృ ష్ణారావు మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం కళాకా రులకు అండగా ఉంటుందన్నారు. శివతాండవం పేరిటి కళాకారులు చేసిన నృత్య రూపకం ఎంతో బాగుందని కొనియాడారు. రాబోయే రోజుల్లో మరింత మంది కళాకారులకు ఈ పేరిణి నృత్య రూపకాన్ని పరిచయం చేయాలని కోరారు. అంతకు ముందు 70 మంది చిన్నారులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. మామిడి హరికృష్ణ, శివకుమార్, శేషుబా బు, పేర్ని ప్రకాష్, పాల్గొన్నారు.

ముగ్గురికి యావజ్జీవ శిక్ష

ఐదుగురి హత్య కేసులో హైకోర్టు తీర్పు

సాక్షి, హైదరాబాద్ : అంబర్‌పేటలో ఒకే కుటుంబా నికి చెందిన ఐదుగురిని హత్య చేసిన కేసులో ముగ్గు రికి హైకోర్టు యావజ్జీవశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. నేరపూరిత కుట్రకు పాల్పడ్డారనే అభియోగాల నుం చి నిర్దోషులుగా విడుదలైన తొమ్మిది మందిలో ముగ్గురికి శిక్షపడింది. ఈ మేరకు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ జువ్వాడి శ్రీదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం తీర్పు వెలువరించింది. నిందితులు సయ్యద్ జహంగీర్, అతని సోదరుడు సయ్యద్ కరీం , బావ షేక్ జబ్బర్ హుస్సేన్‌లను దోషులుగా తేల్చింది. కుటుంబ హత్య కేసులో నిందితులుగా ఉన్న ఈ ముగ్గురితో పాటు మరో ఆరుగురిని నిర్దో షులుగా ప్రకటిస్తూ 2012లో హైదరాబాద్‌లోని మొదటి అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. రెండో నిందితుడు సయ్యద్ షెర్ఫుద్దీన్ షరీఫ్‌ను కూడా దోషిగా తేల్చగా, క్రిమినల్ అప్పీల్ పిటిషన్ పెండిం గ్‌లో ఉన్న సమయంలో షరీఫ్ మరణించడంతో అతనిపై చర్యలకు ఆదేశాలు జారీ చేయలేదు. ట్రయల్ కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన మిగిలిన ఐదుగురు నిందితులకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని తేల్చింది. ఎఫ్ఐఆర్‌లో ఇద్దరి పేర్లు మాత్రమే ఉన్నాయని కింది కోర్టు చెప్పడాన్ని తప్పుపట్టింది. ఇలాంటి కేసుల్లో ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. ఫోరెన్సిక్ నివేదిక కూడా కీలకమని గుర్తు చేసింది.

దంపతుల మధ్య విభేదాలతో...

సయ్యద్ జహంగీర్ 2008లో నేహా అఫ్రీన్‌ను వివాహం చేసుకున్నాడు. పెళ్లయిన కొద్దినెలలకే వారి మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో ఆమె తన తల్లి దండ్రులైన మహమ్మద్ ఖమరుద్దీన్, సాజిదా బేగం ల వద్దకు వెళ్లింది. నేహాఅఫ్రీన్ ఫిర్యాదుతో అత్తమా మలపై క్రిమినల్ కేసు. భర్తపై వరకట్న నిషేధ చట్టం కింద కేసు నమోదైంది. కేసు విచారణకు హాజరై కోర్టు నుంచి ఇంటికి వెళుతుండగా, జరిగిన రోడ్డు ప్రమా దంలో జహంగీర్ తల్లి మరణించింది. దీంతో జహం గీర్ తన భార్య, ఆమె కుటుంబంపై కక్ష పెంచుకు న్నారు. మే 30, 2010 తెల్లవారుజామున, జహంగీర్, అతని ఇద్దరు సోదరులు, బావ, మరో ఐదుగురు అత్తమామల ఇంట్లోకి చొరబడి ఆయుధాలతో నేహా అఫ్రీన్, ఆమె తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులను దారుణంగా హత్య చేశారు. అఫ్రీన్ మరణవాం గ్మూలం నమోదు కాలేదని చెప్పి నిందితులను నిర్దోషులుగా విడుదలకు కింది కోర్టు ఇచ్చిన తీర్పును తప్పుపట్టింది. క్రిమినల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీస్‌లోని రూల్–33 ప్రకారం, డాక్టర్ తన డిక్లరేష న్‌ను రికార్డ్ చేయడానికి ముందు గాయపడిన వారి పరిస్థితిని నిర్ధారించాలి. బాధితురాలు తన వాంగ్మూ లాన్ని ఇచ్చే పరిస్థితిలో లేనికారణంగా వాంగ్మూ లాన్ని నమోదు చేయకపోవచ్చునన్న విషయాన్ని కిం దికోర్టు విస్మరించి ఉదాసీనంగా తీర్పు చెప్పిందని తేల్చింది. ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారా గార శిక్ష విధించింది. నెల రోజుల్లోగా సంబంధిత కోర్టులో లొంగిపోవాలంది. నిందితులకు రూ.20 వేలు చొప్పున జరిమానా విధించింది.

భారత్–జపాన్ దేశాల సంబంధాలు బలోపేతం కావాలి

జపాన్ రాయబారి హిరోషిసుజుకీ



రాయదుర్గం: భారత్–జపాన్ దేశాల ఆర్థిక, సాంస్కృ తిక సంబంధాలు మరింత బలోపేతం కావాలని జపాన్ రాయబారి హిరోషిసుజుకీ అన్నారు. గురు వారం ఆయన కొండాపూర్‌లోని నారా జపాన్ హబ్(ఎన్‌ఆర్‌జేహెచ్)ను జపాన్ ప్రతినిధి బృందం లో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌జేహెచ్ వద్ద అసాధారణమైన సౌకర్యాలు, ప్రామాణికమైన జపనీస్ వాతావర ణాన్ని సృష్టించడం అభినందనీయమన్నారు. భారత దేశంతో జపాన్ సంబంధాలను పెంపొందించడంలో గణనీయమైన సహకారాన్ని అందించినందుకు ఎన్‌ఆ ర్‌జేహెచ్ వ్యవస్థాపకులు రామభద్ర, నాగనాథ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా హబ్ పనితీరు, వివిధ కార్యకలాపాలపై వారికి వివరించారు. ఆయన వెంట జపాన్ ప్రతినిధులు మిహోకోనగాయ్, కోజి హర, కాన్సుల్ నవోకాయుజువా, సీనియర్ ఎకనా మిక్ అనలిస్ట్ ఏ లక్ష్మీ ఉన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 14-6-2024

ఫ్యాషన్








శారీనే... స్టయిల్ మారింది!

సౌకర్యంగా ఉండే ఫ్యాషనబుల్ డ్రెస్సుల కోసం నవతరం ఎప్పుడూ వెతుకుతుంటుంది. అలాగని సంప్రదాయాన్ని వదిలిపెట్టదు. ఈ విషయాలపై స్పష్టత ఉన్న డిజైనర్లు చీరను ఎన్ని హంగులుగా తీర్చిదిద్దుతున్నారో చూడాల్సిందే! డ్రెస్‌ను పోలి ఉండేలా.. శారీ అనిపించేలా ఇండోవెస్ట్రన్ లుక్‌తో ఆకట్టుకునేలా యంగ్‌స్టర్స్ ఆలోచనలకు తగినట్టుగా డిజైన్ చేస్తున్నారు.

ఖఫ్తాన్ శారీ

ఈ డిజైన్ శారీ లాంగ్ గౌన్‌ను తలపిస్తుంది. శారీ గౌన్‌లా కనిపిస్తుంది. ప్లెయిన్ శారీకి కుచ్చులు సెట్ చేసి, పల్లూ భాగాన్ని మాత్రం ఖఫ్తాన్ స్టైల్‌లో డిజైన్ చేయాలి. నెక్ భాగాన్ని కూడా పల్లూ డిజైన్‌లో వచ్చేలా సెట్ చేయాలి.

అన్ని రకాల ఫ్యాబ్రిక్

కాటన్, సిల్క్, చందేరీ... ఏ ఫ్యాబ్రిక్ శారీ అయినా ఈ డిజైన్‌కు వాడచ్చు. పల్లూను కుర్తా స్టైల్‌లో ధరించి, నడుము భాగంలో బెల్ట్ సెట్ చేస్తే మరో శారీ స్టైల్ మీ సొంతం అవుతుంది.

సౌకర్యంగా

భుజం మీదుగా తీసే కొంగు భాగంలో డిజైన్‌ను బట్టి హ్యాండ్ స్టైల్‌ను అమర్చుకోవచ్చు. ఇది సౌకర్యంగానూ, స్టైల్‌గానూ కనిపిస్తుంది.

ఎంబ్రాయిడరీ

పల్లూ మధ్య భాగంలో ఖఫ్తాన్‌కి మెడ నుంచి ఎంబ్రాయిడరీ వర్క్‌తో ప్లెయిన్ శారీని కూడా మెరిపించవచ్చు.

ఆభరణాల అమరిక

హెయిర్‌స్టైల్ మోడల్స్ లేదా ఆభరణాల ఎంపిక ఈ స్టైల్ డ్రెస్‌కు అంతగా అవసరం లేదు. శారీనే న్యూ లుక్‌తో ఆకట్టుకుంటుంది కాబట్టి ఇతరత్రా అలంకరణా సింపుల్‌గా ఉంటేనే చూడముచ్చటగా ఉంటుంది.

వంటిల్లు

ఫాస్టింగ్‌ని ఇలా బ్రేక్ చేద్దాం

రేపు ఉదయం దోసెలు కావాలంటే...
ఈ రోజు ఉదయమే పప్పు నానబెట్టాలి.
అప్పటికప్పుడు చేసుకోవాలంటే...
ఇదిగో... ఇవి ప్రయత్నించండి.
దినుసుల కోసం బజారుకెళ్లక్కర్లేదు.
పోపుల పెట్టె ముందు పెట్టుకోండి.
ఫ్రిజ్ తెరిచి అరలన్నీ వెతకండి.
ఇక బాణలి పెట్టి స్టవ్ వెలిగించండి.

బ్రెడ్ ఉప్మా



కావలసినవి: బ్రెడ్ ముక్కలు – 3 కప్పులు; నూనె లేదా నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు; అల్లం తురుము – టీ స్పూన్; వెల్లుల్లి తురుము – టీ స్పూన్; పచ్చిమిర్చి ముక్కలు – 2 టీ స్పూన్లు; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు; టొమాటో ముక్కలు – కప్పు; పసుపు – అర టీ స్పూన్; మిరప్పొడి – టీ స్పూన్; టొమాటో కెచప్ – టేబుల్ స్పూన్; నిమ్మ రసం– 2 టీ స్పూన్లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఆవాలు – 2 టీ స్పూన్లు; కరివేపాకు– 1 రెమ్మ; తరిగిన కొత్తిమీర– టేబుల్ స్పూన్; నీరు– 2 టేబుల్ స్పూన్లు.

తయారీ: ● వెడల్పుగా ఉన్న బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు వేయాలి. ఆవాలు వేగిన తర్వాత అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి మీడియం మంట మీద రెండు నిమిషాల పాటు వేయించాలి. ఇప్పుడు టొమాటో ముక్కలు, పసుపు, మిరప్పొడి, నీరు వేసి కలిపి మూత పెట్టి రెండు లేదా మూడు నిమిషాల పాటు ఉడికించాలి. అడుగు పట్టకుండా మధ్యలో కలుపుతూ ఉండాలి. ఇప్పుడు టొమాటో కెచప్, నిమ్మరసం, ఉప్పు వేసి కలిపి ఓ నిమిషం పాటు మగ్గనివ్వాలి. చివరగా బ్రెడ్ ముక్కలు, కొత్తిమీర వేసి సమంగా కలిసేటట్లు కలుపుతూ ఓ నిమిషం పాటు వేయించి దించేయాలి.

గమనిక : బ్రెడ్ ఉప్మా చేయడానికి తాజా బ్రెడ్ మాత్రమే కాదు గట్టిపడిపోయిన బ్రెడ్‌తో కూడా ఉప్మా చేసుకోవచ్చు.

వీట్ వెజిటబుల్ చీలా

కావలసినవి: గోధుమ పిండి – 2 కప్పులు; టొమాటో ముక్కలు – పావు కప్పు (సన్నగా తరగాలి); ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు (సన్నగా తరగాలి); క్యారట్ తురుము – పావు కప్పు; తరిగిన పచ్చిమిర్చి – టీ స్పూన్; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్లు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నీరు – 2 కప్పులు (చిక్కదనం చూసుకుని అవసరమైతే పెంచుకోవచ్చు); నూనె – టేబుల్ స్పూన్;


తయారీ: ● గోధుమ పిండిలో ఉప్పు వేసి నీరు పోసి పెరుగు చిలికే బీటర్‌తో చిలకాలి. ఇప్పుడు నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నింటినీ వేసి కలపాలి. ● పెనం వేడి చేసి పెనాన్ని పచ్చి ఉల్లిపాయతో రుద్దాలి. ఇప్పుడు గోధుమపిండి మిశ్రమం ఒక గరిటె వేసి



జాగ్రత్తగా రుద్దాలి. దోశెలాగ పలుచగా రుద్దకూడదు. ఊతప్పంలాగ మందంగా ఉంచాలి. ఈ గోధుమపిండి అట్టు చుట్టూ అర టీ స్పూన్ నూనె వేయాలి. మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు దోరగా కాలిన తర్వాత తిరగేసి రెండోవైపు కూడా కాలనివ్వాలి. ఇలాగే పిండినంతటినీ అట్లు వేసుకోవాలి. ఈ వీట్– వెజిటబుల్ చీలాని చట్నీ లేదా సాంబార్‌తో తింటే రుచిగా ఉంటుంది.

మల్టీగ్రెయిన్ మేథీ థెప్లా

కావలసినవి: గోధుమపిండి – కప్పు; జొన్న పిండి – అర కప్పు; రాగి పిండి – అర కప్పు; సజ్జ పిండి– అర కప్పు; మెంతి ఆకులు – అర కప్పు (తరగాలి); నువ్వులు – టేబుల్ స్పూన్; అల్లం – పచ్చిమిర్చి పేస్ట్ – టీ స్పూన్; నూనె – టీ స్పూన్; అవిశె గింజలు –



2 టేబుల్ స్పూన్లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె– 3 టేబుల్ స్పూన్లు.

తయారీ: ● పైన చెప్పుకున్న పదార్థాల్లో నూనె మినహా మిలిగినవన్నీ ఒక వెడల్పు పాత్రలో వేసి గరిటెతో కలపాలి. తర్వాత నీటిని పోసి చపాతీ పిండిలా కలపాలి. ● పిండిని పెద్ద నిమ్మకాయంత గోళీలుగా చేసుకుని చపాతీలా వత్తి పెనం మీద వేసి, కొద్దిగా నూనె చిలకరించి రెండు వైపులా చపాతీ కాల్చినట్లే దోరగా కాలిస్తే మల్టీగ్రెయిన్ మేథీ థెప్లా రెడీ. వీటిని ఇక వేరే కాంబినేషన్ అవసరం లేకుండా నేరుగా తినవచ్చు. పప్పు లేదా కూరలతో కూడా తినవచ్చు. లంచ్‌కి ప్యాక్ చేసుకుని వెళ్లడానికి కూడా అనువుగా ఉంటాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో రెండు తింటే చాలు, మధ్యాహ్నం వరకు ఆకలి వేయదు.

బైపోలార్ డిజార్డర్

నీకు నువ్వే సాయం చేసుకో

'లెట్ ఈషా హెల్ప్ ఈషా' అనుకుందామె. 16 ఏళ్ల వయసులో తనకు 'బైపోలార్ డిజార్డర్' ఉందని డాక్టర్లు చెప్పాక ఈషా వినోద్ చోప్రా తనకు తనే సాయం చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఆ డిజార్డర్‌తో పోరాటం చేస్తూనే స్త్రీల మానసిక సమస్యల పై చైతన్యం కలిగిస్తోంది. దర్శకుడు విధు వినోద్ చోప్రా కుమార్తె అయిన ఈషా మానసిక సమస్యతో తన పోరాటంపై తాజాగా 'ఫైండింగ్ ఆర్డర్ ఇన్ డిజార్డర్' పుస్తకాన్ని వెలువరించింది. అందరూ తెలుసుకోవాల్సిన సంగతులు ఇందులో ఉన్నాయి.

భారతదేశంలో 2023 సంవత్సరంలో జరిగిన అంచనా ప్రకారం 7 కోట్ల మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వీరిలో స్త్రీల శాతం తక్కువ కాదు. మానసిక సమస్యలు 14 ఏళ్ల వయసు నుంచి కనిపిస్తాయి. 25 ఏళ్ల వయసుకు పూర్తిగా వ్యక్తమవుతాయి. కాబట్టి 14 నుంచి 25 ఏళ్ల మధ్య వయసులో పిల్లల్ని పరిశీలిస్తూ వారి సమస్యను తల్లిదండ్రులు గుర్తించగలిగితే చాలా వరకూ ఆ పిల్లలకు తమ సమస్య అర్థమయ్యి దానిని ఎలా ఎదుర్కోవాలో తెలుస్తుంది. కాని దురదృష్టవశాత్తు ఈ ఎరుక ఉన్న తల్లిదండ్రులు తక్కువ. స్కూల్ టీచర్లు తక్కువ.

'అందుకే నేను ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేటర్‌గా నా జీవితాన్ని గడపదలుచుకున్నాను. అందుకు అవసరమైన కోర్సును కెనడాలో పూర్తి చేసే దశలో ఉన్నాను. పిల్లల మానసిక సమస్యలనే కాదు... పిల్లలు నార్మల్‌గా ఉండి తల్లిదండ్రులు మానసిక సమస్యలతో బాధ పడుతున్నా పిల్లల జీవితం పెను ఒత్తిడికి లోనవుతుంది. స్కూల్ టీచర్లు ఇలాంటి సమయంలో పిల్లలకు అండగా ఉండాలి. అయితే స్కూల్ టీచర్లకు అలాంటి ట్రయినింగ్ ఉండటం లేదు' అంటుంది ఈషా వినోద్ చోప్రా.

సుప్రసిద్ధ దర్శకుడు విధు వినోద్ చోప్రా, అతని రెండవ భార్య షబ్నమ్ సుఖదేవ్‌ల సంతానం ఈషా. వారు తర్వాతి కాలంలో విడాకులు తీసుకున్నారు. 'మా తాతగారు (అమ్మ తండ్రి) ఎస్.సుఖదేవ్ గొప్ప డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకర్. ఆయనకు మానసిక సమస్యలు ఉండేవని తర్వాత తెలిసింది. నా సమస్యకు మూలం అక్కడే ఉండొచ్చు' అంటుంది ఈషా.




ఈషా

■ బైపోలార్ డిజార్డర్

ఉన్నట్టుండి బోలెడంత ఉత్సాహం రావడం, భారీ పనులు సంకల్పించడం, అతిగా మాట్లాడటం, నిద్ర పోలేక పోవడం, అయినప్పటికీ ముఖం తాజాగా ఉండటం... ఇది బైపోలార్ డిజార్డర్‌లో 'మేనియా' దశ. మరి కొన్నాళ్లకు హటాత్తుగా దేనిమీదా ఆసక్తి లేకపోవడం, నిర్లిప్తత, నిద్ర లేమి, ఏ పనీ సరిగా చేయలేకపోవడం.. ఇది 'డిప్రెషన్' దశ. ఈ రెండు దశల మధ్య ఊగిసలాడుతూ మధ్యలో నార్మల్‌గా ఉంటూ మానసికంగా అవస్థ పడే స్థితే 'బైపోలార్ డిజార్డర్'. 'నా పదహారవ ఏట డాక్టర్లు దీనిని గుర్తించారు. దీనిని ఎదుర్కొనడానికి సిద్ధమవమన్నారు' అని తెలిపింది ఈషా.

■ నీకు నువ్వే సాయం చేసుకో



'మానసిక సమస్యలు వచ్చినప్పుడు ఎవరైనా సరే మొదట తమ మీద తాము విశ్వాసం నిలుపుకోవాలి. పెద్ద కొంపలేం మునగలేదు.. నేనూ అందరి లాంటి వ్యక్తినే... ఇది ఉన్నట్టుగానే గుర్తించక నీ పనిలో పడు అని ధైర్యం చెప్పుకోవాలి. ఆ తర్వాత వైద్య చికిత్సను పూర్తిగా విశ్వసించి డాక్టర్లు చెప్పినట్టు వినాలి. ఇవేవి సరిగా చేయకపోయినా ఇబ్బందిలో పడతాం' అంటుంది ఈషా. 'నాకు డిజార్డర్ ఉందని తెలిశాక దాన్ని ఆర్డర్‌లో పెట్టడానికి నాలోని సృజనాత్మక శక్తులన్నీ వెలికి తీశాను. కథక్ నేర్చుకున్నాను. పెయింటింగ్ నేర్చుకున్నాను. మానసిక సమస్యలకు సంబంధించిన రీసెర్చ్ చేశాను. మానసిక సమస్యల చైతన్యానికై ప్రచార కర్తగా మారాను. ఈ పనులన్నీ నా సమస్యను అదుపు చేయగలిగాయి. ఒక రకంగా చెప్పాలంటే బైపోలార్ డిజార్డర్ నా జీవితాన్ని ఆర్డర్‌లో పెట్టుకునే శక్తి నాకు ఇచ్చింది. అందుకే నా అనుభవాల గురించి రాసిన పుస్తకానికి 'ఫైడింగ్ ఆర్డర్ ఇన్ డిజార్డర్' అనే పేరు పెట్టాను' అంటోంది ఈషా.

■ గట్టి బంధాలు

'హార్వర్డ్ యూనివర్సిటీలో జరిగిన ఒక పరిశోధన ప్రకారం గట్టి మానవ సంబంధాలు ఉన్నవారు ఎక్కువ ఆయుష్షుతో ఉంటున్నారట. మానసిక సమస్యలు ఉన్న పేషెంట్లను చూసుకునే తల్లిదండ్రులు, కేర్‌గివర్లు ఎంత ప్రేమగా ఉంటే పేషంట్లకు అంత ధైర్యం దక్కుతుంది. సాధారణ జీవితంలో కూడా ఆరోగ్యకరమైన మానవ సంబంధాలే మానసిక ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. దురదృష్టవశాత్తు ఇవాళ గట్టి బంధాలు ఉండటం లేదు. ఒక మనిషి ఉన్నాడనే ధైర్యమే నేడు కావలసింది. నేను నా మానసిక సమస్యను దాదాపుగా జయించడంలో నా భర్త, నా తోబుట్టువుల మద్దతు చాలా ఉంది' అని ముగించింది ఈషా.

యువర్స్

● టెక్.. టాక్

వివో ఎక్స్ పోల్డ్ 3 ప్రో



డిస్‌ప్లే: 8.03 అంగుళాలు
రిజల్యూషన్: 2200×2480 పిక్సెల్స్
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ కవర్, 32 ఎంపీ మెయిన్
బ్యాటరీ: 5700 ఎంఎహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 14
ర్యామ్: 16జీబి
స్టోరేజ్: 512జీబి బరువు: 236 గ్రా.

మోటోరోలా ఎడ్జ్ 50 ఫ్యూజన్




డిస్‌ప్లే	:	6.7 అంగుళాలు
బరువు	:	175 గ్రా.
రిజల్యూషన్	:	1080×2400 పిక్సెల్స్
వోఎస్/సాఫ్ట్‌వేర్	:	ఆండ్రాయిడ్ 14
మెమోరీ	:	128జీబి 8జీబి ర్యామ్/256జీబి 8జీబి ర్యామ్/256జీబి 12జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా	:	32 ఎంపీ బ్యాటరీ: 5000 ఎంఎహెచ్

లుక్ లైక్ ఏ మిలియన్ బక్స్

ఓవరాల్ ఎక్స్‌పీరియన్స్‌కు సంబంధించి ఒకరిని ప్రశంసించే సందర్భంలో వాడే మాట...లుక్ లైక్ ఏ మిలియన్ బక్స్. ఉదా: నీరజ లుక్స్ లైక్ ఏ మిలియన్ బక్స్ ఇన్ దట్ డ్రెస్. ఇట్స్ అబ్‌సొల్యూట్లీ స్టన్నింగ్ ఆన్ హర్.

'లుక్ లైక్ ఏ మిలియన్ బక్స్/డాలర్స్' నేపథ్యం గురించి... వన్స్ అపాన్ ఏ టైమ్... వస్తుమార్పిడిలో జింక చర్మాలు (బక్స్ కిన్స్) ప్రధానంగా ఉండేవి. వీటిని విలువైనవిగా భావించేవారు. కరెన్సీగా ఉపయోగించేవారు. తరువాత 'యూనిట్ ఆఫ్ ట్రేడ్'కు పర్యాయ పదంగా, డాలర్స్‌ను సూచించే పదంలా మారింది. యునైటెడ్ స్టేట్స్‌లో 20వ శతాబ్దం ప్రారంభంలోని సాంస్కృతిక, ఆర్థిక నేపథ్యం నుంచి 'లుక్ లైక్ ఏ మిలియన్ బక్స్/ డాలర్స్' అనే పదబంధం పుట్టింది. ఆర్థికమాంద్యం ఉన్న కాలంలో మిలియన్ డాలర్లను కలిగి ఉండడం అనేది అపారమైన సంపద, విజయం, విలాసానికి ప్రతిబింబంగా ఉండేది. కాల క్రమంలో ఈ మాటను ఆర్థిక సంబంధిత విషయాల లోనే కాకుండా దర్జాగా, అందంగా కనిపించడం... మొదలైన వాటిలో వాడడం మొదలైంది.



ఫ్లెక్సిబుల్ ట్రైపాడ్



బ్రాండ్: అడోఫిస్
కలర్: బ్లాక్ అండ్ రెడ్
కంఫర్టబుల్: సెల్‌ఫోన్
స్పెషల్ ఫీచర్: హై ఎలాస్టిసిటీ రబ్బర్

హానర్ మ్యాజిక్‌బుక్ ప్రో 16



డిస్‌ప్లే: 16.00 అంగుళాలు
రిజల్యూషన్: 3072×1920 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 165 హెచ్‌జడ్ వోఎస్: విండోస్ 11
మోడల్: మ్యాజిక్‌బుక్ ప్రో 16 కలర్స్: వైట్, పర్పుల్

● గేమింగ్



అవార్డ్ విన్నింగ్ గేమ్ డెవలపర్ స్టూడియో 'ది చైనీస్ రూమ్' ఆకట్టుకునే ఆటలకు ప్రసిద్ధి. ఈ స్టూడియో 'స్టిల్ వేక్స్ ది డీప్' తో ముందుకు వచ్చింది. ఈ సర్వైవల్ హారర్ వీడియో గేమ్ ఈ నెల 18న విడుదల కానుంది. ఫస్ట్-పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే సైకలాజికల్ హారర్ గేమ్ ఇది. ఈ పజిల్ సాల్వింగ్ గేమ్‌లో ప్లేయర్ వేసే ప్రతి అడుగు ఎంతో కీలకం. గేమ్ కథ విషయానికి వస్తే... నార్త్ సీలోని డ్యామేజ్‌డ్ రిగ్‌లో ఒక ఇంజనీర్ చిక్కుకుపోతాడు. బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒక మిస్టీరియస్ మాన్‌స్టర్ ముందుకు వస్తుంది. తాను ఆ ప్రమాదం నుంచి బయటపడడంతో పాటు ఇతరులను కూడా రక్షించాల్సి ఉంటుంది.

ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 5 ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5. ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ జానర్స్: సర్వైవల్ హారర్ మోడ్: సింగిల్ ప్లేయర్

● ఇన్నోవేషన్

సూపర్ హిట్ ట్యూన్



మన మీద మనకు నమ్మకం ఉన్నప్పుడు విజయానికి బీజం పడుతుంది.

ఆ నమ్మకానికి లోతైన ఆలోచన తోడైనప్పుడు అది మొక్కై మొలకెత్తుతుంది.

ఆ ఆలోచనకు కష్టం తోడైనప్పుడు ఆ చిన్న మొక్కే పెద్ద చెట్టుగా మారి నీడను ఇస్తుంది. పెద్ద పేరు తెస్తుంది...ఈ మాటలు ఈ ముగ్గురు మిత్రుల విషయంలో అక్షరాలా సరిపోతాయి.

హాయిగా ఉద్యోగం చేసుకోవడమా, స్టార్టప్ మొదలు పెట్టి కష్టాలు పడడమా....అనే ఆప్షన్‌లలో రెండో దాన్నే ఎంచుకున్నారు.

ఇష్టంగా కష్టపడ్డారు.

'ట్యూన్ ఏఐ' స్టార్టప్‌తో తిరుగులేని విజయాన్ని సాధించారు అన్షుమన్ పాండే, నమన్ మహేశ్వరి, రోహన్ పూనీవాలా. పెట్టుబడుల విషయంలో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించింది ట్యూన్ ఏఐ.

ఈ స్టార్టప్ ద్వారా మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) ఇంజనీర్ల కోసం సింప్లిఫై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎంఎల్ ప్రాజెక్ట్‌లు వేగంగా పూర్తయ్యే టూల్‌కిట్‌ను రూపొందించారు....

చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో చదువుకున్నారు అన్షుమన్ పాండే, నమన్ మహేశ్వరి, రోహన్ పూనీవాలా. సరికొత్త సాంకేతిక విషయాలు తెలుసుకోవడంతో పాటు వాటి గురించి లోతుగా చర్చించేవారు.

చాలామంది యువకులలాగే స్టార్టప్ కలలు కనేవారు.

చివరికి 'నింబెల్‌బాక్స్.ఏఐ' రూపంలో తమ కలను సాకారం చేసుకున్నారు.

30 దేశాల్లో పదహారు వేలమంది డెవలపర్లకు తమ సేవలను అందించింది ఈ స్టార్టప్.

'జెనరేటివ్ ఏఐ సొల్యూషన్'కు పెరుగుతున్న డిమాండ్‌ను గమనించిన ముగ్గురు మిత్రులు 'ట్యూన్ ఏఐ' ద్వారా మరో అడుగు ముందుకు వేశారు. ఈ స్టార్టప్ ద్వారా మెషిన్ లెర్నింగ్(ఎంఎల్) ఇంజనీర్ల కోసం సింప్లిఫై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను తీసుకువచ్చారు. ఎంఎల్ ప్రాజెక్ట్‌లు వేగంగా పూర్తికావడానికి అవసరమయ్యే టూల్‌కిట్‌ను రూపొందించారు.

శాన్‌ఫ్రాన్సిస్కో, చెన్నై కేంద్రంగా పని చేస్తున్న 'ట్యూన్ ఏఐ' స్టార్టప్ వినియోగదారులకు ట్యూన్ చాట్, ట్యూన్ స్టూడియోలను ఆఫర్ చేస్తోంది.

ట్యూన్ చాట్ అనేది ఏఐ చాట్ యాప్. టెక్స్ జెనరేషన్, కోడ్ జెనరేషన్, బ్రెయిన్‌స్టార్మింగ్ కోసం పవర్‌ఫుల్ మోడల్స్‌ను సిద్ధం చేస్తుంది.

ట్యూన్ స్టూడియో అనేది డేటా సెక్యూరిటీకి ఉపయోగపడుతుంది. మాన్యువల్ ప్రాసెసింగ్‌తో పోల్చితే 'ట్యూన్ ఐఏ' ద్వారా ఎంతో టైమ్ ఆదా అవుతుంది. ఖర్చు తగ్గడం అనేది మరో కోణం.

'ట్యూన్ ఏఐ'లోని అప్లైడ్ ఏఐ టీమ్ యూజ్-కేస్-డ్రివెన్ ప్రాజెక్ట్‌లపై పనిచేస్తుంది.

'ప్రతి కంపెనీ ఏఐ సాంకేతికతను ఏదో ఒక రూపంలో ఉపయోగించుకుంటుంది. ఈ నేపథ్యంలో తమ అవసరాలకు మా కంపెనీ బాగా ఉపయోగపడుతుంది' అంటున్నాడు 'ట్యూన్ ఏఐ' కో-ఫౌండర్ నమన్.

'వినియోగదారులు తమ ఎంఎల్ ప్రాజెక్ట్‌లను వేగంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ట్యూన్ ఏఐ మొదలుపెట్టాం. సంస్థల కోసం సరికొత్త రీతిలో మెషిన్ లెర్నింగ్ మోడల్స్‌ను రూపొందించాం. అడ్వాన్స్‌డ్ లాంగ్వేజ్ మోడల్స్‌తో పనిచేయడానికి మా ప్లాట్‌ఫామ్‌ను అప్‌డేట్ చేశాం. మా లక్ష్యం నెరవేరినందుకు సంతోషంగా ఉంది' అంటున్నాడు నమన్.

'ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేలాది మంది డెవలపర్ల ప్రాజెక్ట్‌ల కోసం జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించడానికి మా స్టార్టప్ ద్వారా సహాయపడాలనుకుంటున్నాం' అంటున్నారు రోహన్, అన్షుమన్, నమన్ మహేశ్వరి.

● మ్యూజిక్ వరల్డ్

పురివిప్పిన గీతాలు

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఇండి-పాప్ సింగర్, సాంగ్ రైటర్ రిదీ ఓస్వాల్ తన రూట్స్‌ను మాత్రం ఎప్పుడూ మరిచిపోలేదు. ఎనిమిది సంవత్సరాల వయసులోనే సంగీతంతో స్నేహం మొదలుపెట్టింది. చిన్నప్పుడు విన్న జాజ్, ఒపేరా తన ప్రయాణానికి గట్టి దారిని వేశాయి.

'సంగీతం నన్ను ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకువెళ్లింది. నా మనసులోని రకరకాల భావాలను ట్యూన్‌లు, పదాలతో వ్యక్తీకరించుకునే అవకాశం దొరికింది' అంటుంది రిదీ.


● రిదీ ఓస్వాల్

ఫస్ట్ సింగిల్ 'టాప్ గయ్'తో తనదైన గుర్తింపు తెచ్చుకుంది. 'ఆల్ కైండ్స్ ఆఫ్ మ్యూజిక్'కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది టాప్ గయ్. ఇందులో క్లాసిక్ ఇండియన్ ట్యూన్స్ నుంచి ఫ్రెంచ్ బీట్స్ వరకు ఎన్నో ఉన్నాయి. ఆ తరువాత వచ్చిన 'గిల్టీ ఫీట్' ఆల్బమ్‌కు కూడా మంచి పేరు వచ్చింది. 'నా ఐడెంటిటీని సెలబ్రేట్ చేసుకునే మ్యూజిక్ ఇది. పాత, సరికొత్త ప్రపంచానికి మధ్య జరిగే సంభాషణలాంటిది' 'గిల్టీ ఫీట్' గురించి అంటుంది రిదీ. మరోవైపు యునెస్కో యంగెస్ట్ స్పీకర్‌గా యాంటీ-బులియింగ్ మూమెంట్‌లో భాగం అయింది.

'బులియింగ్‌కు సంబంధించి నాకు కూడా ఎన్నో అనుభవాలు ఉన్నాయి. వాటిని ప్రపంచ వేదికపై పంచుకున్నాను. బులియింగ్‌పై పోరాటానికి నా సంగీతాన్ని సాధనంగా ఉపయోగిస్తాను' అంటుంది రిదీ.

సినిమా


● ఎన్టీఆర్

దేవర డేట్ సెట్

కొత్త రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్ (2016)' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత దర్శకుడు కొరటాల శివ-హీరో ఎన్టీఆర్ చేస్తున్న 'దేవర' రెండు భాగాలుగా విడుదల కానుంది. ఈ సినిమా తొలి భాగాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్లుగా గతంలో మేకర్స్ ప్రకటించారు. ఆ తర్వాత అక్టోబరు 10న విడుదల చేయనున్నట్లుగా వెల్లడించారు. తాజాగా మరో డేట్‌ని సెట్ చేశారు. సెప్టెంబరు 27న విడుదల చేయనున్నట్లు గురువారం వెల్లడించారు. ఇక ఇటీవలే గోవాలో 'దేవర' చిత్రీకరణ జరిగింది. నెక్స్ షెడ్యూల్ కోసం ఈ టీమ్ థాయ్‌లాండ్ వెళ్లనుందని సమాచారం. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్, సైఫ్ అలీఖాన్, శ్రుతీ మరాఠి, షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: ఆర్. రత్నవేలు.

ఇరవయ్యేడేళ్ల తర్వాత...


● సన్నీ డియోల్

ఇరవయ్యేడేళ్ల తర్వాత హిందీ హిట్ ఫిల్మ్ 'బోర్డర్'కు సీక్వెల్‌గా 'బోర్డర్ 2'ను అధికారికంగా ప్రకటించారు సన్నీ డియోల్. ఆయన హీరోగా జేపీ దత్తా దర్శకత్వంలో 1997లో వచ్చిన చిత్రం 'బోర్డర్'. 1997 జూన్ 13న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి హిట్‌గా నిలిచింది. కాగా 'బోర్డర్' చిత్రం విడుదలై గురువారం (జూన్ 13) నాటికి సరిగ్గా 27 సంవత్సరాలు. ఈ సందర్భంగా 'బోర్డర్ 2'ను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. కానీ 'బోర్డర్'కు దర్శకత్వం వహించిన జేపీ దత్తాకు బదులుగా దర్శకుడు అనురాగ్ సింగ్ సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. ''ఒక సైనికుడు తన వాగ్దానాన్ని నెరవేర్చడానికి 27 సంవత్సరాల తర్వాత తిరిగి వస్తున్నాడు. ఇండియాస్ బిగ్గెస్ట్ వార్ ఫిల్మ్'' అంటూ ఓ వీడియోను షేర్ చేశారు సన్నీ డియోల్. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, జేపీ దత్తా, నిధి దత్తా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే 'బోర్డర్' చిత్రం 1971లో జరిగిన ఇండియా-పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో ఉంటుంది. ఈ చిత్రం సీక్వెల్ కథపై స్పష్టత రావాల్సి ఉంది.

కాస్త ముందుగానే...


● 'ఖేల్ ఖేల్ మే' టీమ్...

అక్షయ్ కుమార్, తాప్సీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న హిందీ చిత్రం 'ఖేల్ ఖేల్ మే'. మదస్సర్ అజీజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ కామెడీ ఫిల్మ్‌లో వాణీ కపూర్, ప్రగ్యా జైస్వాల్, ఆదిత్యా సీల్, ఫర్దీన్ ఖాన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, విపుల్ డీ షా, అశ్విన్ వార్దే, బి. రాజేశ్, శశికాంత్ సిన్హా, అజయ్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ముందు ఈ సినిమాను సెప్టెంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ కాస్త ముందుగానే ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లుగా గురువారం ప్రకటించారు. 2016లో వచ్చిన ఇటాలియన్ కామెడీ ఫిల్మ్ 'పర్ఫెక్ట్ స్ట్రేంజర్స్'కు హిందీ రీమేక్‌గా 'ఖేల్ ఖేల్ మే' రూపొందుతోందని సమాచారం. కొంతమంది స్నేహితులు డిన్నర్‌కు కలుసుకుంటారు. వీరిలో మూడు జంటలు కూడా ఉంటాయి. ఈ డిన్నర్ సమయంలో ఒకరి గురించి మరొకరు షేర్ చేసుకునే రహస్యాలు, వీటివల్ల జనరేట్ అయ్యే కామెడీ నేపథ్యంలో 'ఖేల్ ఖేల్ మే' ఉంటుందని బీ టౌన్ టాక్.

ధైర్యం వచ్చేస్తుంది!

తమ్ముడి ప్రాణాల కోసం ఓ అక్క ఎలాంటి సాహసాలు చేసింది? ఏ విధంగా పోరాడింది? అనే అంశాల నేపథ్యంలో రూపొందుతున్న హిందీ చిత్రం 'జిగ్రా'. ఆలియా భట్, వేదాంగ్ ఈ చిత్రంలో లీడ్ రోల్స్ చేశారు. వాసన్ బాల దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించిన ఈ చిత్రానికి ఆలియా భట్ సహనిర్మాత. తొలుత ఈ సినిమాను సెప్టెంబరు 27న విడుదల చేయాలనుకున్నారు మేకర్స్. కానీ తాజాగా అక్టోబరు 11న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు. ''మన వాళ్లు ప్రమాదంలో ఉన్నారని తెలిసినప్పుడు ధైర్యం వచ్చేస్తుంది. ముందుకు నడిపిస్తుంది'' అంటూ 'జిగ్రా' సినిమా రిలీజ్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు కరణ్ జోహార్.


● ఆలియా భట్



''నాకు కమర్షియల్ సినిమాలు చేయడం ఇష్టమే. కానీ హీరో కోసం కథలో ప్రత్యేకమైన కమర్షియల్ అంశాలు ఉండకూడదు. కథలో నుంచి హీరో పుట్టాలి. అలాంటి కథలను ఎంచుకోవడానికి ఇష్టపడతాను . 'హరోం హర' ఈ తరహా చిత్రమే. తెలుగు సినిమాలోని మొదటి పది యాక్షన్ సినిమాల్లో ఎప్పటికీ 'హరోం హర' ఉంటుందని నమ్ముతున్నాను. సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం'' అని సుధీర్‌బాబు అన్నారు. సుధీర్‌బాబు హీరోగా జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సుధీర్‌బాబు పంచుకున్న విశేషాలు.

కథలో నుంచి హీరో పుట్టాలి

- సుధీర్‌బాబు

● ఈ చిత్రంలో నా పాత్ర పేరు సుబ్రహ్మణ్యం. కుప్పంలోని ఓ మెకానికల్ ల్యాబ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం. అక్కడో సమస్య ఉంటుంది. ఆ సమస్య ఏంటి? సుబ్రహ్మణ్యం ఎందుకు గన్స్ మేకింగ్‌లోకి రావాల్సి వచ్చింది? అన్నదే ఈ చిత్రకథ. కథలో కొన్ని లేయర్స్ ఉన్నాయి. అందులో మైథాలజీ అంశాలు కూడా ఉన్నాయి. నాకు తెలుగు భాష వచ్చు కాబట్టి కుప్పం యాసలో డైలాగ్స్ చెప్పడం పెద్దగా కష్టం అనిపించలేదు.

● జ్ఞానసాగర్ కథ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఇంత పెద్ద కథను చేయగలడా? అనిపించింది. కానీ నాకు చెప్పిన కథను చెప్పినట్లుగా విజువల్‌గా తెరపై చూపించాడు. ఈ విషయంలో అతనికి నూటికి నూరు మార్కులు వేస్తాను. అదే విధంగా ఇటీవలి కాలంలో తెలుగులో 'హరోం హర' లాంటి సినిమా రాలేదని నా నమ్మకం. ఈ సినిమాలో ఓ సస్పెండెడ్ పోలీస్ కానిస్టేబుల్ పళని పాత్రను సునీల్‌గారు చేశారు. సుబ్రహ్మణ్యంకు సపోర్టివ్‌గా ఉండే పాత్ర ఇది. ఈ సినిమా కథ డిమాండ్ చేసిన మేరకు ఖర్చు పెట్టారు నిర్మాత సుమంత్. 'హరోం హర'కు సీక్వెల్ తీసే స్కోప్ ఉంది. స్టోరీ లైన్ ఉంది. అయితే ఈ సినిమా రిజల్ట్‌పై సీక్వెల్ ఆధారపడి ఉంటుంది.

● జేమ్స్ బాండ్ లాంటి క్యారెక్టర్‌కి చాలా హెవీ వెపన్స్, గాడ్జెట్స్ తయారు చేస్తుంటారు. అలాంటి క్యారెక్టర్ మన ఊర్లో ఉంటే, మన పక్కింటి కుర్రాడు గన్స్ తయారు చేయాల్సి వస్తే కొంచెం నాటుగా ఉంటుంది. అందుకే 'హరోం హర' సినిమాను జేమ్స్ బాండ్ బ్యాక్‌డ్రాప్ ఇన్ కుప్పం అనొచ్చు.

● సూపర్‌స్టార్ కృష్ణగారు నన్ను మాస్ యాక్షన్ మూవీలు చేయమని చెప్పేవారు. ఆయన మంచి మాస్ హీరో. గతంలో నేను చేసినవి చాలావరకు క్లాస్ చిత్రాలు. ఇప్పుడు ఆయన ఉండి ఉంటే 'హరోం హర' నేను చేసిన మంచి యాక్షన్ మూవీ అని నమ్మకంగా చూపించేవాడిని.

● నా గత చిత్రాల్లో కొన్ని తప్పులు జరిగి ఉండొచ్చు. అవి 'హరోం హర' సినిమాలో పునరావృతం కాకుండా చూసుకున్నానని అనుకుంటున్నాను. నా ప్రతి సినిమాకు వంద శాతం కష్టపడతాను. అయితే కొన్నిసార్లు మనం ఊహించిన ఫలితాలు రాకపోవచ్చు. కానీ ఏదో ఒక మోటివేషన్‌ను తీసుకుని ముందుకు వెళ్తుంటాను.

మాజీ ప్రేమికుల కథ


అడివి శేష్ హీరోగా రూపొందుతోన్న పాన్ ఇండియన్ యాక్షన్ మూవీ 'డెకాయిట్'. అడివి శేష్ 'క్షణం', 'గూఢచారి'తో సహా పలు తెలుగు సినిమాలకు కెమెరామేన్‌గా చేసిన షానీల్ డియో 'డెకాయిట్'తో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అడివి శేష్‌కి జోడీగా శ్రుతీహాసన్ నటిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు శ్రుతీహాసన్. ఈ విషయాన్ని తెలియజేస్తూ... శేష్, శ్రుతి సరదాగా దిగిన ఫొటోను షేర్ చేశారు. ''ఇద్దరు మాజీ ప్రేమికుల కథే 'డెకాయిట్'. వారు తమ జీవితాలను మార్చడానికి వరుస దోపిడీలకు ప్రణాళిక రచిస్తారు. ఆ తర్వాత ఏం జరిగింది? అన్నది ఆసక్తిగా ఉంటుంది. హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్‌లో ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు, ఓ యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: సునీల్ నారంగ్.


● శ్రుతీహాసన్, అడివి శేష్

ఇండస్ట్రీలో ఎన్నో కష్టాలు పడ్డాను

- అజయ్ ఘోష్

''మ్యూజిక్ షాప్ మూర్తి' సినిమా కాదు.. జీవితం. ఈ మూవీలో నేను చేసిన మూర్తి పాత్రధారి కంటే ఎక్కువ కష్టాలు ఇండస్ట్రీలో పడ్డాను. ఈ జర్నీలో నా భార్య ఎంతో అండగా నిలబడింది'' అని నటుడు అజయ్ ఘోష్ అన్నారు. శివ పాలడుగు దర్శకత్వంలో అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అజయ్ ఘోష్ మాట్లాడుతూ- ''మా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్న ధీరజ్ మొగిలినేనికి థ్యాంక్స్. తెలుగు ప్రేక్షకులు గొప్పోళ్లు. వంద కోట్లు పెట్టి తీసిన సినిమానీ చూస్తారు. కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలనూ ఆదరిస్తారు'' అన్నారు. చాందినీ చౌదరి మాట్లాడుతూ- ''పది, పన్నెండేళ్ల క్రితం నేను హీరోయిన్ అవుదామనుకున్నాను. చాలా మంది నవ్వారు. నేనూ నవ్వుకున్న రోజులున్నాయి. కట్ చేస్తే.. ఈ రోజు నేను నటించిన రెండు చిత్రాలు (యేవమ్, మ్యూజిక్ షాప్ మూర్తి) రిలీజ్ అవుతున్నాయి'' అన్నారు. ''మాది చిన్న చిత్రం కావొచ్చు. కానీ, కథ, ఎమోషన్, ఆర్టిస్టుల పెర్ఫామెన్స్ మాత్రం చాలా పెద్దగా ఉంటాయి'' అన్నారు శివ పాలడుగు, హర్ష గారపాటి.


● అజయ్ ఘోష్, చాందిని, ధీరజ్

సాక్షి బిజినెస్
శుక్రవారం
14-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	204	76,811
నిఫ్టీ ▲	76	23,399

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,635	▲ 27
డోజోన్స్	38,573	▽ 139
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,163	▽ 52
డాక్స్	18,266	▽ 365
షాంఘై	3,029	▽ 9
నికాయ్	38,720	▽ 156

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,513 ▽	67
బంగారం (99.5 స్వచ్ఛత)	71,227 ▽	66
వెండి (కిలో)	87,847 ▽	345

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	83.13	84.15
£	బ్రిటన్ పౌండ్	[illegible]	105.66	108.23
€	యూరో	[illegible]	89.22	91.58
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	52.69	53.85
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	54.69	56.62
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.58	64.28
SAR	సౌదీ రియాల్	[illegible]	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.86	23.64
¥	చైనా యువాన్	[illegible]	10.40	12.47

అంబుజా చేతికి పెన్నా సిమెంట్

రూ.10,422 కోట్లకు కొనుగోలు చేసిన అదానీ గ్రూపు



సాక్షి, అమరావతి/హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తెలుగు రాష్ట్రాలకు చెందిన పెన్నా సిమెంటును అంబుజా సిమెంట్ కొనుగోలు చేసింది. అదానీ గ్రూపునకు చెందిన అంబుజా సిమెంట్, పి. ప్రతాప్ రెడ్డి కుటుంబానికి చెందిన పెన్నా సిమెంట్ 100 శాతం వాటాను రూ.10,422 కోట్లకు కొనుగోలు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియచేసింది. ఈ మేరకు ఇరు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. సిమెంట్‌తో పాటు క్లింకర్, గ్రైండింగ్, ప్యాకేజింగ్, విద్యుత్ రంగాల్లో విస్తరించింది. ప్రస్తుతం పెన్నా సిమెంట్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్‌లో ఉన్న అయిదు సిమెంట్ యూనిట్లతో కలిపి ఏడాదికి 14 మిలియన్ టన్నుల సిమెంట్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. పెన్నా సిమెంట్ కొనుగోలుతో అదానీ గ్రూపు దేశవ్యాప్త సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 89 మిలియన్ టన్నుల సామర్థ్యానికి చేరింది. ఈ ఒప్పందం ద్వారా దక్షిణ భారతదేశంలో ప్రస్తుతం రెండు శాతంగా ఉన్న మార్కెట్ వాటా 8 శాతానికి చేరుకుంటుందని, ఇదే సమయంలో శ్రీలంకలో పెన్నా సిమెంట్‌కు ఉన్న స్థానిక అనుబంధ కంపెనీ ద్వారా ఆ దేశంలో కూడా అడుగు పెట్టే అవకాశం కలుగుతుందని అదానీ గ్రూపు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ అనుమతులు అన్నీ పూర్తి చేసుకొని మూడు నుంచి 4 నెలల్లో ఈ అక్విజిషన్ ప్రక్రియ పూర్తవుతుందని అంబుజా సిమెంట్ సీఈవో అజయ్ కపూర్ తెలిపారు. అలాగే పెన్నా సిమెంట్‌కు ఉన్న సున్నపురాయి గనులు కూడా అదానీ గ్రూపునకు కలిసి వస్తాయన్నారు.

తాడిపత్రితో ప్రారంభం

పి.ప్రతాప్ రెడ్డి కుటుంబం 1994లో అనంతపురం జిల్లా తాడిపత్రి వద్ద తలారి చెరువులో ఏడాదికి 0.2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో తొలి సిమెంట్ ప్లాంటును ఏర్పాటు చేసి వేగంగా విస్తరించింది. ప్రస్తుతం తాడిపత్రి యూనిట్ సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 1.8 మిలియన్ టన్నులకు చేరడమే కాకుండా అక్కడ 1.3 మిలియన్ టన్నుల క్లింకర్ యూనిట్‌నుకూడా ఏర్పాటు చేశారు. అదే జిల్లా బోయరెడ్డి పల్లి వద్ద మరో రెండు మిలియన్ టన్నుల సిమెంట్, 4 మిలియన్ టన్నుల క్లింకర్, 25 మెగావాట్ల వేస్ట్ హీట్ రికవరీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తాండూరు వద్ద రెండు మిలియన్ టన్నుల సిమెంట్ ప్లాంటు, 1.5 మిలియన్ టన్నుల క్లింకర్, నల్గొండ జిల్లా గణేష్‌పహడ్ వద్ద 1.2 ఎంటీ సిమెంట్, 1 ఎంటీ క్లింకర్, 7 డబ్ల్యూహెచ్ వేస్ట్ హీట్ రికవరీ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. రాజస్థాన్‌లో జోధ్‌పూర్‌లో నిర్మిస్తున్న 2 ఎంటీ, కృష్ణపట్నం వద్ద నిర్మిస్తున్న మరో 2 ఎంటీ యూనిట్లు మరో ఆరు నుంచి ఏడాదిలోగా అందుబాటులోకి రానున్నాయి. నల్గొండ జిల్లా గణేష్ పహాడ్ వద్ద 77 మెగావాట్ల విద్యుత్ యూనిట్‌ను పెన్నా సిమెంట్ కలిగి ఉంది. ఈ ఒప్పందంతో కోల్‌కతా, గోపాల్‌పూర్, కరైకల్, కొచ్చి, కొలంబోలోని బల్క్ సిమెంట్ టెర్మినల్స్ ద్వారా అదానీ సీ ట్రాన్స్‌పోర్టేషన్ లాజిస్టిక్ సామర్థ్యం పెరుగుతుందని కపూర్ చెప్పారు.

12 శాతం వృద్ధి లక్ష్యం: డాలర్ ఇండస్ట్రీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డాలర్ ఇండస్ట్రీస్ 2024–25లో 12% ఆదాయ వృద్ధి లక్ష్యంగా చేసుకుంది. 2023–24లో కంపెనీ రూ.506 కోట్ల టర్నోవర్‌పై రూ.90 కోట్ల నికరలాభం ఆర్జించింది. సంస్థ అమ్మకాల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా 8 శాతంగా ఉందని ఎండీ వినోద్ కుమార్ గుప్తా మీడియాకు తెలిపారు. 'సంస్థ మొత్తం అమ్మకాల్లో దక్షిణాది వాటాను 20 శాతానికి చేరుస్తాం. ఈ ప్రాంతంలో మూడేళ్లలో 50 ఔట్‌లెట్లను తెరుస్తాం' అని అన్నారు. 2025 –26లో రూ.2,000 కోట్ల టర్నోవర్ సాధిస్తామని జేఎండీ బినయ్ కుమార్ గుప్తా తెలిపారు. బ్రాండెడ్ హొజైరీ రంగంలో కంపెనీ మార్కెట్ వాటా 15 శాతం.



మీడియాతో వినోద్‌కుమార్ గుప్తా, బినయ్ కుమార్ గుప్తా (కుడి)

సీపీఐ పుష్.. మార్కెట్ రికార్డ్స్



- సెన్సెక్స్ 204 పాయింట్లు అప్
- 76,811 వద్ద ముగింపు
- ఇంట్రాడేలో 77,145 పాయింట్లకు
- 76 పాయింట్ల వృద్ధితో 23,399కు నిఫ్టీ
- ఇన్వెస్టర్ల సంపదలోనూ కొత్త రికార్డ్

ముంబై: గత నెలలో సీపీఐ ఆర్‌బీఐ లక్ష్యం 6 శాతానికంటే తక్కువగా 4.75 శాతానికి దిగిరావడంతో వడ్డీ రేట్లు తగ్గవచ్చన్న అంచనాలు బలపడ్డాయి. దీంతో ట్రేడింగ్ ప్రారంభం నుంచి ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా రోజంతా మార్కెట్లు లాభాల మధ్యే కదిలాయి. వెరసి సెన్సెక్స్ 204 పాయింట్లు ఎగసి 76,811 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 539 పాయింట్లు జంప్‌చేసింది. ఇక నిఫ్టీ 76 పాయింట్లు పుంజుకుని 23,399 వద్ద స్థిరపడింది. తొలుత 158 పాయింట్లు ఎగసి 23,481ను తాకింది. ఇవి సరికొత్త రికార్డులుకావడం విశేషం! కాగా.. తాజా సమీక్షలో యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల యథాతథ కొనసాగింపునకే కట్టుబడింది. ద్రవ్యోల్బణం తక్కువగానే నమోదవుతున్నప్పటికీ ఈ ఏడాది వడ్డీ రేట్లలో ఒకసారి మాత్రమే కోత విధించవచ్చని పేర్కొనడం గమనార్హం!

వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు సరికొత్త రికార్డులను సాధించాయి. ఇంట్రాడేసహా ముగింపులోనూ చరిత్రాత్మక గరిష్టాలను అందుకున్నాయి. ప్రారంభంలోనే సెన్సెక్స్ 77,145 పాయింట్లను అధిగమించగా.. నిఫ్టీ 23,481కు చేరింది. రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) తగ్గడంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపునకు మొగ్గు చూపవచ్చన్న అంచనాలు మార్కెట్లకు జోష్‌నిచ్చాయి.

రియల్టీ అప్

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా రియల్టీ, కన్జూమర్ డ్యురబుల్స్, ఐటీ 2.2–1% మధ్య బలపడగా.. మీడియా, ఎఫ్‌ఎంసీజీ 1% స్థాయిలో డీలాపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో శ్రీరామ్ ఫైనాన్స్ 5% జంప్‌చేయగా.. ఎంఅండ్‌ఎం, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, దివీస్, టైటన్, ఎల్‌టీఐఎం, ఇండస్ ఇండ్, టెక్‌ఎం, టీసీఎస్, విప్రో, అ్ల్ట్రాటెక్ 3–1 మధ్య లాభపడ్డాయి. అయితే హెచ్‌యూఎల్, యాక్సిస్, పవర్‌గ్రిడ్, బ్రిటానియా, టాటా కన్జూమర్, ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ 1.6–1% మధ్య క్షీణించాయి.

మార్కెట్ క్యాప్ @ 431.67 లక్షల కోట్లు

ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్(విలువ) మరోసారి కొత్త రికార్డును లిఖించింది. గత రెండు రోజుల్లో రూ. 4.72 లక్షల కోట్లు జమకావడంతో రూ. 431.67 లక్షల కోట్లను(5.17 ట్రిలియన్ డాలర్లు) అధిగమించింది.

కార్పొరేట్ రుణాలకు డిమాండ్

- రూ. 5 లక్షల కోట్లు సిద్ధం
- ఎస్‌బీఐ చీఫ్ దినేశ్ కుమార్ ఖారా వెల్లడి



న్యూఢిల్లీ: కార్పొరేట్ రంగంలో నిర్వహణ మూలధనానికి గణనీయంగా డిమాండ్ నెలకొందని బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా తెలిపారు. దాదాపు రూ. 5 లక్షల కోట్ల మేర రుణాలు విడుదలకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో కార్పొరేట్ల దగ్గర మిగులు నిధులు పుష్కలంగా ఉండేవని కానీ ప్రస్తుతం తమ వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సామర్థ్యాల విస్తరణకు కావాల్సిన నిధులను రుణంగా తీసుకునేందుకు అవి బ్యాంకులను సంప్రదిస్తున్నాయని ఖారా వివరించారు. మరోవైపు, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉన్నప్పటికీ ఈ ఏడాది రిటైల్ వ్యవసాయం, చిన్న .. మధ్య తరహా సంస్థలకు (ఆర్‌ఏఎం) రుణాలు 16 శాతం పెరగవచ్చని ఆయన చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగ రుణాలు 16 శాతం వృద్ధి రేటుతో రూ. 21 లక్షల కోట్లకు చేరాయి. ఆర్‌ఏఎం రుణాలిచ్చేటప్పుడు రిస్కులను మదింపు చేసేందుకు చాలా కఠినతరమైన ప్రక్రియను పాటిస్తామని, వడ్డీ రేట్ల పరిస్థితులు, రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లించే అవకాశాలు మొదలైనవన్నీ పరిశీలిస్తామని ఖారా చెప్పారు. కఠినతరమైన ప్రమాణాల కారణంగా తమకు ఈ విభాగంలో ఎలాంటి సవాళ్లు లేవని వివరించారు.

వొడాఫోన్‌లో నోకియా, ఎరిక్సన్

- వెండార్లకు 166 కోట్ల షేర్లు
- రూ. 2,458 కోట్ల విలువైన వాటా జారీ



న్యూఢిల్లీ: భారీ రుణ భారాన్ని మోస్తున్న మొబైల్ రంగ కంపెనీ వొడాఫోన్ ఐడియా(వీఐఎల్)లో కీలక వెండార్ సంస్థలు నోకియా, ఎరిక్సన్ ఇండియాకు వాటా లభించనుంది. నెట్‌వర్క్ పరికరాలను సరఫరా చేసే వీటి బకాయిలను పాక్షికంగా చెల్లించేందుకు షేరుకి రూ. 14.8 ధరలో వొడాఫోన్ ఐడియా ఈక్విటీ షేర్లను కేటాయించనుంది. ఇది ఎఫ్‌పీవో ధరకంటే 35 శాతం అధికంకాగా.. ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన రూ. 10 ముఖ విలువగల 166 కోట్ల ఈక్విటీ షేర్ల జారీకి బోర్డు అనుమతించినట్లు వీఐఎల్ తాజాగా వెల్లడించింది. తద్వారా రూ. 2,458 కోట్ల విలువైన వాటాను నోకియా, ఎరిక్సన్ పొందనున్నాయి. అయితే వీటికి 6 నెలల లాకిన్ వర్తించనుంది. నోకియా సొల్యూషన్స్ అండ్ నెట్‌వర్క్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, ఎరిక్సన్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ దీర్ఘకాలంగా కీలక వెండార్లుగా సేవలందిస్తున్నట్లు వీఐఎల్ పేర్కొంది. నోకియాకు రూ. 1,520 కోట్లు(1.5 శాతం వాటా), ఎరిక్సన్‌కు రూ. 938 కోట్ల(0.9 శాతం) విలువైన ఈక్విటీని జారీ చేయనున్నట్లు వెల్లడించింది. వీఐఎల్‌లో ప్రమోటర్లు ఆదిత్య బిర్లా గ్రూప్, వొడాఫోన్ సంయుక్త వాటా 37.3 శాతంకాగా.. ప్రభుత్వ వాటా 23.2 శాతానికి చేరనుంది.

కొండాపూర్‌లో జోయాలుక్కాస్ కొత్త షోరూమ్



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలర్ జోయాలుక్కాస్ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించింది. శాసనసభ్యులు అరికపూడి గాంధీ, నటి దివి దివి వద్యా షోరూమ్‌ను ప్రారంభించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ థామస్ మాథ్యూ, సీఓఓ హెన్రీ జార్జ్, రిటైల్ మేనేజర్ రాజేష్ క్రిష్ణన్, రీజినల్ మేనేజర్ ఆంటోథామస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బిగ్'సి'లో శాంసంగ్ గెలాక్సీ ఏఐ సూపర్ సేల్



హైదరాబాద్: మొబైల్ ఫోన్ల రంగంలో దిగ్గజ సంస్థ– శాంసంగ్‌కు చెందిన గెలాక్సీ ఏ1 సిరీస్ మొబైల్స్ సూపర్ సేల్ తమ సంస్థ షోరూమ్‌లలో 14వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ప్రముఖ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ 'సి' ఫౌండర్, సీఎండీ ఎం. బాలు చౌదరి తెలిపారు. మొబైల్స్ ప్రారంభ ధర రూ.39,999 అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. జీరో డౌన్ పేమెంట్, 24 నెలల్లో నో కాస్ట్ ఈఎంఐసహా పలు ఆఫర్లను అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-6-2024

విశాఖ	530–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

సాక్షి స్పోర్ట్స్



'యూరో' పోరుకు వేళాయె!

ప్రతిష్టాత్మక 'యూరో' ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు నేడు తెర లేవనుంది. భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి గం. 12:30 నుంచి మ్యూనిక్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జర్మనీ జట్టుతో స్కాట్లాండ్ పోటీపడుతుంది. జర్మనీలోని 10 పట్టణాల్లో జరిగే ఈ టోర్నీ జూలై 14న బెర్లిన్‌లో జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. 2020 యూరో టోర్నీలో ఇటలీ జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో జర్మనీ, స్కాట్లాండ్ హంగేరి, స్విట్జర్లాండ్.. గ్రూప్ 'బి'లో స్పెయిన్, క్రొయేషియా, ఇటలీ, అల్బేనియా... గ్రూప్ 'సి'లో ఇంగ్లండ్, స్లొవేనియా, సెర్బియా... గ్రూప్ 'డి'లో నెదర్లాండ్స్, పోలాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రియా... గ్రూప్ 'ఇ'లో బెల్జియం, స్లొవేకియా, రొమేనియా, ఉక్రెయిన్... గ్రూప్ 'ఎఫ్'లో పోర్చుగల్, చెక్ రిపబ్లిక్, జార్జియా, టర్కీ జట్లు ఉన్నాయి. లీగ్ దశ ముగిశాక ఆరు గ్రూప్‌లలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన 12 జట్లు... మూడో స్థానంలో నిలిచిన నాలుగు ఉత్తమ జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. 'యూరో' టోర్నీని భారత్‌లో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

గెలిచి నిలిచిన బంగ్లాదేశ్

- నెదర్లాండ్స్‌పై 25 పరుగులతో గెలుపు
- రాణించిన షకీబ్, రిషాద్



షకీబ్

కింగ్స్‌టౌన్: టి20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ గెలిచి నిలిచింది. సూపర్–8 అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు గురువారం జరిగిన పోరులో బంగ్లా 25 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. బంగ్లాదేశ్ గెలుపుతో గ్రూప్ 'డి'లోని మరో జట్టు శ్రీలంక అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. టాస్ నెగ్గిన డచ్ జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గుచూపగా... తొలుత బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. మిడిలార్డర్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (46 బంతుల్లో 64 నాటౌట్; 9 ఫోర్లు) రాణించాడు. టాపార్డర్‌లో కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ (1), లిటన్ దాస్ (1)ల వైఫల్యంతో 23 పరుగులకే బంగ్లా 2 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మరో ఓపెనర్ తంజిద్ హసన్ (26 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి షకీబ్ మూడో వికెట్‌కు 48 పరుగులు జోడించాడు. 38 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. ఆఖర్లో మహ్మూదుల్లా (21 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), జాకిర్ అలీ (7 బంతుల్లో 14 నాటౌట్; 3 ఫోర్లు) ధాటిగా ఆడటంతో బంగ్లాదేశ్ 150 పైచిలుకు స్కోరు చేయగలిగింది. ఆర్యన్ దత్, పాల్ వాన్ మీకెరన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 134 పరుగులు చేసి ఓడింది. సైబ్రాండ్ (22 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్), విక్రమ్‌జీత్ సింగ్ (16 బంతుల్లో 26; 3 సిక్స్‌లు), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (23 బంతుల్లో 25; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడినప్పటికీ కీలకమైన దశలో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో పరాజయం తప్పలేదు. రిషాద్ హొస్సేన్ 3, టస్కిన్ అహ్మద్ 2 వికెట్లు తీశారు.

విండీస్ ముందుకు...


'సూపర్–8' దశకు మాజీ చాంపియన్ అర్హత

- మూడో లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై విజయం
- రూథర్‌ఫర్డ్ మెరుపులు
- అల్జారి జోసెఫ్‌కు 4 వికెట్లు



జోసెఫ్

తరుబా (ట్రినిడాడ్): రెండుసార్లు ప్రపంచ చాంపియన్ వెస్టిండీస్ 'హ్యాట్రిక్' విజయంతో టి20 ప్రపంచకప్‌లో 'సూపర్–8' దశకు అర్హత సాధించింది. గ్రూప్ 'సి'లో గురువారం జరిగిన పోరులో కరీబియన్ టీమ్ 13 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. ఈ గెలుపుతో విండీస్ ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. టాస్ నెగ్గిన కివీస్ బౌలింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో బ్రాండన్ కింగ్ (9), చార్లెస్ (0), నికోలస్ పూరన్ (12 బంతుల్లో 17; 3 ఫోర్లు), చేజ్ (0), కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (1) ఇలా ఐదో వరుస బ్యాటర్‌దాకా అంతా చేతులెత్తేశారు. దీంతో 30 పరుగులకే 5 వికెట్లను కోల్పోయిన ఆతిథ్య జట్టును 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (39 బంతుల్లో 68 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) వీరోచిత మెరుపులతో నిలబెట్టాడు. 33 బంతుల్లో ఫిఫ్టీతో అతను తన కెరీర్ బెస్ట్ స్కోరు సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు బౌల్ట్, సౌతీ, ఫెర్గూసన్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం కష్టమైన లక్ష్యం కాకపోయినా న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 136 పరుగులకే పరిమితమై ఓడిపోయింది. గ్లెన్ ఫిలిప్స్ (33 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా, ఫిన్ అలెన్ (23 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్), సాన్‌ట్నర్ (12 బంతుల్లో 21 నాటౌట్; 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. విండీస్ పేసర్ అల్జారి జోసెఫ్ (4/19), స్పిన్నర్ గుడకేశ్ మోతి (3/25) కివీస్‌ను దెబ్బ తీశారు. దీంతో 2021 రన్నరప్ న్యూజిలాండ్ ఈసారి లీగ్ దశ నుంచే ఇంటిముఖం పట్టడం దాదాపు ఖాయమైంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన కివీస్ ఇంకా పాయింట్ల ఖాతానే తెరువలేదు. నేడు పాపువా న్యూగినీతో జరిగే గ్రూప్ 'సి' మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ విజయం సాధిస్తే న్యూజిలాండ్ తమ రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ 15న ఉగాండాతో, 17న పాపువా న్యూగినీతో ఆడుతుంది.



రూథర్‌ఫర్డ్

టి20 ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X పాపువా న్యూగినీ
వేదిక: ట్రినిడాడ్; ఉదయం గం. 6 నుంచి

అమెరికా X ఐర్లాండ్
వేదిక: లాడెర్‌హిల్; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

106 రోజుల్లో నిర్మాణం... మరికొన్ని రోజుల్లో నేలమట్టం!

న్యూయార్క్ స్టేడియం నేటి నుంచి కూల్చివేత



న్యూయార్క్: ప్రస్తుత టి20 ప్రపంచకప్ కోసం న్యూయార్క్‌లో కేవలం 106 రోజుల్లో శరవేగంగా నిర్మించిన నాసా కౌంటీ క్రికెట్ స్టేడియాన్ని కూల్చివేయనున్నారు. ఆస్ట్రేలియా (అడిలైడ్)లో తయారు చేసిన 'డ్రాప్ ఇన్' పిచ్‌లతో న్యూయార్క్‌లో నాసా స్టేడియాన్ని 34 వేల సీట్ల సామర్థ్యంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాత్కాలికంగా నిర్మించింది. వెస్టిండీస్‌తో కలిసి మెగా ఈవెంట్‌కు అమెరికాలోని న్యూయార్క్, ఫ్లోరిడా, డాలస్ వేదికలు ఆతిథ్యమిస్తున్నాయి. కేవలం ఇక్కడ లీగ్ దశనే జరుగుతుంది. న్యూయార్క్‌లోని నాసా స్టేడియం 8 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చింది. ఇండో–అమెరికన్లు అధిక సంఖ్యలో ఉండటంతో ఇక్కడ భారత్... బంగ్లాదేశ్‌తో ప్రాక్టీస్ సహా నాలుగు మ్యాచ్‌ల్ని ఆడింది. 9న భారత్, పాక్ సమరం ఇక్కడే జరిగింది. ఐసీసీ ఊహించినట్లుగానే భారత అభిమానుల కోలాహలంతో స్టేడియం నిండిపోయింది. ఇక్కడ మ్యాచ్‌ల నిర్వహణ పూర్తి కావడంతో నేటి నుంచి కూల్చివేత పనులు ప్రారంభించి ఆరు వారాల్లో గతంలో ఎలా ఉందో అలాంటి యథాతథస్థితికి తీసుకొస్తారు. ఇక వేదిక విషయానికొస్తే ఆగమేఘాల మీద నిర్మించిన ఈ స్టేడియం పిచ్ అత్యంత పేలవం. టి20లకు ఏమాత్రం కుదరని పిచ్‌లపై బ్యాట్ డీలా పడటంతో మెరుపులు, ధనాధన్ లేక టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లే చిన్నబోయేలా చేసింది. క్రికెటర్లు, మాజీలే కాదు... విశ్లేషకులు, వ్యాఖ్యాతలు అంతా ఈ పిచ్‌పై దుమ్మెత్తి పోశారు. కొసమెరుపు ఏమిటంటే ఈ నెల 1న బంగ్లాదేశ్‌తో ప్రాక్టీస్ మ్యాచ్‌తో ప్రారంభోత్సవం జరిగిన ఈ స్టేడియానికి 14 (నేటి)తో కాలం చెల్లబోతుంది.

చాంపియన్ దివ్య

ప్రపంచ జూనియర్ చెస్ టైటిల్ సొంతం



గాంధీనగర్: ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన భారత యువ చెస్ తార దివ్య దేశ్‌ముఖ్ తన కెరీర్‌లో గొప్ప ఘనత సాధించింది. ప్రపంచ జూనియర్ మహిళల అండర్–20 చెస్ చాంపియన్‌షిప్‌లో విజేతగా అవతరించింది. గురువారం ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 18 ఏళ్ల దివ్య 10 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. చివరిదైన 11వ రౌండ్‌లో దివ్య 57 ఎత్తుల్లో క్రస్తెవా బెలోస్లావా (బల్గేరియా)పై గెలిచింది. నాగపూర్‌కు చెందిన దివ్య ఈ టోర్నీలో తొమ్మిది గేముల్లో నెగ్గి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. క్రచ్యాన్ మరియం (అర్మేనియా; 9.5 పాయింట్లు) రెండో స్థానాన్ని దక్కించుకోగా... అలవెర్దియెవా అయాన్ (అజర్‌బైజాన్; 8.5 పాయింట్లు) మూడో స్థానాన్ని సంపాదించింది. విజేతగా నిలిచిన దివ్యకు 2000 యూరోల (రూ. 1 లక్షా 79 వేలు) ప్రైజ్‌మనీతో పాటు స్వర్ణ పతకం, విన్నర్స్ ట్రోఫీ లభించాయి.

7 ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌గా నిలిచిన ఏడో భారతీయ ప్లేయర్‌గా దివ్య దేశ్‌ముఖ్ గుర్తింపు పొందింది. గతంలో విశ్వనాథన్ ఆనంద్ (1987లో), కోనేరు హంపి (2001లో), పెంటేల హరికృష్ణ (2004లో), ద్రోణవల్లి హారిక (2008లో), అభిజిత్ గుప్తా (2008లో), సౌమ్య స్వామినాథన్ (2009లో) ఈ ఘనత సాధించారు.

క్వార్టర్ ఫైనల్లో సిక్కి-సుమీత్ జోడీ

సింగిల్స్‌లో ప్రణయ్, సమీర్ వర్మ, ఆకర్షి ముందంజ





ప్రణయ్

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జోడీ వరుసగా రెండో విజయం సాధించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో తెలంగాణకు చెందిన సిక్కి–సుమీత్ ద్వయం 21–11, 21–11తో కాయ్ చెన్ తియో–కాయ్ కి తియో (ఆస్ట్రేలియా) జంటను ఓడించింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంక్ జోడీ జియాంగ్ జెన్ బాంగ్–వె యా జిన్ (చైనా)తో సిక్కి–సుమీత్ జంట తలపడుతుంది.

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత నంబర్‌వన్ ప్రణయ్, సమీర్ వర్మ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... కిరణ్ జార్జి ఓడిపోయాడు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సమీర్ 21–14, 14–21, 21–19తో 2021 ప్రపంచ చాంపియన్ లో కీన్ యె (సింగపూర్)ను బోల్తా కొట్టించగా... ప్రణయ్ 21–17, 21–15తో మిషా జిల్బెర్‌మన్ (ఇజ్రాయెల్)పై గెలిచాడు. కిరణ్ జార్జి 20–22, 6–21తో కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయాడు.

మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ క్వార్టర్ ఫైనల్ చేరగా... మాళవిక, అనుపమ నిష్క్రమించారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఆకర్షి 21–16, 21–13తో కాయ్ కి తియో (ఆస్ట్రేలియా)పై గెలిచింది. మాళవిక 17–21, 21–23తో ఎస్తెర్ నురిమి (ఇండోనేసియా) చేతిలో, అనుపమ 11–21, 18–21తో పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా) చేతిలో ఓటమి చవిచూశారు.



మావోల ప్రెషర్ బాంబు పేలి మహిళకు తీవ్రగాయాలు

వెంకటాపురం(కె): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలింది. గురువారం జరిగిన ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం చొక్కాల గ్రామానికి చెందిన సుమారు 100 మందికి పైగా గ్రామస్తులు డోలి సమీపంలోని అటవీ ప్రాంతంలో బెడం మల్లన్న దేవున్ని దర్శించుకునేందుకు వెళ్తున్న క్రమంలో.. కర్రిగుట్టల సమీపంలో పోలీసులను హతమార్చేందుకు మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబ్‌ను డర్రా సునీత అనే మహిళ తొక్కటంతో ఒక్కసారిగా పేలింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో పాటు ఎడమకాలు పూర్తిగా దెబ్బతింది. గ్రామస్తులు సునీతను జోలె కట్టుకొని సుమారు 30 కిలోమీటర్ల దూరం నడుచుకుంటూనే గుట్టల కిందకు దిగారు. మలాపురం గ్రామ సమీపంలోని పాలెం ప్రాజెక్టు వద్దకు వచ్చాక బంధువులు ఆమెను కారులో ఎక్కించుకొని తొలుత వెంకటాపురం ఆస్పత్రికి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

బ్లడ్ బ్యాంకులను బలోపేతం చేయాలి

మంత్రి రాజనర్సింహ ఆదేశం




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బ్లడ్ బ్యాంకులను బలోపేతం చేయాలని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో బ్లడ్ బ్యాంకుల పనితీరు, నిర్వహణ, బలోపేతంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని నారాయణగూడలో 60 ఏళ్లుగా విశిష్ట సేవలు అందిస్తున్న ఐపీఎంను బలోపేతం చేయాలన్నారు. అందులోని ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. బ్లడ్ బ్యాంకులు రక్త నిల్వలను పెంచుకోవాలని, ప్రపంచ రక్తదాన దినోత్సవం (జూన్ -14) రోజున అన్ని జిల్లా కేంద్రాల్లో బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించాలని చెప్పారు.

ఏదైనా ప్రమాదం జరిగింది, లేకుంటే ఏదో అత్యవసర సర్జరీ జరిగింది.. ట్రీట్‌మెంట్ కోసం రక్తం కావాలి. అప్పటికప్పుడు ఎవరైనా దాత దొరికితేనో, బ్లడ్ బ్యాంకుల్లో స్టాక్ ఉంటేనో సరి. లేకుంటే ఎంతో విలువైన ప్రాణాలు గాలిలో కలసిపోవడం ఖాయం. ఈ నేపథ్యంలోనే రక్తదానంపై అవగాహన కల్పించడం, రక్తదానంపై ఉన్న అపోహలు, వదంతులకు చెక్ పెట్టడం లక్ష్యంగా ఏటా జూన్ 14న 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే'ను నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

రక్తం కాదు.. ప్రాణం ఇచ్చినట్టే!



జూన్ 14నే ఎందుకు?



ఒకప్పుడు ఒకరి రక్తాన్ని మరొకరికి ఎక్కించడమనే చికిత్సే లేదు. ఒకవేళ అలా చేసినా.. బాధితులు బతికేవారు కాదు. దానికి కారణం మన రక్తం వేర్వేరుగా ఉండటమేనని ప్రముఖ శాస్త్రవేత్త కార్ల్ లాండ్‌స్టీనర్ 1990వ దశకంలో గుర్తించారు. రక్తాన్ని ఏ, బీ, ఓ గ్రూపులుగా వర్గీకరించారు. ఆయన పుట్టినరోజు అయిన జూన్ 14వ తేదీని 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే'కోసం ఎంపిక చేశారు.

రక్తదానంపై అవగాహన పెంచేందుకు..

ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మంది ప్రమాదాల బాధితులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్నవారు సరైన సమయానికి రక్తం అందక ప్రాణాలు వదులుతున్నారు. ఈ క్రమంలో రక్తదానంపై అవగాహన పెంచేందుకు ప్రఖ్యాత సంస్థలు నడుం బిగించాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ), అంతర్జాతీయ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్, రెడ్ క్రిసెంట్ సొసైటీస్ (ఐఎఫ్‌ఆర్‌సీఎస్), అంతర్జాతీయ ఫెడరేషన్ ఆఫ్ బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్స్ (ఐఎఫ్‌బీడీఓ), అంతర్జాతీయ సొసైటీ ఫర్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ (ఐఎస్‌బీటీ) సంస్థలు కలసి తొలిసారిగా 2004 జూన్ 14వ తేదీ నుంచి 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే'ను నిర్వహించడం మొదలుపెట్టాయి. దీనికి ఈ ఏడాదితో 20 ఏళ్లు పూర్తవుతుండటంతో.. '20 ఏళ్ల రక్తదానం. దాతలకు కృతజ్ఞతలు' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

పేదరికానికి 'రక్తం'లింకు

ప్రమాదాల్లో గాయపడ్డవారు, సర్జరీలు చేయించుకునేవారికే కాదు తలసేమియా, హీమోఫీలియా, ఎనీమియా వంటి వాటితో బాధపడుతున్నవారికి కూడా తరచూ రక్తం ఎక్కించడం అవసరం. ముఖ్యంగా నిరుపేద దేశాల్లో చిన్నపిల్లలు వివిధ వ్యాధులకు లోనవడం, పోషకాహార లోపం వంటి వాటితో.. రక్తం ఎక్కించాల్సిన అవసరం ఎక్కువగా ఉంటోంది.

- ప్రపంచవ్యాప్తంగా చూస్తే ధనిక దేశాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రమాదాలు, సర్జరీలు, వయసు మీదపడటం వల్ల వచ్చిన సమస్యల బాధితులకు రక్తం ఎక్కువగా ఎక్కిస్తున్నారు.
- పేద దేశాల్లో రక్త హీనత, వివిధ వ్యాధులు, పోషకాహార లోపం వంటి వాటితో బాధపడుతున్న చిన్నారులు, మహిళలకు రక్తం ఎక్కువగా అవసరం పడుతోంది.

దానం చేస్తే.. మనకూ ఆరోగ్యం!

రక్తదానం చేయడం వల్ల అవతలివారి ప్రాణాలను కాపాడటమేకాదు.. మన ఆరోగ్యాన్ని కాపాడుకున్నవాళ్లమూ అవుతామని వైద్య నిపుణులు చెప్తున్నారు. రక్తదానం వల్ల మన శరీరంలో ఐరన్ స్థాయిలు బ్యాలెన్స్ అవుతాయని.. కొత్త రక్తం ఉత్పత్తి, రక్త ప్రసరణ తీరు మెరుగుపడతాయని అంటున్నారు. ఇది గుండె సంబంధిత వ్యాధుల ముప్పును అరికడుతుందని, బరువు తగ్గేందుకూ తోడ్పడుతుందని వివరిస్తున్నారు. మొత్తంగా రక్తదాత శారీరక, మానసిక ఆరోగ్యానికి దారితీస్తుందని స్పష్టం చేస్తున్నారు.


రక్తంలో ఏభాగాన్ని ఎన్నిసార్లు దానం చేయొచ్చు?

పూర్తిస్థాయి రక్తమైతే..
90 రోజులకోసారి

ప్లాస్మా ఒకటే అయితే..
28 రోజులకోసారి

ప్లేట్ లెట్లు మాత్రమే అయితే..
14 రోజులకోసారి

ఎర్ర రక్తకణాలు మాత్రమే అయితే
112 రోజులకోసారి



ఎవరెవరు రక్తదానం చేయొచ్చు?



- పురుషులు 3 నెలలకు ఒకసారి.. మహిళలు 4 నెలలకు ఒకసారి
- వయస్సు పరిమితి 18 - 65 ఏళ్ల మధ్య
- కనీసం ఉండాల్సిన బరువు 45 కిలోలు
- దగ్గు, జలుబు, జ్వరం, ఇతర ఇన్ఫెక్షన్లు ఏవీ ఉండకూడదు.
- ఏవైనా వ్యాక్సిన్లు వేసుకున్నవారు కనీసం 15 రోజుల నుంచి నెలరోజుల్లోపు రక్తదానం చేయవద్దు.
- రక్తదానం చేసినవారు రెండు రోజుల పాటు నీళ్లు, పళ్ల రసాలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. తీవ్ర శారీరక శ్రమకు దూరంగా ఉండాలి.

భారతదేశంలో రక్తదానం పరిస్థితి ఇదీ..

ఏటా అవసరమైన రక్తం **5** కోట్ల యూనిట్లు

రక్తదాతల నుంచి అందుతున్నది **2.5** కోట్ల యూనిట్లు

దాత నుంచి సేకరించే రక్తం **350** మిల్లీలీటర్లు

ఇందుకు పట్టే సమయం **15** నిమిషాలు

ప్రపంచవ్యాప్తంగా చూస్తే ప్రతి 2 సెకన్లలో ఒకరికి రక్తం అవసరం పడుతోంది.

ఏటా ప్రపంచవ్యాప్తంగా రక్తదానాలు **11.85** కోట్లు

అందులో ధనిక దేశాల నుంచి వస్తున్నవే **40%**

పేద దేశాల్లో రక్తం ఎక్కిస్తున్న వారిలో ఐదేళ్లలోపు పిల్లలే **54%**

ధనిక దేశాల్లో రక్తం ఎక్కిస్తున్నవారిలో 60 ఏళ్లు పైబడిన వారు **76%**

(డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాల ప్రకారం)



ప్రాణం కోసం చిన్నారి పోరాటం

- అరుదైన బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న వేదవల్లి
- ఇప్పటికే రూ.40 లక్షలు ఖర్చు చేసిన తండ్రి.. మరో రూ.20 లక్షల కోసం దాతలు సహకరించాలని వేడుకోలు

సాక్షి, హైదరాబాద్: అరుదైన కేన్సర్ బారిన పడిన ఎనిమిదేళ్ల చిన్నారి కోలుకోవడానికి అష్టకష్టాలు పడుతోంది. బోన్ మ్యారో మార్పిడి చికిత్సతో పాటు కీమోథెరపీ, రేడియేషన్‌ను తీసుకుంటున్న ఈ చిన్నారి ఆర్థిక దాతల కోసం ఎదురు చూస్తోంది. ఎల్‌బీనగర్‌లో నివాసముంటున్న రఘు, మంజుల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న రఘు పెద్దమ్మాయి వేదవల్లికి బ్లడ్ కేన్సర్ సోకింది. ఇది ఏ రకమైన కేన్సర్ అని నిర్ధారించుకోవడానికి ముంబైలోని టాటా మెమోరియల్ కేన్సర్ ఆసుపత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు అత్యంత అరుదైన 'అనాప్లాస్టిక్ లార్జ్ సెల్ లింఫోమా'గా నిర్ధారించారు. పైగా ఈ చిన్నారికి 4వ దశలో ఉందని తెలిపారు. ఈ ప్రమాదకర వ్యాధి చికిత్స కోసం ఇప్పటికే రూ.40 లక్షల వరకు ఖర్చు చేసిన రఘు.. తదుపరి చికిత్సగా అధునాతన 'కార్ టి సెల్ థెరపీ' చేయాలని వైద్యులు చెప్పడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ చికిత్సల కోసం మరో 20 రూ.లక్షల వరకు అవసరపడుతుందని, ఎవరైనా దాతలు సహాయం చేసి తన కూతురును కాపాడాలని వేడుకుంటున్నాడు. సహాయం చేయాలనుకునే దాతలు 70326 42552 నెంబరుకు సంప్రదించాలని రఘు కోరారు.

రగ్బీ పోటీల్లో బీసీ గురుకుల విద్యార్థులు ఫస్ట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులు బంగారు పతకం సాధించారు. సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి ఐదవ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గురుకుల విద్యార్థులు తొలి స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నారు. విద్యార్థుల బృందాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.